
# మారుతీయం

గొల్లపూడి మారుతీరావు కవితా హృదయం





# మారుతీయం

గొల్లపూడి మారుతీరావు కవితా హృదయం

సాహితీమిత్రులు
విజయవాడ.

**MARUTEEYAM**

A Collection of Poems

**Gollapudi Maruthi Rao**

© *Gollapudi Maruthi Rao*

*First Edition* : September 2012

*Cover Painting* : ESWAR

*Inner Caricatures & Art Works* :

Bapu, Eswar, Sankar, Bujjayi, Sankar (Sakshi), Sivananda
Mokkapati Krisna Murthy, Dharanirai Chowdari

*Cover Design* : A. GIRIDHAR

*Published by*

**SAHITI MITRULU** - VIJAYAWADA

28-10-26/1, opp. Maszid, Arundalpet,

Karlmarx Road, VIJAYAWADA - 520 002

Ph. : 0866 2433359, Cell : 9490634849

*For Copies*

**Navodaya Publishers**

Karl Marx Road, Vijayawada - 2 Ph. 0866 2573500

**Navodaya Book House**

Kachiguda, Hyderabad

**Prajasakti Book House**

Chikkadapally, Hyd, and its branches in A.P.

*e book : www.kinige.com*

*Printed at*

**Sri Sri Printers**

VIJAYAWADA - 520 002

Cell : 9490 634849

₹ : **100**

**$** : **10**



## మీతో....

ఏభై సంవత్సరాల ఊసులివి....
జీవితమంతా పరుచుకున్న అన్ని రుచులూ –
తీపి, చేదూ, వగరూ, విగరూ, ప్రేమా,
చిరునవ్వూ, బాధా, కోపం, తాపం –
అన్నీ ఉన్నాయిందులో...
జీవితంలో ముసురుకున్న
ఎన్నో అనుభూతుల శయ్య ఈ కవితలు
కవిత ఆలోచనకి అందమైన ఫిలిగ్రీ నేత
మనస్సు చుట్టూ మన్నికయిన బంగారు మలామా
ఉగాది కవి సమ్మేళనాల్లో
డైరీల తొలిపేజీల్లో
టెలిఫోను పలకరింతల్లో
ప్రేయసి గుస గుసల్లో
దూరమయినప్పుడు నిట్టూర్పుల్లో
కన్నకొడుకు కలిసిరాని దుఃఖంలో
విదేశాల్లో విమానాల్లో
ఆలోచనను అక్షరాల్లో అల్లిన జవుళి ఇది...
A muse అనుభూతి చేసే ruse-
ఇందులో స్మృతులూ, నివాళులూ
విసుర్లూ, కసుర్లూ, కబుర్లూ, జీమూతపు గుబుర్లూ
ఎన్నో...ఎన్నో....
ఓ జీవితకాలపు అనుభూతుల్ని
అంతే సరసంగా, ఉదారంగా పంచుకుంటారని...

– గొల్లపూడి మారుతీరావు

# మానవీయ మారుతీయం

కవిత్వం ఉద్వేగపు ప్రాథమిక రూపం. అందుకే అది యుగాలుగా మనిషిని వదిలిపెట్టకుండా వెంట వస్తున్నది. మాటగా, మౌనంగా, ఆక్రోశంగా, ఆవేదనగా, తిట్టుగా, దుఃఖంగా బహురూపాలను ధరించి వ్యక్తీకరణ పొందుతూ ఉంటుంది. సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలోకి ప్రవేశించే వారందరికీ కవిత్వమే తొలి ప్రవేశ ద్వారం కావటానికి కారణం ఈ ఉద్వేగమే. ఆనంద, దుఃఖాలనే రెండు దరులను అంటుకుని సాగే కాలమే జీవితం అనుకుంటే అప్పుడు ఆ కాలమే అనుభవంగా కూడా మారుతుంది.

"బ్రతుకు బాధను వరియించి గతుకు వార
బాధ కవితను వరియించి యతుకు వేసె"

అన్న వాక్యం చదివినప్పుడు మారుతీరావుగారి కవిత్వం అచ్చువేయాలనిపించింది.

ఇంచుమించు ఒక అర్థశతాబ్ది కాలంగా గొల్లపూడి మారుతీరావు గారి జీవితం కళా, సాహిత్య, సామాజిక రంగాలలో విడదీయరానంతగా ముడివడిపోయింది. సుప్రసిద్ధ నాటకకర్తగా, నటుడిగా, నవలా రచయితగా, సామాజిక, రాజకీయ పరిణామాల పరిశీలకుడిగా ఆయనకొక దృక్పథం ఉంది. దాదాపు ఇప్పటి వరకు 48 పైగా వీరి రచనా వ్యాసంగం గ్రంథస్తమైంది. మంచి కథకుడు, అద్భుత నాటక రచయిత, అనన్య సామాన్య అభినయ చతురత, వచన రచనలో సిద్ధహస్తులైన మారుతీరావు గారు కవిత్వం కూడా రాశారని చాలామందికి తెలియని విషయం.

తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా ప్రవర్తిల్లిన అన్ని వాదాలు, ఉద్యమాలు, ధోరణులు అన్నిటిలో మారుతీరావు గారికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రమేయం ఉంటూ వచ్చింది. ఒక వ్యక్తిలో ఇంత వైవిధ్యభరిత కోణాలు కనిపించడం అరుదు.

మారుతీరావుగారి పేరు చెపితే "కళ్ళు" నాటకం లేదా మరొక రచన, ఇంకొక సినిమా లేదా సంభాషణ రచయిత ఎట్లా గుర్తుకొస్తారో, ఈ మారుతీయం తర్వాత మారుతీరావుగారిలో అంతర్లీనంగా ఉన్న కవి కూడా గుర్తుకొస్తారు.

అసలు ఆయన మౌలికంగా కవేననిపిస్తుంది. ఆ కవితా హృదయోద్వేగమే వివిధ ప్రక్రియలలోకి ఆయా కాల స్పృహ, సందర్భ అవసరాలమేరకు పర్యవసించింది అని కూడా గుర్తించగలం. 1960ల నుండి నిన్నమొన్నటి దాకా మారుతీరావుగారు రాసిన అసంకలిత కవితలను ఒక చోట కూర్చితే అది 'మారుతీయం' అయ్యింది. ఈ కవితలను చదివినప్పుడు మారుతీరావుగారి హృదయంలో క్షోభ, వ్యధ, ఆర్ద్రత, తపన తదితరమైనవి మౌలికంగానే గుప్తంగా ఉన్నాయని అర్థమవుతుంది. చాలా చిత్రంగా ఆయన జీవిత మలిసంధ్యలో కవితల పుస్తకం వస్తున్నది.

సాహితీమిత్రులు వీరి కవితలను చూడటం తటస్థించినప్పుడు బహుముఖ ప్రజ్ఞాశాలిలోని ఒక ముఖ్యకోణం ఇతరులకు తెలియకుండా పోతుందేమోనని బెంగ కలిగి వీటిని ఒక కూర్పుగా వెలువరిస్తే బావుంటుందని ఆలోచన కలిగింది. వారు కూడా సరేననటంతో ఈ మారుతీయం ఇలా రూపుదిద్దుకుంది.

ఇందులో కవిత్వం ఉంది. ఒక ప్రత్యేక వాదం, దృక్పథం, ధోరణి, తాత్వికత ఏదీ ప్రత్యేకంగా కనిపించక పోయినా, వివిధ జీవన దశలలో సందర్భాలలో ఆయన పడిన ఆవేదనకు అక్షర రూపంగా ఇవి నిలుస్తున్నాయి.

కవి సర్వసాధారణంగా సహృదయ పాఠకుడై ఉండాలని భారతీయ ఆలంకారిక మతం చెపుతున్నది. మారుతీరావు సహృదయ పాఠకుడే కాదు సత్కవి కూడానని ఈ కవిత్వం చదివాక మీకే అర్థమవుతుంది.

భావ వ్యక్తీకరణే ప్రధానంగా భావించటం వల్ల రూపపరమైన నిర్మాణపరమైన శ్రద్ధ అంతగా లేనట్లు కనిపిస్తుంది. కానీ, కవి రాసిన కవితాఖండికలు కాలాన్ని గనుక పరిగణనలోకి తీసుకొని చదివితే ఆనాటి కవితా యుగధర్మానుసారంగానే ఉన్నట్లు మనకు అర్థమవుతుంది.

మారుతీరావుగారిని కవిగా చూసినప్పుడు రెండు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకటి ఆయన ప్రధానంగా ప్రజాస్వామికవాది. దీనితో పాటుగా మానవతా వాది. ఈ రెండూ సమాజంలో సకల రంగాలను అవ్యవస్థలుగా కాక సువ్యవస్థలుగా చూడాలని భావిస్తాయి. ఇక మూడవ లక్షణం ఆయనది అస్తిత్వవాదం. మానవుడు సాధికారికంగా తన అస్తిత్వాన్ని అనుభవించాలని తన అస్తిత్వసారాన్ని నిరూపించుకోవాలని భావిస్తాడు. ఇదే ఇందులో ప్రధానం.

అనుభూతి విషయంలో తిలక్‌కు దగ్గరగా దృక్పథం విషయంలో త్రిపురనేని గోపిచంద్‌కి సమీపంగా కనిపిస్తారీయన.

మారుతీరావుగారి కవిత్వాన్ని ప్రచురించటం ఆయనకు కొత్తగా తెచ్చిపెట్టే పేరును ఆశించి కాదు. ఆంధ్రదేశంలోని సృజనాత్మక మేధో సంపత్తి గల ఇటువంటి వ్యక్తుల ఆలోచనా ధారను కాలక్రమానుగతంగా అర్థం చేసుకోవటానికి ఒక ఉపకరణంగా ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ఎన్నో విశేషాంశాలున్నాయి. వాటిని సద్విమర్శకలోకం చర్చించి మారుతీయాన్ని మరింత మానవీయంగా ఆవిష్కరిస్తుందని భావిస్తాం. ప్రచురణకు సమ్మతించిన మారుతీరావుగారికి కృతజ్ఞతలు.

సాహితీమిత్రులు విజయవాడ పక్షాన

**మీ విశ్వేశ్వరరావు**

## సరిగమపదని....


**ప్రేమ గీతాలు :** 9

అప్పుడు... 11

నేస్తం... 12

మంచుబొట్టును... 13

నీ ఏకాంతం 14

నాలోనేను 15

నువ్వు... 16

భయం 17

ఉదయం 18

సప్తపది 19

రాలిన పూలు 21

రాలిన పూలు - మరికొన్ని 23

ఒంటరితనం... 27

ఆలోచనల్ని.... 28

టెలిఫోన్ తరంగాలు.... 29

**ఆసుపత్రి పాటలు** 31

ఆసుపత్రిలో వసంతం... 33

రోడ్డుమీద నీకోసం... 34


స్వాగతపత్రం... 36

షష్ఠ్యంతం... 38

నగరం నడిరోడ్డు మీద... 39

**వాసు స్మృతులు :** 41
స్మృతి 43
ఒక ఆర్తి... 45
**మళ్ళీ మళ్ళీ వసంతం :** 47
ఆశల అరుణోదయం... 49
పునరుక్తి... 50
మళ్ళీ.. మళ్ళీ.. 51
**ఉగాది కవితలు :** 53
ఎదురు సన్నాహం... 55
సరికొత్త ప్రేమలేఖ... 58
నిన్నటి ఉత్తరానికి తాజాకలం... 63
నేను రాసిన మా ఆవిడ ఉత్తరం... 67
పంచముఖి 70
ఉగాది గీత 73
కొత్తబాణీలో పాతపాట... 76
సంపాదకునికో లేఖ 79
రైలు ప్రయాణం 83
'వ్యయ' ప్రయాస 87
**స్వాతంత్ర్యం గీతం :** 93
అరెస్టు వారెంట్... 95
**ఏరిన పూలు :** 103
నిత్య సత్యాలు... 105
అంతరాలు 106
మినీ కవిత 108
జ్ఞాపకాలు 109
బడ్జెట్ ప్రతిపాదన 111
చీకటి ఆకాశం మీద... 115
నీ ఆలోచనల్తో... 117

| | |
|---|---|
| అవ్యవస్థ | 119 |
| పెద్దపులికి పెంపుడు జంతువు | 120 |
| అమెరికా పాటలు | 121 |
| **హైకూలు...** | 123 |
| భయం | 125 |
| సాయంకాలం | 137 |
| విశ్వాసం | 131 |
| ప్రయాణం | 133 |
| అన్నా! అన్నన్న ! | 134 |
| **పాటలు :** | 137 |
| రంగవల్లి | 139 |
| ఏదీ ఏదీ చూడనీ... | 140 |
| ఎన్నాళ్ళీ తలపులు... | 141 |
| ఒకటీ ఒకటీ రెండూ... | 142 |
| లాలస | 143 |
| వెన్నెల రేయెటు... | 144 |
| హృదయాన తావి... | 145 |
| **పల్లవులు :** | 141 |
| ఎదురు చూడనిక... | 149 |



# ప్రేమ గీతాలు



## అప్పుడు

ప్రాభాత మలయానిలం తన ముని వేళ్ళతో నీ చెక్కిలి మీటినప్పుడు
పూర్వజన్మ స్మృతిలాగ ధాత్రీ వదనం మీద చిక్కని చిరునవ్వుని తిలకించినప్పుడు
సంజె పెదవులు నీ గుండె లోపలి పొరల్లో నీ అనుభవంలోకి
తొంగి చూసిన పాత అనుభవాన్ని తట్టిలేపినప్పుడు
పట్టపగలే నీ హృదయాంబరంలో పట్టుదారాలు వేలాడదీసినట్టు
ఆశా తారకలు బారులు తీర్చినప్పుడు
ఒక్క కన్నీటి బొట్టు నీ కంటి కొనల్లో మణిదీపంలాగ వెలిగినప్పుడు
కలలో – విస్మృతిలో నేను లేనన్న భయం నీ ప్రఫుల్ల మనః ఫలకాన్ని
పిచ్చి గీతలతో కలవర పరిచినప్పుడు
రస హీనమయిన క్షణం దైనందిన జీవన యాత్రలో నిన్ను ఒరుసుకున్నప్పుడు
చల్లని వెన్నెల్లాంటి ఆలోచనల్ని వర్షించే నీ చేతన చలిమంటముందు వణుకుతున్నప్పుడు
నేను లేని క్షణంలో నాగరకత నీ కళ్ళముందు
నగ్న సౌందర్యంలాగ దర్శనమిచ్చినప్పుడు
కడుపులో ఆకలి కరేల్మనిపించినప్పుడు
నీ ఊపిరి నీకే బరువయినప్పుడు
ఎదుర్కోవలసిన ప్రతి బాధ్యతా
కుబుసం విప్పన త్రాచులాగ ఎదురుతిరిగినప్పుడు
ముప్ఫై శరత్తుల నీ యౌవనం మూగగా ఆక్రోశించినప్పుడు
అప్పుడు నన్ను గుర్తు చేసుకో
విధి నిర్దేశించిన ప్రవాసంలో
విధిగా నీకై నిరీక్షించే ఈ నేత్రాలు
పరస్పరానంద సందోహాన్ని
పట్టుదారాలతో బంధించిన సూత్రాలయి
నువ్వు ముడివిప్పుతావని ఎదురుచూస్తాయని
గుర్తు చేసుకో...

*(ఆంధ్రజ్యోతి వీక్లీ, 1977)*

## నేస్తం...

నేస్తం !
నిర్నిమేష దృక్కులతో
నిస్తేజమయిన హృదయ స్పందంలాగ
ప్రకృతి పెళ్ళి నడకలు నడుస్తున్నప్పుడు
నిరీక్షణా భారంతో అలిసిన
నీ కను రెప్పల అంచుల్లో కాలం ఘనీభవించినప్పుడు
ఒక్క నిష్టుర భావం నీ మదిని దరిసి
ఒక్క అనుమానం నీ గుండెలో మెరిసి
ఉదాసీనతకు ఊదా రంగులు దిద్దిన నీ లేఖ
ఆకుపచ్చని ఆశలకు ఆవలితీరం
ఉత్తర ధృవం నా పెరట్లో వెలిసినట్లు
ప్రాకృతమయిన ఈర్ష్య నీ పదాలలో ఎంత సౌందర్యాన్ని సంతరించుకొంది?
నీ స్నిగ్ధ దరహాసం విరిసిన ఈ జీవితంలో
మరొక్కసారి మధుమాసం పూయాలన్న కోర్కె లేదు
నా యౌవనానికి నువ్వు అందమయిన పొలిమేర
ఈ వొరలో ఒకే ఒక పదునైన కత్తి
చెలీ! నీ ఆలోచనా రోదస్సులో అనుమానం ఊహా భిత్తి
ఈ అసంపూర్ణ చిత్రానికి ఆఖరి రంగులు నీవి
మరొక చిత్రాన్ని రచింపను
మళ్ళీ యౌవనాన్ని ఆహ్వానించను
నీదైన ఈ సుమధుర స్వప్నాన్ని
మరొకరి నిద్రలో వికసింపనివ్వను –

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 5.10.1977*

## మంచుబొట్టును...

మంచుబొట్టును మహీజంగా మలచిన ఆంతరంగం నీది
ప్రతీక్షణాన్నీ నీకై ప్రతీక్షణలో అమృతమయం చేసిన సాహచర్యం నీది
ఆశలను ఆశాంతాలకు పరిచి, అవనత శిరస్కుడిని చేసిన 'రసన' నీది
కోర్కెలు సంధించిన నీ కళ్ళ కొసలతో కోటిమబ్బులు విడుతాయి
రసప్లావితమయి నూతనగోళం ఈ హృదిలో అవతరిస్తుంది
ఈ కలం నీకై ఎన్ని కళలను సమీకరించింది?
ఎన్నిసార్లు గరళకంఠుడిలా విషాన్ని గుండె దిగకుండా దాచింది?
నీ కన్నీళ్ళతో ఈ హృదయం ఎంత ఆర్ద్రమయింది
ప్రాచేతస లాలసత్వం ప్రశంసార్హమయిన కవిగా నన్ను మలిచింది
ఈ వ్యక్తికి ఒక వ్యుత్పత్తిగా, ఈ శక్తికి ఊపిరిగా
కాలాన్ని ఖండికలు చేసి – ప్రతీ కణం పది లక్షల శకలాలయి
నీ జ్ఞాపకాల పరిమళాలు ఈ జీవికను సుసంపన్నం చేస్తున్నాయి –
రావూ ?

*1.6.1979*

ఈ పాతబడిన క్షణాల్ని కోయిల గొంతులోనే కలకాలం మిగలనీ

ఎప్పుడన్నా వెనక్కి తిరిగినప్పుడు ఆ గతాన్ని వెదుక్కొంటాను.

*ఆంధ్రజ్యోతి వీక్లీ, 21.6.1979*

## నీ ఏకాంతం...

ఈ పాతబడిన క్షణాల్ని కోయిల గొంతులోనే కలకాలం మిగలనీ
ఎప్పుడన్నా వెనక్కి తిరిగినప్పుడు ఆ గతాన్ని వెదుక్కొంటాను
నీ సాయంకాలాలు నీకై భద్రంగా పొందుపరుస్తాను
ఈ ఉదయం నీ హృదయమని మరిచిపోకు
రాబోయే కాలాన్ని రవసెల్లాలు పరిచి అలంకరించాను
నీ ఏకాంతంలో ఎప్పుడు పలకరించినా నేనక్కడే ఎదురుచూస్తూంటాను.

*ఆంధ్రజ్యోతి వీక్లీ, 21.6.1979*

## **నాలో నేను...**

నిరీక్షణ అంటే
లోపల్లోపల భుగ భుగ రగులుకొంటూ
ప్రతీక్షణం నివురు గప్పిన నిశ్శబ్దం
రాబోయే క్షణం పోబోయే క్షణాన్ని
అలసత్వంతో అనాలోచితంగా పొడిచే వెన్నుపోటు
ఉత్సుకత సడలి, యౌవనం దస్సి
ఒక్కసారే వృద్ధాప్యాన్ని కోరుకోవాలనిపించడానికి
కాలం ఘనీభవించిన గుర్తు
వాతావరణం స్థంభించినట్టు
కదలిక వున్న ప్రతి వస్తువుకీ
కరుకు కత్తులు అమర్చినట్టు
ప్రతీసారి కొట్టుకుంటున్నప్పుడూ
గుండె పిప్పర్మెంటు బిళ్ళలాగ
నాలిక చివర కదలినట్టు
అన్నీ కరెక్టు ఆన్సర్స్ వచ్చిన
క్రాస్‌వర్డ్ పజిల్లో ఆఖరు అక్షరం
అచ్చుతప్పు అయినట్టు
నాలిక తోలుపటకాలాగ సాగి
కళ్ళు కాకరపువ్వొత్తులయి
కదిలే ప్రతిక్షణం రాబోయే క్షణాన్ని
శస్త్ర చికిత్స చేస్తూంటే
నీకైన నిరీక్షణ కడుపులో పెప్టిక్ అల్సరయి
స్థిర పడడానికి మరో అవకాశాన్ని కల్పిస్తూ
ఇంతకీ - నా పేరు ఎన్నికల్లో ఓడినా గెలిచానని
కేకలు వెయ్యాలనిపించే జుల్ఫికరాలీ భుట్టో
జుత్తు పీక్కున్నా లేకున్నా నాకేమీ ఫికరు లేదన్న
సత్యం మాత్రం యిప్పటికీ ఎప్పటికీ డిట్టో...

*ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్ సావనీరు, 1977*

## నువ్వు

నువ్వు నా కళ్ళలోకి చూడలేక
పశ్చిమాకాశాన్ని నీ చెక్కిళ్ళ మీదకి ఆహ్వానించినప్పుడు
ఈ పదేళ్ళ పొడవునా అక్కడా అక్కడా
బంగారు రజం లాగ చల్లిన
నీకై ఆలోచనల్ని ఆతృతగా పోగుచేస్తాను –
ఈ తూర్పు ఆకాశాన్ని మోసం చేస్తాడనుకొన్నప్పుడు
సూర్యుడు తొంగి చూసిన ఉదయం ఎలా వుంటుంది?
నీకు నేనో జ్ఞాపకం కావచ్చు
పూల తోటలో గాలి పచార్లు చేస్తున్నప్పుడు
సువాసనకి కారణం వెదుక్కోనక్కరలేదు
జీవితం అలసిపోవడానికి యింకా రవంత ఆలస్యముంది
నువ్వు మనసారా నవ్వినప్పుడు
మళ్ళీ కోరికలు రహస్యంగా నా చుట్టూ ముసురుకొంటాయి
ప్రేమని ముచ్చిరేకుల్తో మలయపవనాలతో
అలంకరించే అలవాటు ఏనాడో తప్పిపోయింది
నువ్వు దాటుకు వెళ్ళే ప్రతీ క్షణంలోనూ
నా జ్ఞాపకాల ఊపిరి నిన్ను పలకరిస్తే
నేను నిన్ను పిలుస్తున్నానని గుర్తు పట్టు –

*ఆంధ్రజ్యోతి వీక్లీ*

## భయం

ఎన్నో పూలు పూసిన ఈ తోటలోకి
పరిమళం పరిపాటిగా వస్తుంది -
అభిమాని ఆశంస అందమయిన వ్యసనం
అభిమానానికి మన్నికయిన మలామా పేరు 'ఆరాధన'
చందమామ చల్లదనాన్ని మరిగించి
సూర్యరశ్మిని గడ్డకట్టించి
ఆలోచనకి ఊదా రంగు అద్దే కసరత్తు పేరు 'ప్రేమ'
ఏకాంతం కోరికల విశ్వరూపానికి ఆటవిడుపు
ఎక్కడో మరిచిపోయిన వసంతాన్ని
జీవితంలో పొదుగుకోడానికి కొత్త పిలుపు
కోరికకి రహస్యమయిన కోరలున్నాయి
అవి అదాటుగా విచ్చుకుంటాయి
తీరిక మనస్సులో తిష్ట వేసి
నరాల్ని వేడెక్కిస్తాయి
ఎంత ఆనందాన్ని పంచినా 'ఆశ' లోతు తెలీని ఊబి
అవకాశానికి రంగు అంగీలు తొడిగే
రసప్లావితమయిన ఆనంద హేలకి నాభి
ఇంకా కోరుకుంటావా దాన్ని?
కాలేస్తే కస్సుమనే విష సర్పాన్ని ?

## ఉదయం

ఈ ఉదయం ఆలోచనలు రేపిన ఆరని గాయం
ఈ హృదయం అశ్వమేధయాగంలో
ఆలశ్యంగా అగ్నిహోత్రానికి ఎరయిన సమిధ
విశీర్ణమయిన ఆశలకి అతుకులు వెయ్యాలని చూస్తున్నాను
మనస్సులో శిధిలమయిన మరో మొహం జొదారోను పునః ప్రతిష్ఠ చేస్తున్నాను
అబిడ్స్  చల్లదనం నా కిటికీ దగ్గర గడ్డకట్టినప్పుడు
తూర్పు ఆకాశం చిన్నబుచ్చుకునే
పొడవయిన దినాన్ని ఈ జీవితంలోకి మేల్కొలిపినప్పుడు
కేవలం కొన్ని గజాల దూరంలో ఎక్కడో నువ్వు
చూస్తూండగానే ఊహల్లో వికసించి జారిపోయిన పువ్వు
ఫ్రాయిడ్ నా మొదటి శత్రువు
"అంతర్ చేతన" అంత భయంకరమయిన విషణ్ణత మరొకటి లేదు
కొండల మీద పరుచుకొన్న నీరెండ
ఆపిల్ పండు మీద ఉలిపిరి కాగితం లాగ
ఆలోచనాయత్తమయిన హృదయాన్ని విప్పుతోంది
చీకటి ముసురుకోడానికి ఎంత వ్యవధి వుందో !
ఇంత జీవ ప్రవాహంలో నీకోసం ఎన్ని ముఖాలని వెదకను!
ఎన్ని సంవత్సరాల అన్వేషణ ఫలితం నువ్వు నాకు !!

*తెలుగు అమెరికా, మార్చి 1979*

## సప్తపది

ప్రేమకి అర్థం వెదకడానికి ప్రయత్నించకు
అర్థం వెదకబోతే అర్థాంతరంగా శలవు తీసుకొంటుంది
స్వరాల్ని మేళవించే మురళిని పెదవి పలకరిస్తే గానం
కళ్ళు ప్రశ్నిస్తే కట్టెపుల్లగా శాప గ్రస్థం

ప్రేమ ఓ అందమయిన అనుభవం
హృదయాన్ని ఆర్ధ్రం చేసే ఆలోచన
దాన్ని గుర్తుపట్టు
గుర్తు పెట్టడానికి ప్రయత్నించకు
హృదయాలు మాట్లాడుకొనే భాష
బోనులో నిలబడిన ముద్దాయిని చెయ్యకు
మట్టిబెడ్డను మణిదీపంలా వెలిగించే మంత్రదండం
మనస్సుని గుడిగా మలిచే వింతశక్తి
అంతర్ చేతనను ఆహ్లాదపరిచే ఎలిక్సిర్
హృదయానికి కొత్త అర్థాన్నిచ్చే టిప్పణి
ఆనందానికి శబ్దార్థచంద్రికకి అందని అర్థం
ఆలోచనతో నిలదీస్తే మంచులా కరిగిపోయే ముగ్ధ
వయస్సు ముంగిట్లో కళ్ళు విప్పే తియ్యటి ఉదయం
నీ కౌగిట్లో, నా పలకరింతలో
నీ సన్నిధిలో, నా కళ్ళలో
చీకటి రాత్రి తలగడమీద ఒలకపోసే కలల్లో
నా చుట్టూ ప్రతీక్షణం ముసురుకొనే నీ ఆలోచనల్లో
నీ సరసన నా ఉనికిలో
నీకై నా మనికిలో
హృదయాన్ని పూరించే నీ చిరునవ్వులో
నీ స్పర్శకై ఆరాటపడే మునివేళ్ళలో
నీ కోసం వెదుక్కొనే నాకనుకొలకుల్లో
వణికే నీ హృదయంలో తొణికే నీ సిగ్గులో
అనుక్షణం పలకరించే అంతర్వేది ప్రేమ
నీ సాహచర్యానికి అదే నేను పెట్టుకొన్న మరో పేరు –

*జ్యోతి, ఆగస్టు 1977*

## రాలిన పూలు

కాంత కౌగిట రంజిల కాంక్ష లేదు
ఆమె హృద్గత భావమ్ము నైన చాలు

వత్తువత్తు వంటచును పవలు గడిచె
రావు రావేల నను చింత రాత్రి నిలిచె

జగమునకు దివ్విటీ పట్టు పగలు కన్న
కాంత కౌగిట కరగు చీకటులు మిన్న

నాటి రేయి నిను చూచినాను గాని
ఎరుపు పెదవులు, చూపులే గురుతు నిలిచె

బ్రతుకు బాధను వరియించి గతుకు వార
బాధ కవితను వరియించి యతుకు వేసె

పయిట గాలికి ఎగిరిన పల్లె దాన
పయిరు పరికించు ! పంటంత నేను కోతు !

కత్తి దూసి గుండెను  చీల్చుగాని; వలదు
కరకు చూపుల బాధించు కఠిన శిక్ష

అడగనప్పుడెల్ల ఆదరమ్మొలికింతు
వడిగినపుడు అధరమైన యీవు !

తూర్పు రగిలిన రక్తిమ తీరు జూడ
కోర్కె తగిలిన హృదయమ్ము గుర్తు వచ్చె !

ప్రొద్దు గుంకిన తదుపరి పొలతి రాగ
గుప్పుమని మల్లె పూవులు గురుతు తెలిపె !

ఆలయమ్మున వెలిసిన స్వామి! హృద
యమున వెలిసిన వెలది మాటేమి సేతు ?

ఏను స్వర్గమ్ము కాంక్షించినాను గాని
నీదు కౌగిట దైవమ్ము నిలిపె దాని

బాధ్యతల మధ్య వేగిన బ్రతుకు కన్న
చెలియ ఒడిలోన మరణమ్ము వలతు నేను !

ఆకసమ్మంత హృదయమ్ము గలిగికూడ
ఆవగింజంత మనసు కన్పట్టనీవు!

చూపు తూపుల వ్రేల్చిన జీవితమున
తీపి చూపుల వేదన తీర్చవలయు !

నాదు దుఃఖము గని నేడు నవ్వబోకు
నలుపు మ్రింగిన గగనమ్మె తెలుపు వారు !

ఎవరహెూ ! కన్ను మూయని వేళలందు
కలల నందుట నేర్పించి తొలగినారు !

నాదు మది మెత్తనని యేరు నమ్మవలదు
ఆమె కౌగిట ఆర్ద్రత గాంచె నంతె !

*ఆంధ్రప్రభ వీక్లీ, దీపావళి, 1967*

**రాలిన పూలు - మరికొన్ని**

సఖియ కనుమూయ మదిని గ్రీష్మమ్ము నిండె
మరల వాసంత మెప్పుడు మరులుగొనునొ !

ఎంత పుణ్యము చేసితినేమొగాని
ఆమె కన్నులు నాకెన్నొ కాన్క లిడెను !

కినుక వహియించి కనులు మూసితివిగాను
కనులు విప్పుము, నేనిక కాన రాను

ఎవని మది చిచ్చు రగిలించినానొ గాని
ఆమె చిరునవ్వు గుండెను రగుల జేసె

ఎంత గడసరివే నీవు, చెంత జేరి
నన్ను నాయెద గీలించి యరిగినావు

గుడిని దీపమ్ము వెలిగించు కోరికేల
మదిని రగిలిన జ్వాలను మలగ నీకు

నీవు నను వీడి పోయిన నిముసమందు
పగలు చీకటు లేకమై పగను బట్టె

నీతులెన్నొ చెప్పు నేత యెవ్వడేని
గోతిలోన దింపు జాతినెల్ల

ఆకు కొమ్మను విడని దాంపత్య మట్లు
ప్రేమ భామలు మదిని కాపురము జేయు

ఎంత తడబాటు పడినావొ యేమొ నీవు
పంటి గాయపు కథను వారంటి నపుడు

చెరకు తోటను నిలిచిన చిన్నదాని
చేత తీపి కలదు గాని, చేదు లోన

వారు కోరగానె వగలు కురిపింతువు
నేను కోర దరికినైన రావు

పదము పేర్చినంత పద్యమెట్టులగును
కోక కట్టినంత కోమలగునె !

ఎంత నిద్రింతుమన్నను నిదుర రాదు
ఆమె కయి నిశ్చలత నొందె కనులు గూడ !

ఏరు నన్నింక దారి తప్పింప వలదు
ఆమె వెడలెడి మార్గమ్ము గాంతు నంతె

ప్రళయ మొక్కసారి ప్రభవించినట్టుల
ఆమె రూపు మదిని ఆర్తి నించె

రమ్ము రమ్మని మరిమరి యందు గాని
ఈ వ్యధిత హృది నిను గమనింప బోదు

మట్టి పాత్రజేసి మరిచె కమ్మరీడు
జీవ పాత్ర సుఖము జేర్చుకొనగ

కాలమెకింత నీకు కలిసి లేదని గాని
నీదు అందమునకు నిలిచె నెవడు !

చెలియ రమ్మని సంజ్ఞను కేల నిడును
దరికి జేరగ దండించు నోరగనుల

ఆమె చిరునవ్వు కోర్కెల రగుల జేయు
ఏమి పాపమొ, కన్నుల తీరె వేరు!

ఏమి కనిపించు చీకటిలోన నీకు
నెలత మదినైన రగిలించు వెలుగు సుంత

సజ్జనుని బ్రతుకు రెండిట శాశ్వతమ్ము
మొదట, యిప్పుడు, మనమున మెదిలినపుడు

అన్నమోయని వీధిన యంధుడరువ
సున్నమోయని విటుడింట కేకలిడెను

నువ్వు నవ్విన నీకె కీడవును పొమ్ము
విచ్చుకొను పూవు చెట్టును వీడకున్నె ?

నడిచివచ్చి నీవు ఆలిసి పోతివి గాని
వేచియుండి నేన వీగి పోతి

మానసబునందు మర్మమేమొగాని
కాంత కనుల నింద కాంక్ష నిలిచె !

ఆమె యెల్లర చిరునవ్వు పంచియిచ్చు
ఏను కోరిన దక్కును మూగ దృక్కు

నాదు చీకట్లు బాప రమ్మందు గాని
నీదు బ్రతుకున చీకట్లె చాలు నీకు

హృదయ సీమల విహరించు ముదితరొ
తెలియులే నీ హృదిని చరియించు నెవరొ!

చాన! కనుగొంటిలే నీదు కనుల మహిమ
మూసిగొని గూడ గుండెలు దూసిగొనుట

లోతుకళ్ళు చూసి లేమ పక్కుమనగ
పిప్పి పన్ను జూసి ప్రియుడు నవ్వె

రెండు బ్రతుకుల నొకటిగ జేసిరంట
రెండు మనసుల నూహించలేని ప్రజలు !

ఆమె బ్రతుకును ఒక త్రాట గట్టినారు
ఆమె మనసును వేయింట నాప గలరె !

నిన్న దనుక సౌందర్యాధినేత్రి యామె
నేడు యొకని చేతులో నాడు బొమ్మ

నీవు రాకున్న నాకేమి పోవునిపుడు
నీకగు విరహమే నాకు లోకమయ్యె

ఆమె పయి కోప మించుకయేని లేదు
ఎరుపు పెదవుల జూడ మనసాయెనంతె !

ఆమె యొరులకు సౌందర్య సామ్రాజ్ఞి యగును
నాదు కౌగిట నవనీతమై కరంగు

## ఒంటరితనం...

ఒంటరితనం ఆలోచనల్ని
అలంకరించుకుంటుంది
ఆలోచనలు అవసరాల
రెక్కల్ని చాస్తాయి
ఏకాంతం దిక్కులు చూస్తుంది
నరాల మీద వరాల
బాణాల్ని సంధిస్తుంది
కోరిక దొంగ పేరు స్నేహం

*26.12.08*

**ఆలోచనల్ని....**

ఆలోచనల్ని పదిలంగా
మడతపెడితే నిద్రవుతుంది
కోరికల్ని రహస్యంగా
మడత విప్పితే కలవుతుంది
నువ్వు నా నిద్రలో కలవి
కలకోసం ఎదురుచూసే నిద్రవి

*25.12.08*


## టెలిఫోన్ తరంగాలు...

టెలిఫోన్ తరంగాలు
నీ గొంతు పరిమళాలతో తలంటు పోసి
రాత్రిని పూల పల్లకీలో ఊరేగిస్తాయి
అనుభూతుల పొత్తిళ్ళలో సేదదీర్చుకుని
కొత్త ఉదయాన్ని మత్తుగా తెరుస్తాను
మరిన్ని కలల కావిళ్ళకోసం ఎదురుచూస్తూ

*27.05.09*



# ఆసుపత్రి పాటలు



# ఆసుపత్రి పాటలు

(ఆక్సిడెంటులో కాలూ చెయ్యీ విరిగి నేను మంచాన పడ్డాను. కుడి చెయ్యీ, ఆలోచించే మెదడూ దెబ్బతినలేదు. ఆసుపత్రి స్పెషల్ గదిలో పడుకొని తీరికని నింపిన కవితలివి)

ఆ ఉదయం నా కిటికీ అవతల కోయిల కూసింది. బాత్‌రూం అద్దంలో యథాప్రకారంగా మామిడి తొంగి చూసింది. కాని ఇన్నాళ్ళూ గురుతుగా మిగిలిపోయిన వసంతం – ఇంత ఆలశ్యంగా అనుభవంలోకి తొంగిచూసినప్పుడు...

## ఆసుపత్రిలో వసంతం

ఆసుపత్రిలో వసంతం
ఆపరేషన్ బల్లమీద పేషెంటు
కోకిల ఎన్నిసార్లు కిటికీ అవతల
'కో'యని గీపెట్టినా
విరిగిన ఎముకల మధ్య ఎక్కడో
నగరం బహూకరించిన
భీషణ వేదనాయుత హాలాహలం
నువ్వు మరిచిపోయినా – నీ కప్పిచ్చిన
మార్వాడీ ఎఱ్ఱటి ఎకౌంటు బుక్కుల్లో డెబిట్ కాలం
కిటికీ అద్దంలో పూచిన మామిడి తొంగి చూస్తున్నా
అనెస్తీషియా మత్తులో మనస్సు
సైబీరియా ఎడారుల్లో విహరించే వికృతమయిన పరిభ్రమణం
చల్లని వాతావరణంలో ఉదయం తెల్లవారినా
అలసిన రాత్రిని మరిచిపోలేని హృదయం ఆర్తనాదం
వసంతంలో మరో కొత్తరోజు తెరవడం ఆనందం కాదు భాయీ
ఆసుపత్రిలో మరో పాత రోజుకి శలవివ్వడంలోనే వుంది హాయి –
కవిత ముగించే ముందు
మరో కొత్త ఉపమానం చెప్పమంటావా ?
ఆసుపత్రిలో వసంతం
నపుంసకుడికి రాజనర్తకి పరిష్వంగం లాంటిది –

*9. 7. 1977*

## రోడ్డు మీద నీ కోసం

(కిటికీలోంచి రద్దీగా రాకపోకలు సాగే రోడ్డు కనిపిస్తూంటుంది. వారిని పలకరింత)
అన్నా! నిన్నా మొన్నటిదాకా నీలాగ ఠీవిగా నడిచిన వాడిని
ఖిన్న వదనానికీ కన్ను తుదల నీటి తుంపరకీ ఎన్నడో విడాకులిచ్చినవాడిని
ఇప్పుడు రథచక్రం నేల కొరిగినా – కొన ఊపిరి వరకూ
రాచరికపు ఠీవినీ, చేవనీ అభినయిస్తున్న అభినవ సూర్యతనయుణ్ణి
అవును భాయీ !

నీతోపాటు నువ్వునడిచే బాటమీద అడుగు పెట్టి చాలా రోజులయింది
ఒక్కటి చెప్పు
నేను లేనని – ఈసారి వసంతం చిన్నబుచ్చుకొన్న ముఖంతో మీ వీటికి రాలేదు కద!
ప్రతీసారీ నా కిటికీ అవతల విరిసే ఉదయం
నీ హృదయాన్నీ అలాగే ఆహ్లాదపరుస్తోందా?
బీచిలో సాయంకాలాలు భీరువులయిన ప్రేమికుల్ని ఇంకా సేద తీరుస్తున్నాయా
ఈ నగరం ఎప్పటిలాగ అర్ధరాత్రి వొళ్ళు విరుచుకుని
అలసిన బాలింతరాలిలాగ హాయిగా నిద్రపోతున్నది కదా?
నువ్వలా నా కిటికీ ముందు రోడ్డు మీద నడిచి వెళ్లినప్పుడల్లా
నీ చూపు ప్రసరించినంత మేరా నా గుండె కూడా విహరిస్తుంది
ఈ గదిలో చిక్కుకున్న నా మదిలో మధురిమ
నీ హృదిలోనన్నా వికసిస్తే చాలునని విశ్వసిస్తుంది –
అన్నా, యింకొన్నాళ్ళు ఓపిక పట్టు
ఏడో సూర్యుడు సారధి లేకుండా ఎంతో కాలం విశ్రమించడు
నేను పోగొట్టుకున్న గతంలోకి
నువ్వు రాబట్టుకొన్న అనుభవంలోకి
అనిమిషుడిలాగ ప్రత్యక్షమవుతాను
ఆ నిముషం కోసం ఎదురుచూడు
వెళ్ళిరా నేస్తం, ఏ పని మీద వెళ్తున్నావో?
దారి చూసుకొంటూ మాత్రం ముందుకి నడువు
దురదృష్టం నిన్ను కాటేసిందా
నీలాంటి మిత్రుల్ని కళ్ళారా చూసే అదృష్టమయినా
కలిసిరాని వార్డులే మిగతావన్నీ –
అయినా నువ్వు నా అనుంగు మిత్రుడివి
నీ దురదృష్టాన్ని నేనే పంచుకొంటాను
నా అదృష్టాన్ని నువ్వు నడిచే త్రోవలో
పరుచుకొంటూ ముందుకు సాగిపొమ్మంటాను –

*11.7.1977*

## స్వాగత పత్రం

(నేను ఉండే గది కిందనే కాజువాలిటీ వార్డు)

రా నేస్తం రా -
ఇదే కాజువాలిటీ వార్డు
నీరున్నా లేకపోయినా, నగరంలో ట్రాఫిక్
హోరున్నంతకాలం నిర్విరామంగా నడిచే నావ
ఎక్కడ పడ్డావు? ఎలా పడ్డావు? ఏం విరిగాయి?
కాళ్లా, చేతులా - సగం సగం కూర్చుకుంటున్న కలలా?
రేపటి కోసం అనారతంగా పారే ఊహల అలలా?
పసివాడి పాలడబ్బాని క్యూలో సంపాదించి పల్లవన్ గాడీ కింద పడ్డావా బాబూ!
నీ చేతిలో పాలడబ్బా యింకా భద్రంగా వుందని
నీ యిల్లాలికి కబురందిందా?
పసివాడి ఆకలి తీర్చి, తీరికగా వచ్చి నీకోసం ఏడుస్తుంది -

ఏడో కుర్రాడి మూడో ఫారం పాసు గురించి
ఏ దేవుడికయినా మొర పెట్టుకుందామని
పరాకుగా రోడ్డుకడ్డం పడ్డావా?
ప్రేయసి కౌగిట్లో తియ్యని క్షణాలకి ఆతృత పడుతూ
బ్రేకుపడని కారుతో పోటీ పడ్డావా తమ్ముడూ!
కారులు కలల మీంచి క్రూరంగా నడిచిపోతాయని
ఎక్కడా కథల్లో చదవలేదా ఎప్పుడూ?
ఎటూ కాని వేళ
దురదృష్టాన్ని మూటకట్టుకొచ్చావు
విరిగింది కాలే అయితే
పొరుగు మంచం మీద పగిలిన తలని చూడు
పాలడబ్బా గురించి మరో ఆరు నెలల కయినా
'క్యూ'లో నిలబడే అదృష్టానికి ఆనందించు
చెయ్యి విరిగితే – దేవుడికి మనస్సులోనే దండం పెట్టు
నాలుగోసారి అబ్బాయి పరీక్ష తప్పకుండా మొక్కుకునే అదృష్టం చేతికి దక్కుతుందని
జీవనాన్ని టోకుగా కొన్ని నెలలు వాయిదా వేయించే
విచిత్రమయిన కర్మాగారం యిది
బ్రతికిన దినాల పచ్చని రోజుల్ని నెమరువేసుకొనే అందమయిన మజిలీ యిది
తీరిగ్గా మంచం మీద కూర్చుని
తిరిగిరాలేని నా దురదృష్టాన్ని పరుచుకొని
పోగుచేసుకున్న నిన్నటి కలల్ని విప్పుకో
నిన్ను జోకొట్టే మెత్తటి ఆలోచనల్ని కప్పుకో –
విరిగిపోయిన కలల్ని ఎలా అతకాలో యింకా యీ వార్డులో అంతుబట్టడం లేదు
విరిగిన ఎముకలు ఎప్పుడు అతుక్కుంటాయో మాత్రం కాస్త ఆలస్యంగా చెప్తారు.
అందాకా అయిదో నెంబరు బెడ్డు నీకిప్పిస్తున్నాను
నువ్వు నష్టపోయినదేమిటో నీకే గుర్తురాకుండా
మత్తుమందు నీ మీద గుప్పిస్తున్నాను.

*12.7.1977*

## షష్ట్యంతం

(ఆసుపత్రి విడిచి వెళ్ళే ఆఖరి రోజు)

ఆసుపత్రికి –
అసంకల్పితంగా మీద పడిన అనర్థానికి
నిన్నటి నిర్వేదానికి
అందుకోబోయిన ఆనందాన్ని అంతలో తుంచేసినా
అలవోకగా నవ్వుకునే నా మనస్తత్వం ముందు ఓడిపోయిన fate కి
ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడే uncertain state కి
లోషన్ వాసనలకి దైన్యతతో లొంగిపోయిన
మనస్తత్వాలు ముసురుకొన్న వాతావరణానికి
నా కోసం అవ్యాహతంగా కారిన కన్నీటికి –

నేస్తం !
అందరికీ వీడ్కోలు చెప్పి
నిన్ను మాత్రం నాతో తీసుకుపోతున్నాను
పాలనీ నీటినీ వేరు చేసే రాయంచలాగ
నా దుఃఖాన్నీ ఆనందాన్నీ గుర్తుపట్టడానికి
నీ గుండెలకి హత్తుకు ఓదారుస్తావనే
స్వార్థాన్ని వదులుకోలేకపోతున్నందుకు –

*20. 7. 1977*


## నగరం నడిబొడ్డు మీద...

నీ వేపు ప్రయాణం చేస్తున్న నీరవమయిన
సాయంకాలపు గుండె రెండుగా చీలిపోయినప్పుడు –
రాబోయే క్షణంలో ఆనందానికీ
ఒరుసుకుసాగే ఆతృతకీ జరిగే ఘర్షణలో
ఓ చెయ్యీ, కాలూ సహకరించడానికి మొరాయించినప్పుడు
నలుగురూ నడిచే నడిరోడ్డు మీద
మరో ఆరునెలలు నీతో ఆనందానికి
విడాకులిస్తున్నానన్న ఆలోచన గాయం చేసినప్పుడు
కనిపించని నిర్వేదం గుండెల్ని పిండి చేస్తూ
వినిపించని ఆర్తనాదాన్ని పెదవులు ఆశ్రయిస్తూ
అర్థాంతరంగా నిలిచిపోయిన ఈ సాయంకాలం
ఏ దుఃఖానికి సంకేతమో కారణాన్ని వెదుకుతూ
కోరికతో మెత్తబడే శరీరం
లోషన్ వాసనల మధ్య మత్తెక్కుతున్నప్పుడు
అనూహ్యంగా రచించాలనుకొన్న భావనా చిత్రం
అవ్యాహతంగా జారే కన్నీటికి అంచులు తొడిగినప్పుడు
ఎముకల్ని అతికించే ఏ యంత్రాలు హృదయాలకి
అతుకులు వేస్తాయో తెలీక
ఆపరేషన్ థియేటర్‌లో ఫోర్‌సెప్స్‌కి
అందని ఈ వింత విషాదానికి
చికిత్స చెయ్యడంలో వైద్యశాస్త్రం మొదటిసారిగా
ఓడిపోతుందనిపించినప్పుడు –
దిక్సూచి చెడిపోయిన ఒంటరి నావ ఈ హృదయం
తీరం చేరడం రవంత ఆలశ్యమయినా నిరీక్షణ మరిచిపోకు
నా ఆశ నీ ఆవేశాన్ని ఒరుసుకు పారే సెలయేరని గుర్తుపెట్టుకో

*జులై, 1977*



# వాసు స్మృతులు



## స్మృతి

ఈ నావ గమ్యందాకా నడుస్తుందనుకున్నాను
ఈ చెయ్యి కష్టంలో నా భుజం మీద వాలుతుందనుకున్నాను
ఎంత చిన్న కారణానికయినా
ఆకాశం పగిలేలాగ ప్రతిధ్వనించే ఆ నవ్వు
నాకంటె ఎక్కువ కాలం వినిపిస్తుందనుకున్నాను –
నాకంటె ఎత్తయిన మనిషి
నాకంటె అందంగా కథ చెప్తాడని నలుగురూ అన్నప్పుడు
రహస్యంగా నాలో నేనే గర్వపడ్డాను
ఏనాటికయినా ఎత్తుగా కళ్ళెత్తి చూడాలనుకున్నాను
ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయిన నా కలలకి
ఆ మూర్తిలో పర్యవసానాన్ని వెదుక్కున్నాను
ఆ వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని చూసి
ఇక ధైర్యంగా వృద్ధాప్యాన్ని ఆహ్వానించవచ్చునుకున్నాను
కన్నీళ్ల అవసరమేలేని ఈ జీవితంలో
వాటితోనే చెట్టాపట్టాలేసుకోవాలని వూహించలేకపోయాను
నాకంటె విలాసంగా, నిండుగా, గర్వంగా బ్రతికే మనిషి

ప్రిన్స్ చార్మింగ్

ఏ పని చెయ్యాలన్నా 'ధైర్యం' కంటె రెండడుగులు ముందు నడిచేవాడు
ఏ కంటిలో నీటిని చూసినా చేతులు మైళ్ళకొద్దీ సాచి తుడిచేవాడు
కడుపున పుట్టిన అచ్చమయిన స్నేహితుడు
నలుగురిలో నాకు అందమయిన ఫాన్
'నాన్నా' అన్న పిలుపులో నేనున్నానన్న ఓదార్పు
కష్టం ఎవరి ముఖంలో చూసినా కళ్ళల్లో ఎరుపు
తనకి అక్కరలేని చావుకి ఆరు రోజులు కాపలా కాశాడు
జేబులో రూపాయుంటే చెయ్యి వెయ్యి ఖర్చు చేస్తుంది.
సూర్యరశ్మికి మరింత వెలుగునిచ్చే శక్తివి నువ్వని
అమ్మమీద పద్యాన్ని గదిలో టేబిలుమీద వుంచాడు
ఖరీదయిన జీవితం అతని వ్యాపకం
ఆకలికి, అవసరానికి తలవొంచే మనుషులు అతని బలహీనత
ఏడు సముద్రాలు దాటి కోరుకున్న రాజకుమారి కోసం పదేళ్ళు తపస్సు చేశాడు
చిన్న కెరటాన్ని దాటి యిటువేపు అడుగు వెయ్యలేకపోయాడు
ఎన్ని సూర్యోదయాలు ఆ చిరునవ్వుని నష్టపోయాయి?
ఎన్ని జీవితాల్లోంచి స్నేహం శలవు తీసుకొంది?
నా అడుగుజాడల్ని కొలిచి మిల్లీమీటరు తేడా రాకుండా నడిచేవాడు
నా కంటె ముందు ఎందుకు అడుగు వేశాడో అర్థం కాదు
కన్నాను కనుక 'నాయనా' అనాలి కాని
నాకు అతి విలువయిన మిత్రుడు, ఆర్తత్రాణ పరాయణుడు
దైవాన్నీ, అమ్మనీ ఒకే పీట మీద కూర్చోపెట్టి పూజించే భక్తుడు
ఇప్పుడే ఆ సందు మలుపు తిరిగాడు –
ఈ గాయం యింకా పచ్చిగా వుంది
గుండె గొంతులో అడ్డు పడుతోంది క్షమించండి
ఈసారికి శలవు తీసుకొంటాను
మరోసారి నా దీనత్వాన్ని మరికాస్త విప్పుకుంటాను

*20. 2. 1993*

## ఒక ఆర్తి

ఎంత తక్కువ పని చేసినా మెదడు అలసిపోతోంది
పేపరు తెరిచి శీర్షికలు చూస్తున్నా మనస్సు తేరుకోవడం లేదు
మనస్సు స్తబ్ధమయిపోయింది
దేనిమీదా ఆలోచన నిలవడం లేదు
ప్రపంచంలో ప్రతిదీ నిస్తేజంగా
అర్థరహితంగా కనిపిస్తోంది
ఏదీ ఆశని ప్రోత్సహించడం లేదు
ఎవరి మాటా వినాలనిపించదు
ఏ సానుభూతయినా తిట్టులాగ వినిపిస్తోంది
పాత గాయాన్ని కెలికినట్టు హింసిస్తోంది
అందర్నీ వదిలి పారిపోవాలనుంది
26ఏళ్ల జ్ఞాపకాల్ని ఒక్కచోట పోగుచేసుకొని
మళ్ళీ జీవించాలనుంది
వాసూ – యిలాంటి రోజు వస్తుందని తెలిస్తే
ప్రతి అనుభవాన్నీ ఎంతో పదిలం చేసుకొనే వాడిని
ప్రతి సామాన్య సంఘటనా ఎంత అమూల్యమయిపోయింది?
కాలంలో ఈ లోపం ఎలా భర్తీ అవుతుంది?
ఎన్నాళ్లు నువ్వులేని ఈ లోకంలో యింకా బ్రతకాలి?
*(1991 ఆగస్టు 12న వాసూ పోయాడు.*
*28వ తేదీ రాత్రి 10.40కి నిద్రపట్టక లేచి కూర్చుని వ్రాసుకున్నది)*



# మళ్ళీ మళ్ళీ వసంతం



## ఆశల అరుణోదయం

జీవితపు సాయంకాలంలో
హఠాత్తుగా సూర్యోదయమయితే
అచేతనంగా చూస్తూ నిలబడిపోయాను
ఆశ్చర్యం వెనుక స్ఫురించింది
అది దయతో నన్నాదరించే నీ చిరునవ్వని
యౌవనానికి పునర్జన్మనిచ్చి
పగలే రెండు సార్లు ఉదయ స్ఫూర్తిని
కలిగించగల హృదయం యింకెవరికుంటుంది
జీవితంలో నిలకడగొన్న
ఉద్రేకాల సరోవరంలో
ఆలశ్యంగా – కాని అందంగా
తలయెత్తిన అపరంజి సుమానివి నువ్వు
నిన్ను ధరించిన గర్వం యీ సరోవరానికి చాలు
నిన్ను వరించిన పర్వం ఈ హృదయానికి మేలు

## పునరుక్తి

కాలం కరిచిన కాళరాత్రి
కనిపించీ కనిపించనట్టు వెనక్కి జారిపోతోంది –
కనిపించిన సంవత్సరం
కథ పూర్తికాకుండానే కంచికి పోతోంది –
మళ్ళీ కనిపించని పుటలోకి
కథ 'సశేష' మవుతోంది
ఆ సశేషం విశేషం
ససేమిరా అర్థం కావడం లేదు
కథ ముగింపుకు కాలంతో పాటు పరిగెత్తితే
ఎక్కడికక్కడ తెగిపోయే
తెల్లటి సంతోషపు దారాలు
కాళ్లకు అడ్డం తగులుతున్నాయి –
బతికిన సంవత్సరం బాగానే ఉందనిపిస్తూండగా
బారెడు దూరంలోకి
కొత్త సంవత్సరం సరసకు వచ్చింది –
'సర్రియలిస్ట్' జిగ్ జాగ్ పజిల్లో
ఎన్ని గళ్లు నింపినా
యింకో గడి బాకీ కనిపిస్తోంది –
అలసట లేకుండా నింపడం
అలవాటయిపోయింది కనుక
ఆనవాయితీగా అరవైనాలుగో గడిలోకి
అడుగేసింది జీవితం

*జనవరి 1, 1963*

## మళ్ళీ... మళ్ళీ...

పాత కేలండరుకి
పదమూడో పేజీ పేరు
కొత్త సంవత్సరం –
ఇజాల బూజులు
ఇల్లంతా కమ్ముకున్న
పాత యింటి కొత్త పేరు
మరో సంవత్సరం –
సమ సమాజ 'హంస'కి
'హింస' అంగీ తొడిగి
కోరికలకు కోరలు తీర్చే
ప్రజాస్వామిక ప్రహసనం పేరు –
మరి బాధ్యతలో? త్యాగాలో?
వాటి సంగతి వేరు
ఆ మాటలు వినడానికే బోరు
పురిటిలోనే పురుగు పట్టిన వేరు –
మళ్ళీ తెరవండి మరో సంవత్సరాన్ని
మన సొమ్మేం పోయింది
వస్తే రానివ్వండి
ఓ మూల పడుండడానికి –

*ఆంధ్రజ్యోతి దినపత్రిక, 27.12.2007*



# ఉగాది కవితలు



# ఉగాది కవితలు

ఇవి చదువుకొనే కవితలు కావు.

ఆహూతుల ముందు చదివిన కవితలు.

ఆకాశవాణి ఉగాది కవి సమ్మేళనాలలో చదవగా శ్రోతలు విన్నవి.

చెప్పే కథలాగ – వినిపించే కవిత

"ముషాయిరా"లో పఠనంలాగ భావాన్ని సంధిస్తుంది.

ఆహూతుల్ని పలకరిస్తుంది.

చదువుకొనే కవితకి అనుభూతి ప్రాణమయితే,

చదివే కవితకి అనుస్పందన ప్రాణప్రదం.

మొదటిది అంతర్ముఖి.

రెండవది ఎదుటి వ్యక్తి మమేకానికి ఎదురుచూసే ఇష్టసఖి.

## ఎదురు సన్నాహం

ఉగాది ఊరి పొలిమేరల కొచ్చింది
ఊళ్ళోకి వచ్చే సిటీబస్సు బ్రేక్‌డౌన్ వచ్చిందట పిటీ
లేకపోతే ఈ పాటికి సభకి వచ్చేసేదే హుటాహుటీ
వార్షికంగా వచ్చే అలవాటు వున్నది
ఎంతయినా ఈ యింట్లో పుట్టి పెరిగిన చిన్నది –
గుప్పెడు ఆనందంతో
మామిడి పుప్పొడి జల్లిన మన్నికయిన కోర్కెలతో
పెళ్ళినడకలు నడుస్తూ
ఆగత దివాంధకారాన్ని గడుస్తూ
పడుతూ లేస్తూ –
ఆకుపచ్చని ఆశల వెనక అందమయిన అనుభూతుల్ని పొదిగి
సంప్రదాయాన్ని అధఃకరించే సౌజన్యానికి ఒదిగి
రాత్రి నిద్రలేక సగం వాలిన కళ్ళలోకి అహంకారాన్ని ఆహ్వానిస్తూ
అంతలో వెయ్యి నక్షత్రాలని వాల్జడలో ముడుస్తూ
ఆర్షమైన ఆలోచనాసారాన్ని భ్రుకుటి మధ్య ఎర్రగా దిద్దుకొని
తనదైన అమృతంతో పాటు తనదికాని హలాహలాన్ని తప్పనిసరిగా నింపుకొని
కొంతలో కొంత తన ఆదర్శాల్ని చంపుకొని
అలవాటు మీద గమ్యం వేపు ప్రయాణం చేసి వచ్చింది
ఇంతలో ఈ అవాంతరం తోసుకొచ్చింది –
భువిపై దివిలాగ వెలిగే దివిసీమ కన్నీటికి రుద్ధయై
ప్రాక్తన ఋషి సూక్తంలో శాపానికి ఆహుతి అయిన అదృష్టంలాగ
క్షతగాత్రమయిన ఆశావృక్షంలాగ

నక్షత్రాల్ని తరిమేసిన సంధ్యాకాలపు పడమటి దిక్కులాగ
రాత్రి నిద్ర యింకా లోచనాంతాలలో విడిది చేసి వుండగా
నువ్వు చిన్నబుచ్చుకొంటావేమోనన్న పొజెసివ్ అభిమానంతో
ఆదరా బాదరాగా బయలుదేరి వచ్చింది –
హృదంతరాళంలో నువ్వు పెంచిన జూకా మల్లి తీగెలు
ఆశా మందారాలు, ఆవనత శిరస్కలై
నీ ఆలోచనలతో పాటు వికసించే శిరీష కుసుమాలు –
అన్నీ అదృష్టానికి నోచని  ఖాండవంగా మారుతూంటే
దట్టమైన మంచు కురిసే ఉదయాన్ని కూడా
తన నుదుటిన ఎర్రని మందారం వికసించడం చూస్తావని
సుదీర్ఘ వలయంలా తిరిగే కాలాన్ని
అనుభూతికి వడ్డాణంగా తీరుస్తావని
ఎంత ఖిన్నత తన మనస్సుని కరుస్తున్నా
నీ సహనంతో చలిమంట వేస్తావని
తన అధీనంలో లేని ఉద్రేకాల సెలయేళ్ళకు
నీ హృదయంలో ఎప్పటికయినా గమ్యాన్ని చూపిస్తావని
కొంత గతం గుండెల్నికోత పెడుతున్నా
కాంతా సమ్మితమైన నీ హృదంతరంగాన్ని ప్రేమించి
పాత బంధుత్వాన్ని పదే పదే తలుచుకొంటూ
చెదిరిపోయే ఆలోచనల్ని ప్రతీ క్షణం నీ వేపు మలుచుకొంటూ
ఊరి పొలిమేరలదాకా వచ్చింది –
అన్నా! నాకు తెలుసు
అజామీళుడిలాగ జీవిక సాగించే నీ మనస్సు లోతుల్లో మంచినీటి సెలలున్నాయని
ఎదురు దెబ్బల్తో నుదురు ఎన్నిసార్లు బొప్పి కట్టినా
మధురోహల సంకులారణ్యంలో
నీ మనస్సు ఏనాటికయినా ఒక్క పువ్వు పూయిస్తుందని
అన్నివేపులా అవ్యవస్థ ముసురుకున్నా
నిన్ను ఆనందపరిచే ఆమె చల్లటి దృక్కులు తాకిన ఏ క్షణాన్నయినా

నీ గుండెల్లోంచి క్షితిజ రేఖ దూసుకు ముందుకు సాగుతుందని
నీ మంచితనం చుట్టూ నిన్ను కబలించే వేల వేల వరూధినులు
చేతికందనిదంతా చేదని పెదవి విరిచే నాల్క లేని నల్ల త్రాచులు
ప్రతి రాత్రీ చంద్రుడు నీదయిన ఆకాశంలోకి వెదుక్కొని వచ్చి ఉదయిస్తాడని తెలుసు
అన్నా! ఆమె కోపం వెనుక
నిన్నటి అభిమానాన్ని గుర్తుపట్టు
పెదవి వణికినా
పృధివి తొణికినా
రేడియంలాగ రేయీ పగలూ వెలిగే
ఆ కళ్ళలో కరుణని గుర్తు పట్టు
నీ కోసం కిందటి జన్మలోనే తపస్సు ప్రారంభించిన తాపసి ఆమె
ఆధునిక మార్జాలాల ఆలోచనా నేత్రాలకు అందక అవ్యాహతంగా వెలిగే శుక్రతార
కొబ్బరి పువ్వుల వెనక చిక్కుకొని
అర్థాంతరంగా నిన్ను బులిపించే వేసవి సంధ్య
ఏ ఏకాంతంలో ఆహ్వానించినా
లలితంగా, అలవోకగా విరిసే చంద్రలోకపు కాంతి
నీ హృదయాన్ని మత్తెక్కించే సుర
ఆలశ్యం చెయ్యకు – నీ ఊహా భిత్తి
ఆమె విశ్వాసాన్ని కించపరచనీయకు
నమ్మకమయిన నీ మనో ప్రాంగణంలోకి
ఇప్పుడే బూజు దులిపిన ఈ పాత దివాణంలోకి ఆహ్వానించు
నీతో నీ పరివారాన్ని మేలుకొలుపు
ఇదే నీకూ, నీలాంటి సోదరులకూ నా పిలుపు –
ఎంతయినా మనింటి ఆడపడుచు
ఏటేటా మనింటికి రావడం రివాజు
పదండి వెళ్ళి పలకరిద్దాం
ముఖం చిన్నబుచ్చుకోక ముందే
హృద్యంగా మన గృహానికి తరలించుకు వద్దాం.

## సరికొత్త ప్రేమలేఖ

మునపటిలాగ మన ప్రేమని ఉత్తరాల్లో ముచ్చటించడం లేదని
నువ్వు నిష్ఠూరంగా రాసిన లేఖ నిన్ననే అందింది –
నా ఉపేక్షకి కారణాల్ని ఉట్టంకిస్తూ ఈ
ఉగాదిపూటా నీకు ఉత్తరం రాస్తున్నాను
ఇలాంటి సమయంలో రివాజుగా రాసే
ఏ విషయాన్ని తలుచుకున్నా నా మనస్సు
ఆత్మవంచన చేసుకోవద్దని హెచ్చరిస్తోంది
నా కలం నా ఆలోచనల అర్థాల్ని శంకిస్తోంది

నీ సిగలో మెరిసే నా కిష్టమయిన గులాబీ పువ్వు జ్ఞాపకం
ఇటీవల కన్నుమూసిన కుహనా రాజకీయ నాయకుడి శవం మీద
తెల్లబోయిన వెయ్యి గులాబీ పువ్వుల్ని వెక్కిరిస్తున్నట్లనిపించింది –
మన ప్రేమ కథకి నీరాజనాలర్పిస్తుందని ఆశించిన ఈ సమాజం
ఇప్పుడు సగటు మానవుడి బలహీనతలాగ కనిపిస్తోంది
నిన్ను అనునిత్యం నా కళ్ళముందే నిలపమని
కోరుకొనే వేణుగోపాలస్వామి ముఖం
తన సృష్టి తననే అపహసిస్తున్నట్టున్న
విరాట్ స్వరూపానికి వికృతమయినట్టుంది
నువ్వు నడుస్తూంటే మన పెరట్లో నిరుటి సంవత్సరం విరగబూసిన
బొగడ చెట్టు గుర్తొచ్చిందని అన్నాను కదా?
ఇవాళ అదే మాట అందామంటే
మొన్నటి శీతాకాలం తెల్లవారుఝామున ఆ చెట్టుకిందే
పిల్లల కాలేజీజీతాలు కట్టలేనని చెప్పలేక
నిస్సహాయతని తన మెడకి చుట్టుకుని ఉరితీసుకున్న
మేస్టారి ముఖం గుర్తొస్తోంది
ప్రేమ గురించి ఆలోచించడం ప్రవర్తన మీద మచ్చలాగ వుంది
అనుభవాల జ్ఞాపకాలు – ఆలోచనా సముద్రంలో అలలకు
కొట్టుకు వచ్చిన చింపిరి కాగితాల్లాగా చెదిరిపోతున్నాయి
ఆనందం గురించి తలుచుకొంటే ప్రత్తి రైతు ఆత్మహత్య గుర్తొస్తోంది
మనం ప్రేమని పంచుకొన్న మధురక్షణాలు
ఎవరి జేబులోంచో మనం బాధ్యతారహితంగా ఖర్చుచేసిన
రూపాయినోట్లలాగ కనిపిస్తున్నాయి.
సుఖం పత్యం పెట్టిన రోగి నోట్లో పంచదార చిరు చేదులాగ వుంది
స్వర్గం అని మన కనే తియ్యటి ఆలోచనలు
స్మశానం చెట్టుకి వేలాడే గబ్బిలాల్లాగ వున్నాయి
నేను రాసిన ప్రేమలేఖల్ని – చేతికందితే కన్నీటితో చెరిపెయ్యాలని వుంది
చంద్రుడు చల్లని వెన్నెల కురిపిస్తాడని పుస్తకాల్లో చదివిన గుర్తుంది

ఈ నగరంలో – పాపం – ఆ పెద్దమనిషి
ఏ ఆరో అంతస్థు వెంటిలేటర్ వెనకో చిక్కుకున్నాడు.
ఆకలితో ఆవురావురు మంటూ
నక్షత్రాల్ని అన్నం మెతుకుల్లాగ లెక్కబెడుతూ
మొన్న ఉదయం కన్న తల్లి చేతుల్లోనే ఆకాశాన్ని చూస్తూ
కన్ను మూసిన అత్తరుసాయిబు ఆరో పిల్ల ఆఖరి ఊపిరి
మనం ప్రేమించుకొనే హక్కు లేదని చెప్పినట్టనిపించింది –
చిరునవ్వులు చిక్కని దుఃఖాన్ని పుక్కిట పట్టగలవని మొన్న
ఎల్డీసీ ముకుందరావు డైరీ చదివాక అర్థమయింది
మనం నవ్వుకున్న క్షణాలు మనల్ని రహస్యంగా బాధపెట్టే వ్రణాలనిపించింది
ఆకలివున్నా అన్నంలేని పూలమ్మే కుర్రపిల్ల పల్చటి శవం
అన్నంవున్నా ఆకలిలేని అమానుల్లాగారి మంచం మీద దొరికిందన్నప్పుడు
'కోరిక' అన్నది తీరికగల వాళ్ళ
అర్థరాత్రి అవసరమని తేల్చుకున్నాను
దాని మీద గల ఆ కాస్త గౌరవాన్నీ విదుల్చుకున్నాను –
ఎంతకాలం చీకట్లో నవ్వుతావు –
ఈ ఖరీదయిన స్మశానోద్యానవనంలో
ఏ మూలకి వెళ్ళి గుడిగంటలు మోగించమంటావు?
మధురమయినవని నువ్వు గుర్తుచేసే పాత జ్ఞాపకాలు
గతంలో నాకు నేనే విధించుకున్న కఠిన శిక్షల్లాగ గుర్తొస్తున్నాయి
మనం కలల్లో మసక మసగ్గా ఊహించుకొనే భవిష్యత్తు
కూలిపోయిన ఖరీదయిన భవనం కింది నుంచి తొంగి చూసే
పసిపిల్ల నెత్తుటి చెయ్యిలాగ గుర్తొస్తోంది
భవనం కట్టడానికి సరిపోయిన యిటుకలూ సున్నం వున్నాయి
కాని గుడిసె వెలయించాలన్న ఉద్దేశానికి గుండెధైర్యం చాలడం లేదు
మన ప్రేమ కథ వర్తమానం గుమ్మానికి కట్టిన దిష్టిబొమ్మలాగ వుంది
మనిద్దరం కలిసి రాసిపెట్టిన పెద్ద కథ –
మన కోసం మనమే రాసుకొన్న మరణ వాఙ్మూలం లాగ వుంది.

కోకిల కూస్తూంటే కోరికకి వీడ్కోలు చెప్తున్నట్టుంది
మామిడి పూస్తూంటే మనస్సుకి మరో కొత్త గాయం చేస్తున్నట్టుంది
ఏ గేయం చదివినా బాధాశప్తుడి ఆక్రందనలాగుంది
ఏ పల్లవి పాడినా ఏపుగా పెరిగిన అసంతృప్తికి పారిహాసికలాగుంది
మనం నమ్మిన భవితవ్యం మనల్ని అమ్మేస్తున్నట్టుంది.
ఇన్ని సజీవసమాధుల్ని కూల్చి మాధుర్యాన్ని ఎలా వర్ణించను?
కలం కవిత్వాన్ని చెప్పమంటే కావుకావుమంటోంది
మనస్సు మమతల్ని విప్పమంటే నన్ను చూసే నవ్వుతోంది
చిరిగిన దుప్పటి ఎంతకాలం చలిని ఆపగలుగుతుంది
చెదిరిన ఆలోచనలు ఎన్ని కలిపితే తియ్యదనం పలుకుతుంది
మనం కలిసి నడిచిన సాయంకాలపు చల్లదనాలు
అదే ఆకాశపు చాందినీ కింద మరో అన్నార్తుడికి
ఆక్రందనలు పంచుతున్న జ్ఞాపకాన్ని కదుపుతున్నాయి
బంగారు కలల్తో అల్లిన అందమయిన కుందేలు బొమ్మ
చంద్రుడిలోంచి పారిపోయింది
మనం తలపెట్టిన అమాయకపు ఆలోచనలకు అప్పుడెప్పుడో చెదపట్టింది
నీలిరంగు తెరలు నిర్నిద్రహృదయాంతరాళంలో చిక్కులు పడిపోయాయి
నువ్వూ నేనూ కలిసి సిద్ధం చేసుకున్న ముందు రోజులు కథని
నీకూ నాకూ తెలీని పెద్దమనుషులెవరో నిర్దాక్షిణ్యంగా చెరిపేశారు
ఊలుదారాల్తో పొదిగిన అందాలకీ
ఊహా లోకంలో నక్కిన దీపగృహాలకీ
సైగాన్ బాంబుల్లో సగం చచ్చిన
కుంటి కుర్రాడి చిక్కటి కన్నీరు  చితి పేర్చింది
ఆలశ్యంగా కన్ను తెరిచిన ఆశాదీపాలన్నీ
ఆనందంగా మిన్ను ముట్టిన గుడ్డి తలపులకి
బీహారు ఆకలి చావులు మరణ దండనను విధించాయి
ప్రతి శిశూదయం అమ్మ గుండెల్లో ఆక్రోశాన్నే కూడబెడుతోంది
ప్రతి స్నాతకోత్సవం దేశం గుండెలమీదకి

వేల వేల కుంపట్లను వెలిగించి పెడుతోంది.
పట్టెడన్నం సరిగా దొరకని వాళ్ళకి పరమాన్నం గురించి కలలెలా వస్తాయి?
పొరపాటున చిత్రగుప్తుడి కుంచె చివరి నుంచి జారిన వాళ్ళకి
హవ్వ – ఆధునిక వేదనా శిలల మీద కలలెలా మొలుస్తాయి?
మనశ్శాంతి మానవుడి మేధస్సుమీద అనవసరంగా పేరుకొంటున్న ఫంగస్
మరో మొహంజొదారో మన చరిత్ర
అనుక్షణం చేసుకుంటున్న ఆత్మవంచనకు మరోపేరు
మరొకడికి దక్కని ఆనందాన్ని మనం పంచుకొనే హక్కు ఎక్కడిది?
కవిత్వం శరీరం బరువెక్కిన ముసిలి యిల్లాలు దిగవేసుకున్న
కాసులపేరు కాకూడదు చెలీ
జీవితం నువ్వొక్కడే దోచుకొనే పాత ఖజానా కానేరదు
ప్రేమ అన్నీ వున్న వాడికి, ఆకలి లేని వాడికి
అవసరం తీరిన వాడికి, అవకాశం చేసుకొనే వాడికి
గతాన్ని స్వగతం చెప్పుకున్నవాడికి ఆటవిడుపు
సుఖం–విసులుబాటు సడలిన వికారపు జీవితానికి దిగదుడుపు
స్వర్గం – మనల్ని మనం వంచించుకొనే మార్గం
గతాన్ని చూసి సిగ్గుపడే నేను ఈ కాగితాన్ని నింపుతున్నాను
ప్రేమని ప్రేమించలేని ఈ విచిత్రమయిన పేదరికాన్ని
నువ్వు ప్రేమించడానికి ప్రయత్నించు
నీ మనస్సుదాకానయినా రావడానికి హక్కుందా అని
నీ అందమయిన ఆలోచనల్ని ప్రశ్నించు
నిన్ను తలుచుకోని క్షణాల్ని నా జీవితంలో
బాధ్యతాయుతంగా గడిపినవని లెక్కించు
ప్రేమకి సరైన అర్థాన్ని నువ్వు గ్రహిస్తే –
యింటి పక్క కుంటి కుక్క పిల్లలో దీనత్వాన్ని గుర్తించు
ఉగాదిపూటా యిలా చెప్పానని కోపం వద్దు–
పెదవుల మీద కాదు పేదరికం హృదయం మీద పెడుతున్నాను ముద్దు –

## నిన్నటి ఉత్తరానికి తాజాకలం

మిత్రమా !
క్రితం సంవత్సరం నిద్రపోయి
ఈ ఉగాదిలో కళ్ళిప్పేసరికి గుర్తొచ్చింది
అనుకొన్న చాలా విషయాలు
నిన్న ఉత్తరంలో రాయడం మరిచిపోయానని
అనుకొన్నది మరిచిపోవడం మంచిదేనని నువ్వంటావు నాకు తెలుసు
లేనిది కావాలనుకొని, కావాలనుకొన్నది లేదని వాపోయేకన్న
లేనిది లేదనుకొని, ఉన్నదే కావలసిందనుకోవడం మిన్న

సరిపెట్టుకోవడంతో కొత్త సంవత్సరం ప్రారంభమవుతోంది చూశావా?
మనల్ని మనం వంచించుకోవడం కన్న
మన కోరికల అరల్ని కుంచించుకోవడం మంచిది కదా?
ఇలా రాస్తే ఈ తాజాకలం ఉత్తరాన్నే మింగేస్తుంది –
అసలు రాయాలనుకొన్నది క్లుప్తంగా చెప్తాను విను
నిన్నటి దాకా మెరిసే రంగుల వెనుక అరువు తెచ్చుకున్న చిరునవ్వుల్ని
అతికించుకొన్న సినీతార ఉన్నట్టుండి మా వూళ్ళో ఆత్మహత్య చేసుకొంది
ఆరువారాల్నుంచీ పిల్లలకి కొత్త బట్టలు కొనాలని పోరుతున్న మా ఆవిడ
అంగట్లో అరువు ఖాతా చూసి పాత బట్టలకే కొత్త మాసికలు వేస్తోంది
మొన్న, అకాలంలో అనుభవాల తాకిడికి
తొడతొక్కిడిగా వచ్చిన వృద్ధాప్యంలాగ
దూసుకువచ్చిన వానజల్లుకి మామిడి పుప్పొడి గాలికి కొట్టకుపోయింది
మరింక ఏది చప్పరించి గొంతు సవరించాలో తెలీక
కోకిలమ్మా కాకిలాగే వెర్రి చూపులు చూస్తోంది
మా యింటి ముందు తిరుగాడే కుంటి కుక్కపిల్లకి మొన్న రాత్రి మందు
తాగొచ్చి పెళ్ళాన్ని కొట్టిన మార్వాడీ బ్యాంకరు కారుకింద రెండోకాలు విరిగింది
ఈ ఉగాదికి అది బతికుంది అదే గొప్ప సుగుణం
నడుం విరిగిన పెళ్లాం తగాదాపడి పుట్టింటికి పోయిందికాని మత్తు దిగిన
మధుర క్షణాల్లో దాన్ని ఆనందంగా చూసి కుక్క విశ్వాసం గల జంతువని
అపార్థం చేసుకున్నారు బ్యాంకరు గారు
మా బుజ్జిగాడు వచ్చీరాని యింగ్లీషులో యివాళ లేవగానే నన్ను ఫూల్ అన్నాడు
తిట్టలేని మా ఆవిడ వాడి కాన్వెంటు చదువుని మెచ్చుకుంది
బడ్జెట్ బులిటిన్ విన్నాక వీధి చివర బడ్డీ కొట్టు బంగారయ్య
బంగారం వాచీ కొన్నాడు
మన వెంకటప్పయ్య మాత్రం కొత్త ప్రామిసరీనోటుకి
కలం పాళీ బాగులేదని వేయించుకొచ్చాడు
క్రితం సంవత్సరం రాసిన కథల్ని
ప్రెస్సుకి పంపిద్దామని బీరువా తెరిస్తే అర్థమయింది

నా సాహిత్యాన్ని తిని తిని రెండు బొద్దింకలకి బాగా వొళ్ళొచ్చిందని
కలుగులో ఎలుకపిల్లకి మా ఆవిడ కందిపప్పు కొనలేదని కోపం వచ్చి
మంచం విరిగాక నేల మీద పడుకొన్న మా పాప పాదం కొరికింది
నా బీదరికం నోరులేనిది కనుక సరిపోయింది
నోరుంటే పార్లమెంటు నాకే శిక్ష వేసేదోనని భయమేసింది
నిన్న మా ఆవిడ ఎలక్ట్రీ బిల్లు తగ్గడానికి మరో సుళువు కనిపెట్టింది
వీధి మునిసిపాలిటీ దీపం గదిలోకి పడుతోందని గది దీపం ఆర్పేసింది
పవర్‌కట్‌కి మునిసిపాలిటీ దీపం తొందరగానే ముఖం ముడుచుకొంది
అందుకనే ఉగాది కథల పోటీ కథని వచ్చే సంవత్సరానికి వాయిదా వేశాను
నువ్వు మరీ మరీ మెచ్చుకొనే బర్మా లుంగీకి మొన్ననే ఆరో చిల్లు పడింది
ఈసారి నువ్వు నొచ్చుకునే బీదరికం తెలియకుండా
కట్టుకునే కొత్త సుళువు కనిపెట్టాను
మా యింట్లో దోమలు మరీ నీరసంగా వున్నాయని
ఈమధ్య దోమల మందు కొన్నాను
అవి రెండు పూటలా మందు తిని యిప్పుడు ఆరోగ్యం పుంజుకున్నాయి
మా వెనకింటి నాయుడుగారింట్లో కోడి
ఈ ఉగాదిని గుర్తుచేస్తుందని నిన్న తొందరగా నిద్రపోయాను
నిన్న రాత్రే దాని గొంతులో ఉగాది పొద్దు ఉరితీసుకుందని పనిమనిషి చెప్పింది
ఉన్న ఒక్క ఇంకు సీసా బద్దలుకొట్టి మా పెద్దవాడు
గాజు ముక్కలు బయట పొయ్యడానికి బద్ధకించాడు
ఇవాళ పొద్దుటే నాకో కొత్త విషయం తెలిసి వచ్చింది –
బీదవాడి రక్తం కూడా ఎర్రగానే వుంటుందని
మన వివాహ వ్యవస్థ మీద ఘనమయిన వ్యాసం రాయాలనుకుంటున్నాను
మంగళసూత్రాన్ని ప్రతిపాదించిన మనువు నిజంగా మహానుభావుడు
మంగళసూత్రంలో బంగారం 20 కారెట్లేనని మొన్ననే బేరీజు వేయించాను
మరో బడ్జెట్‌దాకా నా సంసారానికి మరేం బాధ లేదు
"సుఖ సంసారం" మీద పాత కవి రాసిన ఖండకావ్యం మొన్ననే కళ్లబడింది
వారపత్రిక తీసి అట్టవేసి భద్రంగా దాచుకున్నాను

చరిత్రగా మిగిలిపోయే నిజాల్ని భద్రంగా దాచుకోమన్నాడు కదా చరిత్రకారుడు!
మా వీధి చివర కట్టే భవనంలో నిన్న ఎవడో సిమెంటు బస్తా ఎత్తుకుపోయాడు
నిజాయితీ గురించి ఆ యింటి యజమాని –
రెవిన్యూగుమాస్తా – ఎంత చక్కగా మాట్లాడాడనుకొన్నావు!
హార్ట్ ఎటాకులు ఎందుకు వస్తాయో మా ఆవిడ రీసెర్చి చేసి మరీ కనుక్కొంది
వార్తా పత్రికలు చదివితే అవి తప్పనిసరిగా వస్తాయట!
కథలు చెప్పడం బ్రహ్మదేవుడి ఆఖరి వ్యసనం భాయీ
కథలు సృష్టించడం కలవాడి మొదటి హాబీ
నిజం చెప్పాడని మా పక్కసీటులో డి–2కి నిన్ననే సస్పెన్షన్ ఆర్డర్ ఇచ్చారు
ఎప్పుడో అందవలసిన గ్రాట్యుయిటీ యిప్పుడే అందుతుందనీ
ఆరో అమ్మాయికి ఆలశ్యంగానయినా పెళ్ళి చేయొచ్చని సంబరపడుతున్నాడు
ఏమిటో ఉగాదిపూట నాలుగు మాటలు చెప్పాలని యిదంతా రాస్తున్నాను కాని
రాయాలనుకొన్న విషయాలన్నీ పరగడుపున పడిపోయాయి
ఇది గేయమో, గాయమో అని గాభరాపడకు
మధ్యతరగతి మానవుడు కవి అయితే
కందాలూ, ఛందస్సులూ కలిసి రావు
కలం రాయాలన్నా సిరా ఖర్చు తప్పదు
తాజాకలంలో మజా లేకపోతే నాకు రాయడం మరిచిపోకు
మరోసారి రాసినప్పుడు మరిన్ని కొత్త విషయాలు విప్పుతాను
ఎంత ఖర్చు చేసినా కలిసి వచ్చేది ఏమిటని నువ్వడిగావొకసారి
"కాలం" అని యిప్పుడే తెలిసివచ్చింది
పేపర్లు చదవడం మానేస్తున్నాను కనుక మరో ఉగాదిదాకా బతికి వుంటాను
అందాకా ఏదో చెప్పాలి కనుక ఇలాంటి సమయంలో కనే కలే మళ్ళీ కంటాను
ఈ కొత్త సంవత్సరం
నీకూ, నీ యింటిల్లిపాదికీ ఆనందప్రదం కావాలనే మళ్ళీ అంటాను.

*ఆంధ్రజ్యోతి వీక్లీ, 18.4.1975*

## నేను రాసిన మా ఆవిడ ఉత్తరం

*(కొత్త సంవత్సరం ఫోర్జరీతో ప్రారంభమవుతోంది!)*

ఏమిటో ఈ ఉగాది పూటా మీరక్కడా నేనిక్కడా
ఈ జీవితం ఎప్పుడు చూసినా ఎదుగూ బొదుగూ లేని యిసుక తక్కెడ
ఎన్నో విషయాలు రాయాలని కూర్చున్నాను కాని
చిన్నవాడు సులోచనాల అద్దం ఇప్పుడే బద్దలు కొట్టాడు
ఒంటి కన్నుతో ఉత్తరం రాస్తున్నాను
పంటి నొప్పి యింకా అలాగే వుంది –

నేను బయలుదేరేనాటికి 'కవిత్వం కవిత్వం' అంటూ
ఆపసోపాలు పడుతున్నారు
ఆ జబ్బు ఈ పాటికి నయమయి పత్యం తింటున్నారని ఆశిస్తాను
వచ్చేటప్పుడు బాబ్జీగాడి బట్టలు యిస్త్రీకి పంపించాను
కోకిలా, మలయపవనం అంటూ పరాకు చిత్తగించక
తెప్పించి బీరువాలో పెట్టండి
పాలమనిషి పలువరసమీద మీరు అలవోకగా చెప్పిన పద్యం
తన భాష కాదు కనుక తిట్టనుకొని ఫస్టునుంచి వాడుక మానేస్తానంది
పళ్లు బాగులేని పాలమనిషిని నేనొచ్చేలోగా మాట్లాడి వుంచండి
ఇక ముందు మీ కవిత్వం పాల మనిషి పళ్లదాకా వెళ్లకుండా జాగ్రత్త పడండి
సందర్భం వచ్చింది కనుక రాస్తున్నాను
సత్కృపాలేశం, 'ప్రేమ విశేష సంభృత పరీ రంభ క్రియా సంభ్రమ భ్రమ'
అంటూ ఆ ఉత్తరం ఏమిటీ !
మా అన్నయ్య తెలుగు లెక్చరర్ కనుక పింగళి సూరన్నని గుర్తుపట్టాడుకాని
మరీ జబ్బు ముదిరిపోయిందని నేనెంత కంగారు పడేదాన్నో
అదిసరే –
ఎదురింటి మామీ గారి మనుమరాలు మామిడల్లం పచ్చడి చేసి పంపిస్తానంది
వచ్చినప్పుడు ఆవిడ ముక్కుని ఒకసారి జాగ్రత్తగా పరిశీలించండి.
అలాంటి బేసరీ కొనుక్కోవాలని మిమ్మల్ని కట్టుకున్నప్పట్నుంచీ ముచ్చటగా వుంది
నీకీ చిన్నపిల్ల బుద్ధులేమిటని వెక్కిరిస్తారు కాని
రెండు పదులు గడిచినా ఈ జీవితం యింకా
నీరెండలో మెరుస్తున్న నిమ్మచెట్టులాగే వుంది
అక్కడక్కడ తల మీద జుట్టు రాలిపోతున్నా
మీ ముఖం చూసినప్పుడల్లా సిగ్గు సింహద్వారం దగ్గరికొచ్చి
ఆగిపోయిన అభిసారికలాగ అనిపిస్తుంది–
ఇద్దరి పిల్లల్తో ఈ జీవితం అప్పుడే ఖద్దరు నేతలాగ
ముతకయిందని మీ కనిపిస్తుందేమో గాని
దట్టమయిన మంచు వెనుక నా కెప్పుడూ

ఆశామందారం వికసిస్తున్నట్టే వుంటుంది
వర్షపు సాయంకాలం సైకిలు మీద ఒంటరిగా పెళ్ళి చూపులకొచ్చినప్పుడు
వర్షం చినుకులు అతికించుకుని అకాలంలో
కన్ను విప్పిన మెత్తని ఉదయంలాగ కనిపించారు
మీ గురించి రాయాలంటే నా కలం పాళీకి కర్పూరం అద్దినట్టుంటుంది
గతంలో కన్న పంచరంగుల కలలు పడుచుతనాన్ని వెక్కిరిస్తున్నట్టు కదుల్తాయి
యౌవనం ఒక మౌన స్మృతి
అనుభవం ఒక మధుర గీతి
కలల్లో కాంతా సమ్మితమైన చైతన్యాన్ని మీరు చాలా సమీకరించారుగాని
కలం పట్టే సరికి అలంకారాలు, ఛందస్సులు మరీ
లాంప్ పోస్టుల్లాగ మీ ప్రయాణానికి అడ్డం తగుల్తున్నాయి
కారణం ఎప్పుడయినా ఆలోచించారా?
కవిత్వం చెప్పాలనే ఆర్తికి ఆలంబన కేవలం
శబ్దార్థ చంద్రిక కాదని
స్వాప్నిక జగత్తులో ఒక అనుభూతినయినా తట్టి లేపే
ట్రాన్స్పరెంట్ చేతన అవసరమని –
సరే, నేను కవిత్వం మొదలెడితే
అంట తప్పేలాలన్నీ చిన్న బుచ్చుకుంటాయి
అక్కరకురాని అవిటితనం ఒకరికుంది, అదే చాలు
పొద్దుటే చేదు పచ్చడి తింటున్నప్పుడు
రౌద్రి వయ్యారంగా మన ముంగిట్లో
అడుగు పెట్టడం ఊహించుకున్నాను
ఆనవాయితీగా ఆహ్వానించడం మీ కలవాటే గాని
మీ కవిత్వంతో బెదరగొట్టక నేనొచ్చేదాకా సేద తీర్చుకోనివ్వండి
ఆ తర్వాత మేమిద్దరం కలిసి మీ జీవితాన్ని అలంకరిస్తాం
నిరుడికన్న ఈ ఏడు కాస్త మెరుగవాలనే
ఆశని ఆనవాయితీగా వెలిగిస్తాం

*31.3.1978*

## పంచముఖి

అదేమిటండీ బాబూ, అప్పుడే వచ్చేసిందా ఉగాది?
అప్పుడెప్పుడో వచ్చిన దివి సీమ ఉప్పెన లాగ
పెళ్ళాన్ని మోసం చేశానని అర్థాంతరంగా తోసుకొచ్చిన
ఆస్ట్రేలియా ప్రధాని కన్నీళ్లలాగ
భారతదేశంలో పుట్టి బ్రిటిష్ రాజకీయాల్ని కుదిపి పలకరించిన
పామెలా బోర్డెస్ సెక్సు కథలాగ
అప్పుడే వచ్చి పడిపోయిందా మరో కొత్త ఉగాది?
పాత రాత్రిలో పీడకలల్ని పదే పదే నెమరువేసుకొంటూ
కొత్త ఉదయం మెత్తని చెప్పుతో బుద్ధి చెప్తుందేమోనని ఓ పక్క భయపడి చస్తూంటే
డెబ్భయ్యేళ్ల గ్రీసు ప్రధాని ముప్ఫైనాలుగేళ్ల అమ్మాయితో జరిపిన
ముచ్చటయిన ప్రణయం లాగ
అమెరికా శ్వేత భవనంలో బుష్‌గారి పడగ్గదిలో లిల్లీ కుక్క అందమయిన ప్రసవంలాగ
అప్పుడే దూసుకు వచ్చిందా మరో దొంగ ఉగాది?
మేస్టారూ! మనుషుల్ని పోలిన మనుషులుంటారని మీకు తెలుసు
సినీ కెమెరా ఒకే మనిషిని ఇద్దరిగా చూపి మోసం చెయ్యగలదని మీకు తెలుసు
మనిషిలో మనిషిని గుర్తు పట్టలేక పోవడం ఆత్మవంచనకు అడ్డదారని మీకు తెలుసు
ప్రతి యేటా ఈ రోజుకి కొత్త పేరు పెట్టుకోవడం పంచాంగాలు తీసుకొనే అలుసు
అయినా మనలో మన మాట చెప్పండి –
తుపాకుల పేర్లు మారుతున్నాయి కాని తూటాల ధాటీ తగ్గుతోందా?
దేశాల పేర్లు మారుతున్నాయి కాని ఆవేశాల పోటీ తగ్గుతోందా?
ఆటంని చీలిస్తే అణుబాంబు పుడుతుందని ఆ రోజుల్లో హిరోషిమా సాక్ష్యం చెప్పింది
ఇప్పుడు – ఏభైయేళ్ళ తర్వాత

ఆటంని  చేరిస్తే కొత్త శక్తి పుడుతుందని శాస్త్రం రహస్యం విప్పింది
కొత్త తుపాకుల్తో పాత పద్ధతిలోనే చంపొచ్చని
అమెరికాలో పసిపిల్లల మీద ప్రయోగాలు చేశారు
పంజాబులో చావుల పట్టికలో అంకెల్ని
ఎప్పటికప్పుడు మార్చుకోవడం అలవాటు చేసుకొన్నారు
ఉగాది కదా అని ఉదయించే సూర్యుడు దిక్కును మార్చుకోలేదు
ఉగాదినాడు కూడా మృత్యువు మీద పడుతుందని
మానవుడు దిక్కులు చూడడం మానలేదు
ఉన్ని బట్టల మీద ఈ మధ్యే ఆర్థిక మంత్రిగారు సుంకాలు పెంచారు
ఉన్న బట్టలు వేసుకోడానికే కొందరికి టైం చాలడంలేదు
సరదాగా కవులు కళ్లముందు జరీ పరదాలు దించడానికి
ఇది అందమయిన సంకేతం
పరదాస్యం వదిలి నాలుగు దశాబ్దాలు ముందుకు నడిచామని
చంకలు గుద్దుకోడానికి ఇది ఒక వేదిక
చెయ్యకపోతే చెయ్యిదాటిపోతుందేమోనని మనం వార్షికంగా జరుపుకొనే వేడుక
అప్పుడే ఏం ముంచుకు పోయిందని వచ్చింది చెప్పండి ఈ ఉగాది?
ఇంగ్లీషు కాన్వెంటు పిల్లలకి ఇది కంట్లో బూది
వార్షికంగా కవిత్వాలు వొరగబోసేవారికిది ఆటలో అరటిపండు
అసలు విషయానికి వస్తే
ఇది పురుగులున్న మేడి పండు
ఆర్యులకు, ఆధునిక కవివరేణ్యులకు ఇదే నా మనవి
అయిదేళ్లుగా పేరు మార్చుకొంటూ ఒకే ముఖంతో
చెలామణీ అవుతున్న ఈ ఉగాదిని గుర్తు పట్టండి.
ఏటేటా ఎంతో ఆశతో ఆహ్వానిస్తున్నా నిరాశనే మిగిల్చి పోతున్నందుకు
ముఖం వాచేలా చీవాట్లు పెట్టండి
పాతికేళ్లుగా దక్షిణాఫ్రికా జైళ్ళలో పాతిపెట్టిన
వ్యక్తి స్వేచ్ఛ మండేలాగా గుండెలు మండిస్తున్నా
న్యాయాన్ని భగవంతుడి మీద భారం వేసి రాజకీయాల చేతుల్లో

ధారపోస్తున్న ఠక్కర్ వెన్నెముకకి బలం నిలదొక్కుకునేలాగ
ఈ దేశం మేధావుల చేతుల్లో వర్ధిల్లాలని
18 ఏళ్ళ పసివాళ్ళ మస్తిష్కాల్లో మన్నికయిన ఆలోచనని ప్రసాదించేలాగ
ఈ కొత్త ముఖాన్ని ముఖం చెల్లించుకోమని మీమాటగా చెప్పండి
రేపుని రేప్ చేసే కుహనా రాజకీయ నాయకుల జేబుల్లోంచి
ఉత్త పుణ్యానికి ఉపాధ్యాయుల్ని కాల్చే తీవ్రవాదుల తూటాల్లోంచి
మత వైషమ్యం లోంచి, కుల ఉన్మాదం లోంచి
చావులోంచి, చంపడం లోంచి
పక్కవాడి హితాన్ని ఉరితీసే రొచ్చు ఆవేశాల్లోంచి
క్రాంతి కళ్ళు తెరవదని అయిదోసారయినా పాఠం చెప్పమని
ఈ పాత ముఖానికి చెప్పండి
వసంతం మీదా, ఈ సమాజానికి కావలిసిన హితం మీదా
మారేకాలంతో పాటు మారాల్సిన మానవతాశీలం మీదా
నాకు నమ్మకం లేదని మీరు భావిస్తే – కాస్సేపు మన్నించండి
మానవుడు ఎప్పటికయినా మనస్సు మార్చుకోడా అని –
పుట్టబోయే ప్రతి శిశువుద్వారా భగవంతుడు
తన ఆశని వ్యక్తం చేస్తాడని గురుదేవులు అన్నట్టు
ఎన్ని పేర్లు మారినా, ఎన్ని ముఖాలు మార్చుకున్నా
కొత్త సంవత్సరం కాస్త మనశ్శాంతి నివ్వదా అని
బలహీనపు ఆశ యింకా చావని మనిషిని
పేరు మార్చుకు వచ్చినా పాస్‌పోర్టులో ఫొటోను గుర్తుపట్టామని ఈ ఉగాదికి చెప్పండి.
పాత చరిత్రని తిరగవేసే నమ్మకమయిన గూఢచారులు
తన చుట్టూ ఉన్నారని హెచ్చరించండి
ముఖం మార్చుకోలేకపోయినా సమస్త లోక కళ్యాణాన్ని వాంచించే
కొత్త సంతకాన్నయినా ప్రాక్టీసు చెయ్యమని
ఈ ఉగాదికి ఆఖరి వార్నింగుగా తెలియజెయ్యండి.

*7. 4. 1984*

## ఉగాది గీత

ఏమిటి నేస్తం? నీకింకా ఉగాది గుర్తుందా?
అప్పుడెప్పుడో అవనత శిరస్సులతో
ఆశాపూరిత దృక్కులతో, ఆహ్లాదంతో
వసంతం శివార్లలో వసివాడని పసి ఉగాదిని
పుట్టింటికొచ్చిన పుణ్యమూర్తిలాగ ఆహ్వానించుకొచ్చేవాళ్ళం
చేదు పచ్చడి చప్పరిస్తూ, స్వాదు కవితల్ని పాడుకొంటూ
రేపు నవనవోన్మేషమయిన కొత్త ఆశల్ని రేపుతుందని
బాధా తప్త హృదయాల్లో దిగులు మాపుతుందని
కలల కావిళ్లు విప్పుకుని పండగ చేసుకొనే వాళ్లం –
అప్పుడెప్పుడో రాచబాటలో పారాణి దిద్దిన కాళ్ల చప్పుడు
పావురాయి గొంతులో శాంతి సందేశం వెదికిన క్షణం
కలం కాగితాన్ని చూస్తే కవిత కస్సుమని దూసిన క్షణం
ప్రేయసి కరుణాంతరంగంలో, అరుణ సంధ్య చెక్కిలి ఎరుపులో
మల్లెపువ్వు మధుర దరహాసంలో, పిల్లగాలి చల్లని పిలుపులో
సిరా మరకలో, నిప్పు చురకలో
చలిలో, నెచ్చెలి కౌగిలిలో
వెచ్చని ఆవేశంలో, పచ్చని పైరగాలిలో
ఎటు చూసినా ఎంత ఆనంద పారవశ్యం!
రేపు నన్ను మోసం చెయ్యదని ఎంత గుడ్డి విశ్వాసం!
గతాన్ని గర్వంగా సాక్ష్యం చేసుకొని
నా శరీరాన్ని తాకే గాలిలో కూడా గానామృతాన్ని వూహించుకొని
ఉగాది నుంచి ఉరవడిగా వూహల దారాల్ని

పడుగు పేకలు చేసి ఎన్ని పట్టు తెరల్ని దించాను?
ఇవాళ మళ్లీ, ఆశలకు కాలం చెల్లి
అలవాటయిన ఆలోచనలకు అనవరతం
నయన కారాగారాల్లో ప్రజ్వలించే కాంతి పుంజాలకు
చేతులడ్డం పెట్టి చీకట్లోకి
చూడడం అలవాటు చేసుకున్నాను –
నేస్తం, ఉగాది పాట పాడమని ఎంత తొందరపడి అడిగావు
ఉగాదిని ఎలా గుర్తు పట్టను?
ఆశా శారికలు సంప్రదాయ సంపన్నమయిన
ముఖాన్ని పలకరిస్తూండగా దరహాస చంద్రికలను
ప్రసరించే స్నిగ్ధ మోహనమూర్తి గానా?
కాలం ఆరు రుతువుల్ని గడిచి ఆమనిలో
కొత్త వలువల్ని ధరిస్తోందని ఏ కేలండరు సాక్ష్యం చెప్తుంది?
పరిసరాల్ని మరిచిపోయి ఆహ్లాదాన్ని అలవాటుగా నటించే
అదృష్టవంతుల ముఖాల్ని ఏ టార్చిలైటుతో వెదకమంటావు?
ఉదయానికి వయస్సు మీరి చీకటి వొళ్లు దులుపుకొని
రాత్రులూ పవళ్లూ రాసలీలలాడే కాలభ్రమణం
చాలా రోజుల క్రిందటే క్రమం తప్పింది –
పంజాబు సోదరుల పాశవిక మారణ హోమంలో
తెల్లారిలేస్తే ఏ కొత్త చావు వినాలో అనే భయంతో
రాత్రుళ్లనే ఆహ్వానిస్తున్నాను –
రాక్షస ప్రవృత్తి స్వైరవిహారం చేసే నేలలో నిద్రాణమయివున్న
నిరంకుశ ప్రవర్తన మనస్సుని కల్లోల పరచకుండా
రాత్రి తెల్లవారకూడదని రాత్రింబవళ్లూ ప్రార్థిస్తున్నాను –
ఉదయం హృదయం విప్పి పలకరించే వార్తాపత్రికల్ని నిరసిస్తున్నాను
ఉగాదికి ఏది సంకేతం భాయీ?
చీకటి తెరల్ని ప్రాగ్దిశ చీల్చిన క్షణమా?
కర్తారా సింగ్ గుండెల్లో కరకు తుపాకులు పేలిన క్షణమా?

దర్బారా సింగ్ నిర్భాగ్యపు కొడుకు నెత్తుటి ముద్ద అయిన క్షణమా?
మరో లక్ష్మణ్‌సింగ్, కేర్ సింగ్, కేశవ సింగ్ జీవితాలు
అర్థం లేని వ్యర్థ ఉద్యమానికి బలి అయిన క్షణమా?
రాంపూర్‌లో పది మంది పెద్దన్నలు
ఎందుకు చచ్చిపోతున్నారో తెలీకుండానే
టెర్రరిస్టు స్టెన్ గన్‌లకు మట్టి కరిచిన క్షణమా?
భాష భావాల్ని ఆవిష్కరించే అపురూపమయిన హరివిల్లని విన్నాను
మతం మనిషిని మనిషిగా మార్చే హితమని నమ్మాను
అనూహ్యమయిన లక్ష్యం కోసం సొంత తమ్ముళ్లనే
నరుక్కునే వింత ఉద్యమం మానవతను వెక్కిరించే మహా వ్రణం
ఏం నేస్తం? ఉగాదిని జలంధర్‌లో జరుపుకుందామా?
జలియన్‌వాలాబాగ్‌లో జరుపుదామా?
జలజల కారే సిక్కు సోదరి కన్నీటిజాలులో అభ్యంగన స్నానం చేసి
కొత్త బట్టలు కట్టుకొందామా?
జాతి నిర్వీర్యమయిపోయి తనకి తానే నిప్పంటించుకొనే
అర్థ రహిత హింసా జ్వాల – ఈ ఉగాదిని ఉరి తీయడం లేదా?
తన మాటని నెగ్గించుకోడానికి అచంచలమయిన ఆత్మవంచన చేసుకొనే
మానవుని మేధకు ఈ ఉగాది ఉత్తమమయిన సంకేతంగా భావిస్తే
వచ్చే ఏ ఉగాదీ నీ ఆశయాలను ఆచరణలోకి అనువదించక పోయినా
రాబోయే ఉగాదిని హృదయపూర్వకంగా ఆహ్వానించడం నీ వ్యసనమనుకొన్నా
మారే కాలం పట్ల మారని నీ విశ్వాసమని సరిపెట్టుకున్నా
తమని తాముగా గుర్తించాలని కోరే తమిళ సోదరుల ఆర్తనాదాలకూ
తమ బ్రతుకుని తమని బ్రతకనివ్వమని ఆక్రోశించే సిక్కు సోదరుల ఆక్రోశాలకూ
ఈ క్షయ నామ సంవత్సరం సమాధానం చెప్పగలదని యింకా నీకు అనిపిస్తే
ఈ ఉగాది పూటా సన్మంగళానిభవంతు అనే
సాహసోపేతమయిన వాంఛని ఊసుపోని కవిసమయంగా
మాత్రం ఉట్టంకిస్తున్నాను.

*7.4.1986*

## కొత్త బాణీలో పాత పాట

పట్టుమని పన్నెండు నెలలు గడిచాయి గనుక
గోడమీద కేలండర్లో 365 కాగితాలు తెగాయి కనుక
పాత పాటని వినడానికి మీరూ అలవాటు పడిపోయారు గనుక
చర్విత చర్వణమే అయినా, నడిచిన బాటనే మళ్ళీ నడిచినట్టు
గడచిన గతాన్నే స్వగతం చెప్పుకుని
రేపు నిన్నటి కన్న బాగుండి చావదని మనస్సులో వున్నా
రేపుని బులిపించడం కలంతో జరిగిపోయే పనే గనుక
అదిగో, పేరు మార్చుకున్నా పాతముఖంతోనే ప్రత్యక్షమయిన

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం –
చిలుక తత్తడి రౌతు మల్లాదివారి కాలం నాటికే
మనసు మార్చుకుని రిటైరయిపోయాడు –
మానవుడు సైన్సు పేరిట ఆకాశంతో  ఆడే పరాచికాలకు
వసంతం ఆరేళ్ళ కొకసారయినా ఆలశ్యంగా దర్శనమివ్వడం లేదు
మామిళ్లు పూచిన చోట పూస్తున్నాయి –
సిమ్మెంటు జనారణ్యాలలో ఈ మధ్య వేప చెట్లకూ
స్థలం లేకుండా పోయింది –
మధుమాసం హాసం చేసే రోజులు పోయి మోసం చేసే రోజులొచ్చాయి –
అందుకని రికార్డు సినిమా పాటల్ని పెట్టి
పచ్చని రంగు కాగితాలనే వసంతాలకి గుర్తుగా చుట్టి
మొహం చెల్లకపోయినా చిరునవ్వుని మొహం మీద అతికించుకుని
కుడికాలుని ముంగిట్లో పెట్టమని ఆ కొత్తాయనకి చెప్పండి –
మరుదయార్ నదీ తీరంలో రాక్ ఫోర్డ్ ఎక్స్‌ప్రెస్ కూలిన డబ్బాల కింద
ఎంతమందికి నూరు వసంతాలు నిండాయో
సిక్కు సోదరుల మతావేశానికి
లూధియానాలో ఎందరు సోదరుల జీవితాలు పండాయో
అటు జాఫ్నాలో, ఇటు జెరూసలేంలో
ఇక్కడ లిబ్యాలో, అక్కడ బైజింగ్‌లో
చావు పుట్టుకల లెక్కలతో సతమతమవుతూంటే
పూర్ణ కుంభాలతో, పూజా ద్రవ్యాలతో స్వాగతం చెప్పలేదని
ఆయన్ని ముఖం చిన్నబుచ్చుకోవద్దని చెప్పండి –
వార్షికంగా వచ్చాడు కనుక తలుపులు తెరుస్తున్నాం గాని
పాత కేలెండరుకి పదమూడో నెలన్నా
కిందటి సంవత్సరానికే ఇది మరో దొంగ పేరన్నా
రోజుకి 48 గంటలు పెంచినా
మతంతో, మానవత్వంతో
ప్రకృతితో, ప్రాకృత ప్రాథమిక నైతిక చింతనతో

వెర్రి ఆటలాడుతున్న మాకు మరేం ఆక్షేపణ లేదు
రెండురెళ్లు ఎంతో ఆనాడు పెద్ద బాలశిక్షకి అర్థం కాలేదు
అరవైయేళ్ల తర్వాత పాత సంవత్సరానికి ఏం పేరు పెట్టాలో
పంచాంగాలకి బోధపడలేదు –
మొహంజొదారో, హరప్పాల్లాగ
ఉగాదులు యుగాదులుగా
ఆ రోజుల్లో గడిచేవని చెప్పడానికి నిన్నటి చరిత్ర చాలు –
తీరిక దొరికినప్పుడు చదువుకోమని మాముందు తరాలకి చెప్తాం
కరంజిత్ సింగ్ చేతిలో కరకు తుపాకీ వుంటే
గాంధీ జయంతి నాడు జాతి చరిత్రలో ఎంతటి చీకటి అలుముకొనేదో
పొరుగుదేశం గిడ్డంగిలో అణ్వాయుధాలు రొమ్ము విరిస్తే
రేపటి గుండె ఎన్ని ముక్కలుగా పగులుతుందో
రామేశ్వరం సముద్ర జలాల్లోకి జాఫ్నా రక్తపాతం ఎప్పుడు ముసురుకొస్తుందో
బూతు సినిమాల్ని చూసి చూసి పక్కింటి బాబుని
మా మనవడెక్కడ లేపుకు పోతాడో –
సింగపూర్ టీవీలో ఎర్రమార్కు వీడియోలు నట్టింట్లోకి
దిగుమతి కాకుండా ఏ కొత్త తాళాల్ని కనిపెట్టాలో
తెలీక జుత్తు పీక్కొంటున్న మా మధ్యకి
ఈ పెద్ద మనిషి పిలవని పేరంటంగా
వస్తే ఎంత రాకపోతే ఎంత?
ఇంకా పాడు పడని మా సంస్కారం ఎక్కడో కొనవూపిరితో వుంది కనుక
అలవాటయిన ఆచారాల్ని వదులుకోవడం అలవాటు తప్పలేదు కనుక
చేతిలో కలం వుంది కనుక వినడానికి శ్రోతలున్నారు కనుక
ఎదురు చూడకపోయినా వీధి గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు కనుక
అలా వచ్చి వరండాలో కూర్చోమని చెప్పండి
వంటవగానే భోజనానికి పిలుస్తామని చెప్పండి –

*1987 ఉగాది*

## సంపాదకునికో లేఖ

ఘనత వహించిన సంపాదక మహాశయా!
ఆనవాయితీగా మా యింటికి రావలసిన ఆడపిల్ల
ఆచూకీ తెలీక అందరం కంగారు పడుతున్నాం
ఆంధ్రదేశంలోనో, అఖండ భారతదేశంలోనో
ఎక్కడో బిక్కుబిక్కుమంటూంటుంది –
ధైర్యం చెప్పి మా యింటికి చేర్చిన వాళ్లకి
అడిగినంతా యిస్తామని హామీ యివ్వండి
అమ్మాయి పేరు విభవ, సరిగ్గా యీ సమయంలోనే
వసంతాన్ని తోడుతెచ్చుకొని
కొత్త ఆశల్ని గుండెల నిండా విచ్చుకొని
కొండంత ఆనందంతో తరలి వస్తుంది –
ఈ ప్రకటనక్కూడా దొరక్కపోతే పోలీసురిపోర్టు యిస్తాం
నమ్మకమయిన మనుషుల్ని పెట్టి ఊరంతా వెదికిస్తాం
అసలే కష్టాల్లో వుంది, అచ్చుతప్పుల్లేకుండా పేరు చెప్పండి
అర్థంకాని ఆదుర్దాతో వుంది, అపార్థాలకి తావివ్వకండి

ఆంధ్రదేశంలో అన్ని పేపర్లకీ ప్రకటనలిచ్చాం
మా మనస్సు ఆ అమ్మాయికి తెలపాలని మదనపడుతున్నాం
ఇంటింటికీ మామిడి తోరణాలు లేవని ఇంచుక దారి తప్పి వుంటుంది
మామిడి చెట్లు లేని సిమ్మెంటు జనారణ్యాలలో వున్నామని ఆమెకి చెప్పండి
ముంగిట్లో ముగ్గులు కనిపించడం లేదని చిన్నబుచ్చుకొని వుంటుంది
సిటీ ముంగిళ్లు అంగళ్లుగా మారాయని ఆ అమ్మాయికి తెలీదు పాపం
మంగళ వాద్యాలకోసం చెవులు సారించి వుంటుంది
కోకిలారావాలకై ఎదురుచూసి వుంటుంది
సిటీ స్కై స్క్రాపర్ల వీపు మీద సూర్యోదయం చిక్కుపడిందని చెప్పండి
సంప్రదాయం మీద నాగరకత నల్లటి ముసుగు పరిచింది.
నగరంలో ఉగాది అప్పుడెప్పుడో అంటించిన నగ్నసుందరి వాల్‌పోస్టర్
నిన్నటి జ్ఞాపకాలతో రేపుని కూడా మోసం చేద్దామని వచ్చే ఇంపోస్టర్
సంపాదక మహాశయా! కేలండర్‌లో తేదీని గుర్తుపెట్టుకుని
ఇవాళ్టి ఉదయానికి 'ఉగాది' అని దొంగ పేరు పెట్టిన
కవితల కసరత్తులు మీ పేజీల్లో చాలా జరుగుతాయి
వాటి మధ్య మా అమ్మాయి ప్రకటన మరుగు పడకుండా చూడండి
కలల కౌగిళ్లలో కాలం కొత్త సంవత్సరాన్ని ప్రసవించిందనీ
ఆశల అరుణోదయానికి ఈ దినం నాంది అనీ
నవ వసంత శోభలతో రేపు శోభిస్తుందనీ
పాత గుర్తులు ఉట్టంకించే పాడుబడిన కవితా సంకేతాల వెనుక
మా అమ్మాయి కనిపించదు
దమ్ముంటే – నిజాయితీని ఎవరయినా నమ్ముంటే
అమృతసర్‌లో, గురుదాస్‌పూర్‌లో
బట్టికోలావోలో
బాగ్దాద్‌లో, ఆబూమూసాలో
వెన్నెముకలో చలిగాలులు ప్రవహించేలాగ
మానవతా నైచ్యాన్ని మళ్లీ మళ్లీ నిరూపిస్తున్న
మన సోదరుల స్టెన్‌గన్ చప్పుళ్ల సైన్‌పోస్టుల వెనుక

నూతన శకాదిని వెదకమని చెప్పండి
స్వాగత వచనాలు పలికే మా గుండెల్లో యింకా వెచ్చదనం పూర్తిగా
చల్లారిపోలేదని ఆమెకి నచ్చచెప్పండి
రేపుని ప్రేమించడం మనిషికి వ్యసనం
చురకత్తి ఒరలోంచి మెడ మీదికి దూసుకువచ్చే వ్యవధికి
స్థిరమయిన శాంతని దురభిప్రాయపడడం అలవాటు
భవిష్యత్తు దిసమొలతో ఎదురునిలిచినా
కళ్లకి ఉల్లిపొర కాగితాల్లాగ
ఊహలకి ఉచ్చులు బిగించడం
రేపులకి కవితల రేపర్లు చుట్టడం
మా కవిగాళ్ల కర్తవ్యం – క్షమించండి –
కీకారణ్యంలో ఆముదం దీపాలు చూసి
వైట్ హవుసని భ్రమసి
అర్థంలేని ఆశయాల సహారాలోకి తరలిపోయిందేమోనని భయంగా వుంది
ఇంత చెప్పాక వింత అనుమానం మరొకటి పొడచూపుతోంది
ఆవిడ రాలేక ఆగిందా
రావడం యిష్టంలేక సాగిందా అని
అందుకని కనిపిస్తే మా మాటగా యీ నాలుగుముక్కలూ చెప్పండి –
"అమ్మా! విభవా, నువ్వు కనిపించలేదన్న దిగులుతో
ఇంటిల్లపాదీ బెంగటిల్లిపోతున్నాం
ఏం చెయ్యాలో తెలీక అందాకా మమ్మల్ని మేం నరుక్కొంటున్నాం
ప్రభవ మాకు ఒరగ బెట్టిందేమీ లేదు
ఇలాగే బుజ్జగించి తీసుకొచ్చి ఓ మూల పారేశాం
ఇప్పుడంతకన్నా నువ్వు గొప్పపని చేస్తావన్న ఆశ మాకు లేదు
నిన్నేమీ తిట్టమని హామీ యిస్తున్నాం
పక్కింటి కుక్కపిల్ల నీకోసం బెగపెట్టుకుంది
అందమయిన కేలెండర్లు నీ పేరుతో అచ్చయిపోయాయి
పంచాంగ శ్రవణం జరపకపోతే పఠించే వాళ్లకి అన్యాయం జరుగుతుంది

అయినా అబ్బాయి చెడిపోతాడని అమ్మ పాలివ్వడం మానేస్తుందా?
చీకటి వ్యాపారుల మీద కినుకతో చందమామ మొహం చాటుచేసుకుంటాడా?
తెల్లారిలేస్తే కొత్త రోజుని గుర్తు పెట్టుకోడానికి ఏదో పేరు కావాలి
అందుకనే నీకు యిష్టం వున్నా లేకపోయినా నువ్వు రావాలి
మంత్రపుష్పంలో, మార్వాడీ పద్దుల్లో
పంచాంగాల్లో, కవితల్లో
దస్తావేజుల్లో, ఊసుపోని కాలక్షేపాల్లో
కాలాన్ని కొలవడానికి ఏదో గుర్తు కావాలికదా?
అందరం సగం చచ్చి, నీరసించి వున్నాం
రావడం నీ బాధ్యతనుకొని వచ్చెయ్
అలనాటి ఆనందాన్ని అలవాటుగా పంచిపెడతాం
ముగ్గులు దిద్దిన ముంగిళ్లనీ
చిరునవ్వులు వెలిగించుకొన్న హృదయాల్నీ
మనస్సులోనయినా ఊహించుకొన్న ముసిలి ముఖాలయినా నీకు స్వాగతం చెబుతాయి
ఎంత చెడి బతుకుతున్నా
ఇంటికి రావలసిన ఆడపిల్లని ఆహ్వానించలేదన్న నామోషీ మాకొద్దు
ఎక్కడికి చేరాల్సిన వాళ్లు అక్కడికి చేరితే ఆనందంగా వుంటుంది
ఎవరింట్లో వాళ్లుంటే మర్యాదగా వుంటుంది
ఏమో, క్షీరసాగరమథనంలో అమృతం వెలికి వచ్చినట్టు
నిరర్థక జీవన సరళిని మార్చడానికి మహాత్ముడు పుట్టినట్టు
నువ్వొచ్చిన తరుణంలో మంచి జరగక పోతుందా?
ఆశించడం మా హక్కు
ఇంకా నిన్ను రమ్మని పలకరించేవాళ్ళుండడం నీ లక్కు
నువ్వుండే గదిని శుభ్రపరిచాం
రాగానే మేమున్నా లేకపోయినా నీ పనులు నువ్వు చూసుకో
మళ్ళీ 365 రోజుల్తరువాత నీ గురించి ఆలోచిస్తాం.

*ఆకాశవాణి, మద్రాసు కేంద్ర సౌజన్యంతో... 2.4.1988*

## రైలు ప్రయాణం

అనుకొన్న టైముకి ప్లాట్‌ఫారం మీదకి రైలు వచ్చేసింది
అనారతంగా కాలానికి అది బానిస
పది పువ్వులు ఎప్పుడు రాలినా అది పచ్చ జెండా సంకేతమనుకొంటా
వసంతం మాట వినిపిస్తే రావడం వారసత్వమని సరిపెట్టుకొంటూ
పంచాంగాల పరువు తియ్యడం యిష్టంలేని అరవయ్యేళ్ళ ముసిలి రైలు
ఆదరా బాదరాగా స్టేషన్లోకి వచ్చి ఆగింది –
కొత్త బోగీల తయారీ ఈ మధ్యనే మంత్రిగారు ఆపేశారు

కొత్త రైళ్ళ నమూనాలు ఈ మధ్యకాలంలో అవసరం లేదని తీర్మానించారు
రాకపోతే చిన్నబుచ్చుకుంటారని
ఆ రోజుల్లోని రైలునే మళ్ళీ రప్పించారు
అమ్మమ్మ పేరు ఆఖరి అమ్మాయికి పెట్టుకున్నట్టు
పేరు ప్రమోదూత – అక్షరాలు అలికినట్టున్నాయి
బారసాల బతికి చెడిన వాళ్ళకి అక్కర్లేదు
అవ్వ పేరే ముసలమ్మ అనడానికి మళ్ళీ బియ్యంలో పసుపుకొమ్ము తిరగక్కర్లేదు
అరవై వసంతాల ఆలసట శాల్తీలో కొట్టొచ్చినట్టు కనినిస్తోంది
మామిడి పుప్పొడిని ఊహించుకొంటూ, రైలు పక్క స్టేషన్‌లో వుందనగానే
రేగుపళ్ళు, మామిడి తాండ్ర అమ్మే లైసెన్స్ కళాసీల్లాగ
కాంట్రాక్టు కవితలు రాసే కవిగాళ్లు, గాయకుల కంపార్టుమెంటు
యథాప్రకారం వసంత గానాలతో, కలకూజితాలతో కలకల్లాడుతోంది
కాకపోతే అందరిచేతుల్లోనూ అరవైయేళ్ళ కిందట డబ్బాలో జారి
ఊరిన కవితల కవిలి కట్టలు కనిపిస్తున్నాయి
కాలం పట్టాల మీద ఎప్పట్నుంచి ప్రయాణం చేస్తోందో ఈ రైలు!
అప్పట్లో వేసిన ఆదర్శాల రంగులు పిచ్చిగీతల్లాగా కనిపిస్తున్నాయి
కాలదోషం పట్టిన కలల్ని బ్రేకులో వేశారు
ఖద్దరు పెద్దగా కలిసి రావడం లేదని పాత డబ్బాకి కొత్త తాళాలు వేశారు.
కొత్త పెట్టెలు ఎలా వుండాలో ఇంకా ఎవరూ తేల్చుకున్నట్టు లేదు
పాత ప్రయాణం ముఖం మొత్తిందని అంతా ఏకాభిప్రాయానికి వచ్చారు
కంపార్టుమెంటులు కత్తుల బోనుల్లాగ వున్నాయని
ముసిలి ప్రయాణీకులు విసుక్కొంటున్నారు
మెత్తని పరుపుల్ని వొత్తుగా పరిచిన శవాల మార్చురీ
ఈ రైలుకి కొత్తగా తగిలించారని గార్డుగారు వక్కాణించారు
గూండాలకీ, గూడుపుఠాణీదార్లకీ ఆలోచనలు చెదరకుండా
చలువ పెట్టెల్ని ప్రత్యేకంగా అమర్చారు
అవసాన దశలో వున్న ఆనాటి ప్రయాణీకుల్ని ఆఖరి పెట్టెకి బదిలీ చేశారు
సంప్రదాయం వర్తమానం కంటిలో నలక

ఆదర్శం అవకాశవాది గూటిలో చిలక
ఆ రోజుల్లో ప్రయాణం చేసినందుకే రైలుకి విలువొచ్చింది
ఈ రోజుల్లో రైలు టైముకి వచ్చినందుకే ప్రయాణం కలిసొస్తోంది
రైలు నడుస్తూంటుంది
చేసుకొన్నవాడికి చేసుకొన్నంత అనుకొంటూ
అడ్డం పడ్డవాడి నీడల్ని కాళ్లలో పడేసుకొంటూ
సుఖ ప్రయాణానికి ఏది గుర్తు?
కలల్ని నేలమీదికి నడిపించి – ప్రయాణం ముగిశాక
అనుభవాల బెడ్ రోల్ వదిలేసిన నీ బెర్త్ – అదీ గుర్తు
ఆ రోజుల్లో గాంధీ కూర్చున్న రెండో తరగతి పెట్టెలో
గూండాల శిలా విగ్రహాలు రవాణా అవుతున్నాయి
ఆవిష్కరించడానికి సన్నద్ధమయిన సంస్కృతీమూర్తి సాంస్కృతిక శాఖమంత్రి
విస్కీ ముగించి యిప్పుడే విశ్రాంతి తీసుకుంటున్నారు
అలవాటుగా ఎక్కే పాసింజర్లు రైలు వాలకం చూసి ఆగిపోతున్నారు
ఆనాటి రైలుని మళ్లీ చూడడానికి పాత ఖాతాదార్లు ఆరాటపడుతున్నారు
కీళ్లు సడలిన రైలు గమ్యం ఎప్పటికి చేరుతుందని
స్టేషన్ మాస్టర్ని కొందరు నిలదీస్తున్నారు.
టిక్కెట్టులో గమ్యం గడి చెరిగిపోయి చాలా రోజులయిందని
ఇంకో సంవత్సరానికి షష్టిపూర్తికి చేరనున్న మాస్టరుగారు చిరునవ్వుతో చెప్పారు
అయినా ఎక్కడికి వెళ్ళాలో తెలిసి మీరు
రైలు ఎప్పుడెక్కి ఏడిశారని టీటీయీ కోపగించుకొంటున్నాడు
రైలు స్టేషన్ బోర్డులన్నీ ఉతికి ఆరెయ్యడానికి కర్మాగారానికి పంపారట
స్టేషన్ గుర్తుతెలిస్తే చాలు మొదటి కంపార్టుమెంటులో కవులంతా కెవ్వుమంటున్నారు
బయలుదేరేచోట అప్పుడెప్పుడో ఎక్కించిన శాంతి పావురాల్ని
పాంట్రీ కార్ వాళ్ళు రేటు కట్టి గుత్తగా కొనేసుకొన్నారట
ఉగాది పచ్చడి ఊరునుంచి పార్సెళ్లుగా పంపించారు ఉన్నవ లక్ష్మీనారాయణగారు

గాజు జాడీల్లో జాతి మౌఢ్యం మత్తెక్కించే ద్రావకాన్ని భర్తీ చేసిందట
రాయప్రోలు వారి తృణకంకణం
ఎక్సయిజు అధికారుల దయలేని కారణంగా అడ్రసు తెలీని స్టేషన్లో దింపేశారు
గురజాడవారి పుత్తడిబొమ్మ గోల్డ్ కంట్రోలు ఆక్టుకి బలిఅయిపోయింది
పాత రైలు కనుక పులుపు చచ్చిన చింత తొక్కులు అక్కడా అక్కడా కనిపిస్తున్నాయి
ఎందరో ప్రయాణీకుల పేర్లున్నాయి కాని గమ్యం చేరిన ఛాయలు తెలీడం లేదు
ఉచితంగా ప్రయాణానికి కేటాయించిన వికలాంగుల బోగీలు
ఖచ్చితంగా కాలేజీలు మానేసిన కుర్రాళ్ల సరదాలకు వినియోగపడతున్నాయి
కాలం ఖరీదయిన ఇంధనం కనుక-థాంక్‌గాడ్-ఇంజను మాత్రం భద్రంగానే వుంది
ప్రయాణం ఈ రైలుకి వ్యసనం
టిక్కెట్టు వున్నా లేకపోయినా వుదారంగా మోసుకుపోతుంది
కొడుకు కసాయివాడయినా కడుపులో పెట్టుకు దాచుకున్న తల్లిలాగ
గుండెలో తుపాకులు పేలుతున్నా గుండె నిబ్బరంతో ముందుకు సాగుతూంటుంది
ప్రమోదూత గోమాత
గొడ్డలితో కన్నబిడ్డలే గొంతు నరుకుతున్నా
అరవైయ్యేళ్లు పెంచుకున్న విశ్వాసాన్ని
అర్భకుల నైచ్యాన్ని తట్టుకొనే మందహాసాన్ని
చెరిగిపోకుండా, చిరిగిపోకుండా
అతికించుకొని ప్లాట్‌ఫారం మీదకి వచ్చింది
అవసరం లేకపోయినా అల్లంత దూరం ప్రయాణం చేద్దామని
అందరికీ టిక్కెట్టుకొని- అలవాటుగా అందరినీ ఒక్కసారి లెక్కపెట్టుకున్నాను
ఇదేమిటి ! ఈ ప్రయాణంలో ఏదో లోపం వుంది !
హృదయానికీ ఉదయానికీ ఎక్కడో రచ్చ ప్రారంభమయింది
ఇంటిల్లపాదినీ తీసుకువెళ్లే ఈనాటి ప్రయాణం ఎందుకో కుంటుపడింది
కారణం - కొన్న టిక్కెట్ల లెక్కలో ఒక్క మనిషి తక్కువవుతున్నారు -
ఆతృతగా లెక్క చూసుకున్నాను -
అప్పుడర్థమయింది - మా నాన్నగారని !

## 'వ్యయ' ప్రయాస

బాలారిష్టలు దాటి బతికి బట్ట కడతానా లేదా అనే భయంతో
గడ్డమ్మ పెంటమ్మ అన్నట్టు మా అమ్మా నాన్నా నాకు నాసి రకం పేరు పెట్టారు–
వ్యయ
చచ్చిన వాడే కాదు చచ్చేవాడి కళ్లూ చేరడేసి అన్నట్టుగా
మా అక్కలు ప్రభవ ప్రమోదూతల కంటె రెండాకులు ఎక్కువే చదివాను
పదిమంది వెక్కిరింతల్నీ దాటి పబ్బం గడుపుకొంటూ వస్తున్నాను –
కొందరి ముఖాలకి 'రాశి' వుండదు
కొందరి ముఖాలకి ఆనందం, గర్వం 'రాసి' వుండదు
నేను వస్తున్నానంటే "మామిడి పూచినట్టు మధుమాసము హాసము చేసినట్టు"
అని పాడిన ఆనాటి కవిత్వం కవిసమయంగా మారింది –
మధుమాసం హాసం మరిచిపోయి చాలా ఏళ్ళయింది
"ఊల్లె కుగాదొచ్చింది ఉర్కిరాండ్రి ఉర్కిరాండ్రి
ఊపిర్లు బిగబట్కోని, లేకుంటె అరువడ్కొని
ఉర్కిరాండ్రి ఉర్కిరాండ్రి" అన్న తెలంగాణా కవి గోడు కూడా
యాదన్నలకీ ఆశయ్యలకీ అందుతున్నట్టు కనిపించదు
చిక్కని నెత్తావిని పుక్కిలించే పూలబాలలు
చిలుక తొత్తడి రౌతు పుష్పబాణ విన్యాసాలు
రుచిపక్వంగా ఆవిష్కరించే ఉగాది పచ్చళ్ళు
చాట్‌లూ, చలువగదులూ మరిగిన పసితరానికి అందడం లేదు
దినపత్రికలు పరిణామ శీలానికి విడాకులిచ్చి
మరో అవ్యవస్థకి దిక్సూచిగా నిలుస్తున్నాయి

కాంగోలో, కాశ్మీర్‌లో, ఇరాఖ్‌లో, సొమాలియాలో
మనశ్శాంతికి అర్థం మరో జన్మ కనే కల
మారణ కాండకి రాజకీయ ముస్తాబు చేసి
మనిషి స్వార్థానికి మన్నికయిన అంగీలు తొడిగి
నిర్వీర్యత నగ్నరూపం నిన్నటి పేర్లతో చలామణీ అవుతోంది
అయ్యో, కొత్త పేరు పెట్టుకొని
మళ్ళీ పాత ముఖంతోనే వచ్చావా వ్యయా!
అంటూ ఎక్సరే కళ్ళతో సెక్స్ వర్కర్లని
నిరసించినట్టుగా నిస్త్రాణగా గొణుగుతున్నాయి పంచాంగాలు –

* * *

1946

క్రితంసారి వచ్చినప్పుడు నాకు జరిగిన రాచమర్యాదలు ఏం చెప్పను?
దేశభక్తి చిప్పిల్లే జాతి వైభవానికి అభిజ్ఞ ఆనాటి నా పేరు
త్యాగనిరతి, కర్తవ్య దీక్ష ఊపిరులుగా
మానవాళి ఏక గళమై ఎలుగెత్తిన మధురక్షణం
అవినీతి, అవకాశవాదం, స్వార్థం, ప్రాంతీయ దురభిమానం, కులం, మతం –
ఈనాటి బ్రతుకు బాటకి పర్యాయపదాలు
కాని ఆనాటి ఉద్యమ స్ఫూర్తికి విపర్యయాలు
'అహింస' అనే అపూర్వమయిన ఆయుధంతో
రవి అస్తమించని తెల్లజాతి అహంకారాన్ని ఉత్తరించిన ఉత్తమ క్షణం
రుజ, క్షుధల నుంచి, ఆకలి నుంచి, ఆర్తి నుంచి
జాతి ఆత్మగౌరవాన్ని వడ్డించిన విస్తరి చేయాలన్న ఆశంస పుట్టిన రోజు
ప్రతి భారతీయుడి హృదయంలో వెయ్యి ఆనంద తారకలు
నీరవ నిశీధినీ, నిరాశా నిస్పృహలనూ చీల్చి
సరికొత్త ఆశా శాద్వలాలను వెలిగించిన అఖండ దీపికలు
ఎటు చూసిన గర్వించే ఎద
ఏ గొంతు తెరిచినా జాతి పరవశించే పచ్చటి కల
చైతన్య పుంజాలు ఎల్లెడలా నింపేగళాలు

స్వాతంత్ర్య దీప్తిని గుండెల్లో ఎగదోసే కవుల కలాలు
దేశమంతా ఒకే దారి
మానవుడన్నవాడికి ఒకే ఆదర్శం
ఆనాటి 'వ్యయ' స్వర్ణ భారతి మార్గ మధ్యంలో
జాతి అమృత క్షణాల్ని దర్శించిన బాటసారి
నా చరిత్రకది మైలురాయి
జాతి చరిత్ర పుటల్లో కలికితురాయి –

✳ ✳ ✳

1886

పోనీ, మరో అడుగు వెనక్కు వెళ్ళేదా?
అహో, దేశ సంస్కృతీ వైభవానికది పరాకాష్ట
రాబోయే తరాలకి ఆ తరం గర్వంగా రాసిచ్చిన వీలునామా
సారస్వత శోభకి సంగీత సౌరభానికి అది అందమయిన చిరునామా
అప్పుడే గురజాడ నూరేళ్ళ నవజీవన కల్పతరువు –
కన్యాశుల్కానికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి
తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారి మాణిక్య వీణ మధురస్వరాలు పలుకుతోంది
సంస్కృత నాటకానికి సభా మర్యాదని కల్పించి
పామరజనం గుండెల్లో సైతం పది దశాబ్దాల పైన పీట వేసుకొని
ఈనాటి ఆధునికతకి ఆనాడే పునాదులు వేసిన
తిరుపతి వేంకట కవుల ఉద్యోగ విజయాలు విజయం చేస్తున్న చారిత్రక సంధ్య
మతానికి అర్థం మరిచి, బానిసత్వానికి అంతిమ తీర్పుని పరిచి
ప్రపంచంలోకల్లా నా తల్లి గొప్పదని
రొమ్ము విరుచుకొన్న ముస్లిం కవి – ఇక్బాల్ గొంతు ఖంగుమన్న క్షణం
సారా జహాఁసె అచ్ఛా హిందుస్థాన్ హమారా
సారం తెలిసే మనసుంటే నేటికీ అదే చహరా
దీనికి ఎవరికి వారు పెట్టుకున్న దొంగ పేర్లు 'ఇజా'లు
నిజాన్ని ఒప్పుకోవడం తెలీని కుహనా సిద్ధాంతులు తడువుకొన్న బుజాలు
తెల్లారి లేస్తే తెల్గీ కథలూ, ఆబూ సలీం ప్రణయాలూ

దావూద్ ఇబ్రహీంలూ, టైగర్ మెమూన్ల సాహస గాథలు
ఈనాటి దినపత్రికల పతాకాలు
తాంతియా తోపే, భగత్‌సింగ్, అల్లూరి, కట్టబ్రహ్మనల స్ఫూర్తి
ఆనాడు ఆకాశానికెత్తిన విజయ పతాకలు
సమాజ సంస్కరణకు వీరేశలింగం చెప్పిన కొత్త భాష్యం
వివేకవర్ధని అనే లౌడ్‌స్పీకర్ ప్రజ్వలించే వార్తాప్రసారం
తెలుగు బ్రౌణ్యాన్ని చరాస్తిగా పంచి యిచ్చి
తెలుగు వ్యాకరణానికి తొలి పాఠాలు నేర్పిన
బ్రౌను శాస్త్రి జ్ఞాపకాలు యింకా పచ్చిగా, పచ్చగా పరిమళిస్తున్న దినాలు
(రెండేళ్ళ ముందే ఆయన కాలధర్మం చెందారు)
కడప జిల్లా కల్నర్ మెకంజీ కైఫీయత్తులు
ఆనాటి జన జీవనానికి అద్దం పట్టే ఉపనిషత్తులు
అప్పటి నా రాక
జాతీయాభ్యుదయానికి కీర్తి పతాక

* * *

నేటిని నిరసించి రేపుని స్వాగతించడం మానవుడి బలహీనత
ఇంటికొచ్చిన అతిథిని కంటగింపుగా చూసి
రేపు ఒరగదీస్తుందనుకోడం ప్రలోభం
ఇవాళ ముఖం చెల్లడం లేదని పెట్టిన యింటిని వీధిని పెట్టడం యిష్టం లేదు
మళ్ళీ నేను వచ్చేనాటికి ఈ యింటిని తలుచుకొంటేనే కష్టంగా వుంది –

2060

ఆనాటికి పంచాంగాలుంటాయని నమ్మకం లేదు
నా పేరు చెప్తే ఐడెంటిటీ సర్టిఫికెట్ అడిగే రోజులొస్తాయి –
ధృవాల్లో మంచుకరిగి సముద్రాలు ఆగ్రహిస్తాయి
దేశాలకి దేశాలను తమలోకి అతి క్రూరంగా కబలిస్తాయి
రేపటి ఉపద్రవాలకి నిన్నటి త్సునామీ కేవలం మచ్చుతునక
కొన్ని క్షణాల భూమి కదలిక కొన్ని దేశాల భౌగోళిక పరిధుల్ని చెరిపేసింది
దాని పేరు కత్రీనా అన్నా కంఠాభరణం అన్నా

నగరాలకి నగరాలు పునాదుల్తో కదులుతాయి
పీల్చే ప్రాణవాయువు మీద రేషన్
ఎవరి ఊపిరి డబ్బాల్ని వాళ్ళు మోసుకుతిరగడం ఆనాటి ఫేషన్
తాగే నీటిని కొనుక్కొనే సరదాని ఈ మధ్యనే ప్రారంభించాం
కొనుక్కోవాలన్నా దొరకని కొరతని అచిరకాలంలోనే ఆహ్వానిస్తున్నాం
నీటిని మిగుల్చుకోడానికి శతఘ్నులు పేలుతాయి
అన్నవస్త్రాల కోసం అణ్వస్త్రాలు చెలరేగుతాయి
ఇరవయ్యో పడిలోనే శరీరం అరవయ్యేళ్ళ అలసటని చూస్తుంది
అడవులు మాయమయి సిమ్మెంటు జనారణ్యాల మధ్య
ఖరీదయిన గోరీలకి మానవుడు యిప్పట్నుంచే యిటుకలు పేర్చుకుంటున్నాడు
పుష్పాలకీ ప్రతి ఫలాలకీ చక్కని రాయబారుల్లాగ నిలిచిన
సీతాకోకచిలుక రసాయనపు జాడీల్లో నిన్నటి గుర్తుగా ఘనీభవిస్తుంది
పర్యావరణం పవిత్రంగా పలుకరించదు
పూచిన మామిడులూ, శరత్కాలపు వెన్నెలలూ
నిన్నటి కుసుమ కోమలత్వాన్ని మరిచిపోతాయి
ఆకలికి ఆకులు నమిలే పశుప్రవృత్తి
సింథటిక్ పదార్థాలతో పొట్టనింపుకొనే మానవుడిని పరిహసిస్తున్నట్టనిపిస్తుంది
శ్రీనాథుడు ఉట్టంకించిన ద్రాక్షాపానక కండ శర్కరలు
రంభాఫలశ్రేణులు కట్టుకథల్లాగ కనిపిస్తాయి
అద్దంలో ముఖం చూసుకోవడం ఇప్పట్నుంచే ప్రారంభించండి
ముఖం చెల్లని విషయం చెప్పడానికి
ముందు ముందు 'రేపు' వుంటుంది కాని అద్దం వుండదు
కావలసిన దానికన్నా ఎక్కువగా ప్రకృతిని దోచుకుంటూ
అక్కర్లేని బరువుని గ్రహానికి పంచుతున్నాం
పర్యావరణం ప్రకృతి బహూకరించిన వరం
కొల్లగొట్టడం మానవుడు అలవరచుకొన్న వ్యాపారం
విజ్ఞానం విచక్షణకి విత్తులు నాటాలి
సంజాయిషీ అడగలేని రేపుని రేప్ చెయ్యకూడదు

*  *  *

మీరెంత నన్ను ఈసడించుకున్నా
'రేపు'ని రక్షించడానికి 'నేడు'కి ప్రాణం పోయండని అంటుంటాను
కారుచీకట్లు ముసురుకొనే సుదూర భవిష్యత్తులో
కాంతి కాంత వెదికినా పలకరించదని హెచ్చరిస్తూంటాను
తప్పులు ఎత్తి చూపే అవకాశాన్ని వార్షికంగా మోసుకువచ్చే సంప్రదాయాన్ని
గడిచే కాలానికి నా పేరు కేవలం గుర్తు
నడిచే మానవుడి గమనానికి నా రాక సైన్ పోస్ట్
దిక్సూచిని తిట్టుకున్నా ప్రయాణం ఆగదు
దిక్కులు చూస్తే చేరాల్సిన దిశగా ప్రయాణం సాగదు
హెచ్చరించడానికే కాదు, భుజం తట్టడానికీ వచ్చాను
పుష్పబాణ శరుడినీ, ఎలకోకిల కూజితాల్నీ వెంటబెట్టుకు వస్తే
పగటి వేషగాడని వెక్కిరిస్తారని
మఫ్టీలోనే బిక్కుబిక్కుమంటూ వచ్చాను
మీ హితుడిని, స్నేహితుడిని
ఆత్మీయుడిని, భవిష్యత్తుని చదివే క్రాంతదర్శిని
మీరు చేస్తున్న దుబారాని పేరుతోనే హెచ్చరించే వ్యయాన్ని
అర్థం చేసుకొంటే అవ్యయాన్ని
రేపుకి ఆశీర్వాదాన్ని
అడుగులో అడుగులేస్తూ నడిచే ఆత్మబంధువుని
పేరు చూసి ముఖం తిప్పుకోకండి
అవసరమయితే చిరునవ్వుల్ని ఎరువు తెచ్చుకుని
ఆశల్ని ఆశాంతాలవరకూ అలంకరించుకొని
చేదుపచ్చడితో తీపి ఆలోచనల్ని రంగరించి
మంగళహారతులిచ్చి – ముంగిట్లోకి ఆహ్వానించండి
మంచుకొండలాగ పరవశించి
మీ జీవితాల్ని రస సింధువుల్ని చేస్తాను –



# స్వాతంత్ర్య గీతం



## అరెస్టు వారెంటు

ఏమిట్సారంటారు? మీ మాట సరిగ్గా వినిపించడం లేదు
ఏదో వచ్చిందని తమ ముఖం వెలిగిపోతోంది
ఏమిటి వచ్చింది? ఎక్కడికి వచ్చింది?
ఎక్కడి నుంచి ఎక్కడిదాకా వచ్చింది?
ఎక్కడికి రావాల్సింది ఎక్కడికి ఎలా వచ్చింది?

సారీ సార్ – మైకు సరిగ్గా పనిచెయ్యడం లేదు
"స్వాతంత్ర్యం వచ్చింది" అమ్మయ్య –
ఇప్పటికి మీ అంతరంగం బోధపడింది
ఇంకా నయం –
ఇరాన్‌లో భూకంపం వచ్చింది
ఊళ్లోకి సెక్సు సినిమా వచ్చింది
గూడెంలోకి ఎలుగుబంటి వచ్చింది –
అని తమరు చెప్తారనుకొన్నాను
"ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది" –అమ్మమ్మ
విషయం తాచుపాము విషంలాగ యిప్పటికి బాగా తలకెక్కింది
నా చిన్నతనంలో – విశాఖలో పడ్డ బాంబులు పసితనాన్ని కాటెయ్యకుండా
మేడమెట్ల కింద దూది బస్తాల్లో
మమ్మల్ని దాచిన ట్రాన్స్‌పరెంట్ రోజులు గుర్తున్నాయి
మూడు రంగుల జెండాలు ఆకాశాన్ని
అందమయిన నక్షత్రాలుగా చెక్కుతూంటే
ఈ దేశానికి అదేదో వచ్చిందని మా
కర్థం కాని భాషలో పెద్దలు గర్వపడడం గుర్తుంది
ప్రతి భారతీయుడి గుండెల్లో ఆశల హరివిల్లు
ప్రతి మనస్సూ పవిత్రమయిన యజ్ఞవాటిక
రేపటి కలల్ని భద్రంగా పేర్చుకున్న బంగారు పేటిక
ప్రతిరోజు మలుపులో కొత్త ఉదయం
ఉదయిస్తుందన్న ఆశతో కాలాన్ని విప్పుకు నడిచిన తరం మాది
కల్లుపాకల్ని, ముళ్లపొదల్నీ, జేగురు
జీమూతాల్నీ దూసుకు సాగిపోయిన వ్యవస్థ మాది
పెద్దలిచ్చిన ఆస్థిని మేమేనాడో దుబారా చేశాం
మా బిడ్డలకి చెక్కుబుక్కులు కూడా దక్కకుండా జాగ్రత్త పడుతున్నాం
అవును సార్, స్వాతంత్ర్యం ఆ రోజుల్లోనే వచ్చింది –
కాకపోతే విషయం ఈపాటికే 43 ఏళ్లు పాత బడింది

బూజుపట్టిన పాతచింతకాయ తొక్కులాగ యిప్పుడు పాడుబడింది

* * *

అప్పుడెప్పుడో వచ్చేసిన స్వాతంత్ర్యం ఎక్కడ బస చేసిందో తెలీక
వసతులన్నీ సరిగ్గా వున్నాయో లేదో వాకబు చేసే మార్గం బోధపడక
ఉండే చోటుకి టెలిఫోన్ సౌకర్యం వుందో లేదో అర్థం కాక
మనుషుల్ని పెట్టి వెదికిస్తున్నాం
ఇంకా దొరక్కపోతే నాన్ బెయిల్ వారెంటు
జారీ చెయ్యమని అన్ని కోర్టులకీ అర్జీ పెట్టుకున్నాం
అయినా ఇక్కడే ఎక్కడో వుండాలి
గుప్పెడు స్వాతంత్ర్యమయినా గుండెలరచేత పట్టుకు దొర్కపోతుందా అని ఆశ
వచ్చిందని ఆనవాయితీగా ప్రతి పన్నెండు నెలలకీ ఒక రోజున వింటున్నాం
వచ్చాక అల్లప్పుడు మహారాష్ట్రలో
మొన్న మొన్న బీహార్‌లో, నిన్ననే పంజాబులో
వచ్చిందని కూడా కబురు విన్నాం –
కొనవూపిరితో వున్న స్వాతంత్ర్యానికి క్లోరోఫారమ్ ఇచ్చి
గుండె మార్పిడి చేశారన్న మెడికల్ బులిటిన్ చూశాం
భాషలు, ప్రాంతాల వారీగా ఎవరి వాటా
స్వాతంత్ర్యాన్ని వారు పంచుకొంటున్నారని చదువుకొన్నాం
అందులో మా వాటా కోటా ఎంతో తెలీక మదనపడుతున్నాం
పూర్తి శాల్తీ అడ్రసు పుట్టినప్పట్నుంచీ తెలీదట
పురిటి వాసన పోకుండానే దానికి నూరేళ్లు
నిండాయని నిన్నటి పెద్దలు నిట్టూర్చడం విన్నాం
అంతెందుకు?
పసితనంలోనే ముసిలితనం ముసురుకున్న
ఎలుకల్ని చంపే విషాన్ని అమ్ముకొని తనని బతికించుకొనే
సంబల్పూరు ముసలాయన్ని 20 ఏళ్ళ కిందట అడిగాను
ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది తెలుసా అని –

రానీ, నాకేం భయమా? అన్నాడు నన్ను అనుమానంగా చూస్తూ
విషాన్ని చవగ్గా కొట్టేస్తానేమోనన్న భయాన్ని
కళ్లల్లో కనిపించకుండా దాచుకొంటూ
ఈ మధ్య గుమ్మడిపూండి దగ్గర 'మక్కా చోళం' అమ్ముకునే
ముత్తులక్ష్మిని పలకరిస్తే పొగైళ్ నమిలి నమిలి ఊడగా మిగిలిన
రెండు పళ్లతోనవ్వి "వస్తే నాకేం?" అంది వచ్చీరాని తెలుగులో
50 మిలియన్ల జనాభాలో సగం మందికి వచ్చిందని తెలీదు
సగం మందికి రావాలని తెలీదు
కొందరికి ఎక్కడుందో తెలీదు
కొందరికి ఎందుకుందో తెలీదు
'ఆనంద మఠం'నుంచి అరువుతెచ్చుకున్న సుజలాం సుఫలాం గీతం
ఆధునిక కవిసమయంలాగ భాసిస్తోంది
సుశ్యామల చలిత లలిత చేలాంచలాలను కదిలించి పులకించిన
కృష్ణశాస్త్రి గారి కవిత కమ్మని కలలాగ అనిపిస్తోంది
ఇక్బాల్ 'హిందుస్థాన్ హమారా' అని బోర విరుచుకున్నా
రాయప్రోలు వారు భూమి భారతిని పొగడమని అరుచుకున్నా
అస్సాంలో హెచ్.కె.ఎల్. దాసుగారి అపహరణ
కాశ్మీర్‌లో రూబియా సయీద్ కిడ్నాప్
పార్లమెంటులోకి ఇంకా అడుగుపెట్టని సిమ్రాన్‌జిత్ సింగ్ గారి 'కిర్‌పాణ్'
మద్రాసు జకరయ్య కాలనీలో ఎల్.టి.టి.యీ మారణహోమం
వచ్చిన స్వాతంత్ర్యాన్ని ఉరి తీయడానికి
43 ఏళ్లు చాలా ఎక్కువని నిరూపించాయి
మనకి తారాజువ్వలు రువ్వుకోడానికి దీపావళి కావాలి
విడగొట్టి పంచుకోడానికి విస్తృతమయిన దేశం కావాలి
బస్సులు తగలెట్టడానికి బలమయిన నినాదం కావాలి
ఓట్లు రాబట్టడానికి పక్కవాడి బలహీనత కావాలి
నాయకులు కావడానికి నరుక్కొనే సాకులు కావాలి
శిలావిగ్రహాలు ఏర్పరచుకోడానికి చిమ్ముకొనే నెత్తురు కావాలి

దేశభక్తి గేయాలు వాడుకోడానికి రేడియోలు కావాలి
కవితలు చెప్పుకోడానికి స్వాతంత్ర్యం కావాలి
ఖద్దరు జెండా లెగరెయ్యడానికి కేలండరులో ఎఱ్ఱటి గుర్తు కావాలి
మన గొప్పతనం చాటడానికి మన తాతల మూతులకి నేతులు కావాలి
పక్కవాడి యిల్లు తగలబెట్టడానికి నీ భాషే గొప్పది కావాలి
పదవి పర్మినెంటుగా కలిసి రావడానికి ఆఫీసరుగారి బలహీనత
తెలుగుతల్లికి మంగళారతులిచ్చిన సుందరాచారిగారూ!
కాస్త ఆలస్యంగా పుట్టివుంటే కంచిలో కిరాణా కొట్టు పెట్టుకొనేవారు కదాసార్!
తెల్లవారి ఉరితాడుకి గర్వంగా శిరస్సునందించిన భగత్‌సింగ్
పంజాబులో తన వాటా తూటాలను
ఖలిస్థాన్ త్యాగధనులకు సమర్పించుకొనేవారు
గాంధీగారు దండీ మార్చి శుద్ధ దండుగని గ్రహించేవారు
పటేల్‌గారు చిన్న లా ఫర్మ్ తెరిచేవారు
అలసిపోయిన వేళ్లు
జాతి తల్లి కురుల్ని సవరించలేవు
నెత్తుటి జీర వేసిన కళ్లు
విశుద్ధాంతః కరణతో అమ్మని పలకరించలేవు
నోటిమాట వేరయిన కారణాన
అమ్మ గుండెను బీటలు తీయిస్తున్న
తమ్ముళ్ల తప్పుడు దురభిమానం
చరిత్రని చెప్పుచ్చుకు కొట్టిన ఛాయలు
ఈ స్వాతంత్ర్య దినం చెక్కిలిమీద గుర్తు పెట్టలేదా భాయీ!
భాయీ అంటున్నాను క్షమించండి
హిందీలో పిలిస్తే కొందరికయినా కోపం వస్తుంది
గవాస్కర్‌ని చూసి గర్వపడేవాళ్లూ
కొడుక్కి శ్రీరాముడి పేరు పెట్టుకు తరించేవాళ్లూ
వాళ్ల భాష వింటే బస్సులకి నిప్పెడతారు
చరిత్ర ఫ్లాష్‌బాక్ చర్విత చర్వణమే అయినా

వి(శాంతిగా నిన్నని పలకరించడానికి అదొక్కటే చలివేం(ద్రం –
అక్కడ దేశం పొలిమేరల్లో మంచు కొండలంత ఎత్తయిన మనుషులు
వారి శిరస్సుల వెనుక వెయ్యి సూర్యగోళాలు
రక్తంలో జిజియా బాయినీ, శివాజీల్నీ రంగరించి
అమ్మ పాదాల దగ్గర అహర్నిశలూ కీర్తి పుష్పాలను సమర్పిస్తారు
పరమ వీరలు, పరా(క్రమవంతులు
వారికి మృత్యువు ముగింపు కాదు
అగ్నిలాగ జ్వలించే వారి ఆదర్శానికి
యా(త్రకి అందమయిన మలుపు
చావు వారికి సంకేతం, విడిది, ఆటవిడుపు –
అక్కడ మానవ మేధకి పట్టాభిషేకం జరిపే యోధులు
ఆర్నాల్ టోయెన్బీ, కన్ఫూషియస్‌లు వైరస్‌లాగ కమ్ముకుంటూ
రేపుకి కొత్త రేపర్లు చుట్టి
అమ్మ శిరస్సుని దూది మబ్బుల్లో ఆవిష్కరిస్తారు
వారికి జీవితం ఒక అవకాశం, ఒక వరం, ఒక శిబిరం
(ప్రకృతిని పచ్చి రంగుల్లో మచ్చిక చేసి
కాలం హృదయంలో కమ్మని సంగీతం నినదిస్తారు.
వారి గళాలు గాలిని పులకింపజేస్తాయి
చేతి వేళ్ళు జాతిని మధుర స్వప్నంగా శృతి చేస్తాయి
రవీం(ద్రుడు, అరవిందులూ, హరీన్‌చట్టో
రాధాకృష్ణ పండితులూ, జిడ్డు కృష్ణమూర్తీ, గురజాడా
రమణ మహర్షి, కావ్య కంఠులూ
కాలాన్ని చమ్కీ దారాల్లాగ
తమ జీవితాల చుట్టూ పడుగు పేకల్లాగ అల్లుకుని
జీవనదుల్ని (ప్రతి భారతీయుని గుండెలోంచి
(ప్రవహించే వరాన్ని (ప్రసాదిస్తారు
నాగరకత నన్ను వెన్నుపోటు పొడిచే
పేజీ నా చరి(త్రలోంచి చించెయ్యాలనుంది


గుప్పెళ్లలో బంగారు నాణాలు గుప్పించే
సంచీ చిల్లుని గుండె అడ్డం వేసి ఆపుకోవాలనుంది
ఈ 43 ఏళ్లలో గర్వపడే ఆ నాలుగు క్షణాలనీ
నాలుగు మిలియన్ల ఏకె-47లు
సిగ్గుతో కుంచుకుపోయే యుగాలుగా తర్జుమా చేస్తున్నాయి
ఎప్పుడో వచ్చిన స్వాతంత్ర్యం చప్పుడేకాని
ఎక్కడుందో యింకా అంతుపట్టడం లేదు
పాపం, 43 సంవత్సరాల కిందటే వచ్చిందంటున్నారు
ఈపాటికి కళ్ల మసకలొచ్చి సులోచనాల అవసరం వచ్చే వుంటుంది
జుత్తు నెరిసిందేమో హెయిర్ డై వాడమని చెప్పండి
పళ్లూడితే మరేం పరవాలేదు చైనా డెంటిస్టుని కన్సల్ట్ చేద్దాం
ఇంకా కనుచూపు మేరలో కనిపించని జాతి స్వాతంత్ర్యానికి
నెల్సన్ మండేలా దేశాలన్నీ వెదుకుతున్నాడు
పిగ్మెంటేషన్ కారణంగా పీడిత వర్గంగా బతికే
దురదృష్టం నుంచి తమ వారిని మేల్కొలపాలని
జీవితాన్ని శంఖారావం చేసిన మార్టిన్ లూథర్ కింగ్
గుండెలు చిమ్మిన రక్తం మరకలు యింకా ఎండిపోలేదు
రాజకీయ వైరుధ్యాలు చరిత్ర రొమ్ముమీద అల్లిన
బెర్లిన్ గోడ మొన్న మొన్ననే కూలిపోయింది
కాని మన దేశానికి వచ్చిన స్వాతంత్ర్యానికి అప్పుడే ముసలితనం వచ్చేసింది –
మనవల్ని మళ్లీ తరిఫీదు చెయ్యమని ఆవిడకి చెప్పండి
మరో వందేళ్ల తర్వాత
మరో గాంధీగారు చెయ్యి పుచ్చుకు నడిపించుకు వస్తారు
అందాకా మా లెక్కల్లో ఆగస్టు పదిహేను చాలు
పదే పదే పద్యాలు చదువుకొని చంకలు గుద్దుకోడానికి –

*ఆంధ్రజ్యోతి వీక్లీ, 25.8.1990*

*ఆకాశవాణి, విశాఖ రేడియో ప్రసారం ఆగస్టు 15, 1990*



# ఏరిన పూలు



## నిత్య సత్యాలు

ఆ వేపు సూర్యరశ్మి తోసుకు వస్తోంది
అదే తూర్పు
ఈ వేపు దుఃఖపు తెర మూసుకు వస్తోంది
అది నిట్టూర్పు
అటు నాలుగు గొంతులు కలిసి ఆవేశిస్తున్నాయి
అది కూర్పు
ఆవేశాన్ని బలమైన లాఠీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది
అది మార్పు

నుదుటిన ఎర్రటి మంట
అది బొట్టు
నోట్లో వాడిగా మాట
అది తిట్టు
గుండెల్లో చిక్కని పొంగు
అది ఆవేశం
మెడమీద బలమైన చెయ్యి
అది అధికారం

కంటినిండా వెలుతురుంటే
మనిషి గుండెల్లో నెత్తురు
కంటి నిండా నెత్తురుంటే
మనిషి గుండెల్లో వెలుతురు –

**అంతరాలు**

ఆతడు నిజాయితీకి నివురుగప్పిన నిప్పు
ఊసుపోని బాటసారుల కాలికింద చెప్పు
ఈతడు ప్రత్యర్థుల గుండెల్లో దూసుకొనే బులెట్
అందుకే జాతి సమ్యక్ రధానికి ఎన్నికైన పైలెట్

ఆతడు నీతిని భోంచేస్తాడు
శాంతిని వాంచిస్తాడు
సత్యాన్ని అనుసరిస్తాడు
ఆదర్శాన్ని ఆహ్వానిస్తాడు
అందుకే మావూళ్లో కిల్లీకొట్టు ప్రారంభించి
అప్పుల్లో పడి ప్రస్తుతం అడుక్కుతింటున్నాడు

ఈతడు ఖరీదయిన స్కాచ్‌ని సేవిస్తాడు
సుఖానికి అనునిత్యం చీకటిని ఆశ్రయిస్తాడు
మత్తులో మదవతీ లాస్యాన్ని ఆస్వాదిస్తాడు
అప్పుడప్పుడు అవసరానికి ప్రాణాల్ని తీస్తాడు
ప్రస్తుతం చిన్న తరహా నాయకుడుగా వుంటున్నాడు
రేపటి పెద్ద పదవికి ఓట్లని నమ్ముకుంటున్నాడు

ఆతడు గాంధీని అలవాటుగా పూజిస్తాడు
దేవుడిని నియమం తప్పక ధ్యానిస్తాడు
పేదరికం భుజం మీద చెయ్యివెయ్యడం వ్యసనం
అవసరం, ఆర్తనాదాల మధ్య అతని సింహాసనం

ఈతడు గాంధీ విగ్రహాలను ఆవిష్కరిస్తాడు
దేవుడికి కెమెరా కనిపించేలాగ నమస్కరిస్తాడు
పేదరికాన్ని పేపర్లో తెలిసేలాగ గుండెలకి హత్తుకుంటాడు
ఆర్తనాదాల్ని మైకుల ముందు ఎత్తుకుంటాడు
ఆతడు మొన్ననే కన్ను మూశాడు
ఆతని వంటి మనిషి వుండడం
ఈ జాతి అదృష్టమని
ఈతడు ఆతని సమాధి మీద సున్నం వేశాడు –

## మినీ కవిత

'ఓర్పు' నిన్నటి చర్యలకు
'నేడు' యిచ్చే తీర్పు
'రేపు' నేటిని మనశ్శాంతిగా
తర్జుమా చేసే చల్లటి ఓదార్పు –

## జ్ఞాపకాలు

చీకటి తప్పుకి బీజం దాల్చిన
నా విషాద జీవితం అకాల మృత్యువుకి ఆహుతి కాబోతోంది
మా అమ్మ గర్భకోశంలో
ఆర్చుకుపోయిన మాంసపు ముద్దలాగ
అక్కడే - అలా -
అజ్ఞాతంగా అచేతనంగా వుండిపోయాను-
అనుకంపిస్తూ
మా అమ్మ దీనత్వానికి ప్రతికంపిస్తూ
నా ఊతం నుంచి పట్టకారు దయాహీనంగా నన్ను
చీల్చివేస్తున్నప్పుడు కత్తులతో కోసే నరకయాతన
అయ్యో, నేనేం తప్పు చేశాను
ఎంబ్రియో దశలోనే నూరేళ్ళు నిండడానికి
నేను చేసిన నేరం ఏమిటి?
జీవితంతో ముడిపడిన సంకెలని తెంచేశారు
చేపకి నీరులాగ - నాకు అవసరమయిన ఆఖరి మెలిక ఛిద్రమయింది
'అమ్మా' అని నిస్సహాయంగా కేకలు వేస్తూ
అమ్మ పేగుల్ని పొదివి పట్టుకోవాలని తంటాలు పడ్డాను
కాని ఎవరు నా మాట వింటారు?
రబ్బరు తొడిగిన చేతివేళ్ళు
మృత్యువుని ముక్కున తగిలించుకొన్న కత్తెరతో
నన్ను ముగింపు వేపుకి ఈడ్చుకుపోతున్నప్పుడు
ఇంకా అనుభవం చాలనిపచ్చి నెత్తురు

ఉద్విగ్నతతో ఉక్కిరి బిక్కిరి కావడం ఇంకా గుర్తుంది -
నన్ను నిర్లక్ష్యంగా విసిరేశారు
దూరం చేసిన డాక్టరు ఆనందం
దూరమయినందుకు అమ్మ నిట్టూర్పు
దూరమయిన నా భయోత్పాతం-
ఎర్రని నిప్పుమంటలు నా పూర్తి వినాశనాన్ని విశదీకరించాయి
అప్పుడిక నాలో ఏ అనుకంపా లేదు
మత్తులో ఓ సాయంకాలపు నరాల తీపికి
గుర్తుగా లుప్తమయిన ఆ అవశేషాలు
క్షణికమయిన ఈ జీవితానికి గుర్తుగా మిగిలిపోయాయి.
*(I felt no more, transient*
*I, the discarded remains*
*of drunken evening's pleasure)*

*(చాలా సంవత్సరాల క్రితం మిత్రులు దాశరధిగారు ఓ సాహిత్య అకాడమీ, మద్రాసు సభలో ఒక అద్భుతమయిన ఆంగ్లగేయం చదివారు. ఓ 12 ఏళ్ళ అమ్మాయి - క్రిస్టినా డాబ్స్ - అనే పిల్ల - వేల్స్‌లో లెవిలిన్ స్కూలులో చదువుతున్న అమ్మాయి - స్కూలు పోటీలకి ఒక కవిత రాసింది. ఆ కవితని ది టైమ్స్ లండన్ పత్రికలో ఎడిటరు ప్రత్యేకంగా ముందుమాట రాసి ప్రకటించారు. అది విని ముగ్ధుడినయి నాకా కవిత పంపమని దాశరధిగారికి రాశాను. ఆయన స్వదస్తూరితో రాసి పంపిన కాగితం దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఇప్పటికీ నా దగ్గర వుంది. ఆ కవితని ఎంత మంది మిత్రులకు చదివానో లెక్కలేదు. ఇంకా తనివితీరక నా మాటల్లో తెలుగులో పెట్టాను. ఎంత ప్రయత్నించినా ఆఖరి మూడు వాక్యాలూ నాకు తృప్తిగా తెలుగులోకి రాలేదు. అందుకనే వాటి సౌందర్యం అందాలని ఆ మూడు వాక్యాలనీ ఇంగ్లీషులో పొందుపరిచాను. ఇప్పుడా అమ్మాయి ఏం చేస్తుందో! ఇంత గొప్ప అభినివేశం పెరిగి పెద్దయ్యాక ఏ రూపు దిద్దుకొందో అనుకొంటూంటాను!)*

## బడ్జెట్ ప్రతిపాదన

హార్దిక మంత్రిగారు బడ్జెట్ ప్రతిపాదిస్తున్నారు –
ప్రజా సంక్షేమానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు
"ప్రతి వ్యక్తీ సుఖంగా బ్రతకాలన్నదే మా ధ్యేయం
అందరికీ సమానంగా సుఖాన్ని పంచాలన్నదే మా ఆశయం

అందుకనే కొత్త ప్రతిపాదనల్ని చేస్తున్నాను
సభ్యుల్ని వీటి గురించి మరీ మరీ ఆలోచించమంటున్నాను
ఆలోచించాకే చేతులెత్త మంటున్నాను –
మనిషికి ఉండాల్సిన దాని కంటె ఎక్కువ సుఖం వుండకూడదు
మనుగడ కప్పని మింగిన పాములాగ మాగన్ను పెట్టకూడదు
సుఖం మరీ కొందరి దగ్గరే మురిగిపోతోందని మాకు రిపోర్టులు వచ్చాయి
దాన్ని బయటికి లాగి నలుగురికీ పంచాలనే మా ప్రయత్నం
మనిషి చిరునవ్వుకి కొరత ఏర్పడింది
అందుకని చిరునవ్వుల మీద సీరియస్‌గా కంట్రోలు అమలుపరచ దలిచాం
ఇకనుంచి వారానికి ఒకసారి కంటె
మనిషి ముఖం మీద చిరునవ్వు ఖర్చు కారాదు
ప్రత్యేకమయిన కారణం చూపగలిగితే తప్ప రెండోసారి నవ్వుకోరాదు
సుఖం ఎక్కువయితే బాధ్యత బరువు మోయడం
తగ్గిపోతుందని ముందే చెప్పాం కదా!
చీకటి బజారులో సుఖం విరివిగా చలామణీ అవుతోందని అభిజ్ఞ వర్గాలు చెప్తున్నాయి
ఇకముందు అలా జరగకుండా గట్టిగా కట్టుబాట్లు చేస్తున్నాం
చీకట్లోనయినా కలకంఠ వధూకల కాకళీ ధ్వనులూ
శింజిత మృదుపద మంజీరాలూ
మధురాధర పానాలూ పూర్తిగా బహిష్కరిస్తున్నాం
డబ్బుకి చిల్లరగా దొరికే చీకటి సుఖం లెక్కల్లోకి రావడం లేదు
అనధికారంగా మనిషికి సుఖపడే హక్కు లేదు
నిబంధనల్ని పాటించడం లేదని రూఢిగా తెలిస్తే
నేడో రేపో వారకాంత ఓరచూపుల్నీ
బట్ట బయలు చేసే బజారు యవ్వనాన్నీ
రంగులు పులిమిన కిరాయి పెదవుల్నీ జాతీయం చెయ్యక తప్పదు
చతుర్ముఖ పురాణ పారంగతులమీదా
హయమేధయాగాన్ని గావించే సోమయాజులమీదా
అర్ధరాత్రి మునిసిపాలిటీ దీపం కింద చప్పుడయే గాజులమీదా

ఆకలి కడుపులో మెలితిప్పుతున్నా
విస్కీ వాసన కింద నలిగే అరవిచ్చిన పెదవుల మీదా
మదవతీ నగ్నసౌందర్య పిపాస మీదా
ప్రేయసి స్నిగ్ధ కోమల దరహాసం మీదా
నమ్మకంగా సర్ ఛార్జీలు విధిస్తున్నాం –
మధ్యాహ్నం నిద్రని మధ్య తరగతి ఉద్యోగులు
బాగా మరిగారని ఈ మధ్యే అర్థమయింది
ఇది ప్రభుత్వం సహించరాని భరించలేని నేరం
సుఖాన్ని పట్టపగలే దోచుకోవడం
అందుకని లంచ్ టైముని రద్దుచేసి
ఠంచన్‌గా పది గంటలు పనిచేసే కార్యక్రమాన్ని నిర్దేశిస్తున్నాం
ప్రేమ కూడా ఈ మధ్య చట్టా వ్యాపారంలో
పట్టు తప్పిపోయిందని మీ అందరికీ తెలుసు
కల్తీలేని ప్రేమ కనుమరుగయిపోయింది
అందుకనే ప్రేమించుకోడానికి పర్మిట్ల సిస్టం నిర్ణయించాం
ప్రతి వీధి చివరనీ చౌక ప్రేమ దుకాణాలు తెరిపిస్తున్నాం
సినిమాల్లో ప్రేమ విరివిగా ప్రవహిస్తోందని కేరళ సభ్యులు కస్సుమంటున్నారు
ఆచూకీలు తీసి అసలు రహస్యం తెలుసుకొన్నాం
సినిమా ప్రేమకి ఫేస్ వాల్యూ అంతగా లేదని బేరీజు వేసుకున్నాం
అందుకని రిబేటుమీద ఆ ముడి సరుకుని సభ్యుల అనుమతితో వదిలిపెడుతున్నాం
రసపిపాసువులకి పన్నుల మినహాయింపు చెయ్యాలని ఎంతగానో ఆలోచించాం
ఇది మైనారిటీ వర్గం కనుక ఎక్కువ చెల్లుబడి లేని సరుకు కనుక
కొంతలో కొంత మినహాయింపు చెయ్యవచ్చని నిర్ణయానికి వచ్చాం
సాహిత్యాన్ని చదివి ఆనందాన్ని సంపాదించుకొనేవారికీ
కర్ణాటక సంగీత శ్రోతలకీ, ఆధునిక నాటక ప్రేక్షకులకీ
రేడియోలు వినే వాళ్ళకీ, పత్రికలు చదివే వాళ్ళకీ
ఆనందం మార్జిన్ తక్కువ కనుక అంతంత మాత్రంగా వదిలిపెడుతున్నాం
ఇంకా మంచితనం మీదా, దైవ చింతనమీదా

స్నేహశీలతమీదా,  మనశ్శాంతిమీదా
విరివిగా రిబేటు యివ్వడానికే నిశ్చయించుకున్నాం
ఎందుకంటే వీటివల్ల ఎక్కువ సుఖం దేశానికి నష్టం కావడం లేదు
ప్రియురాలి వేలి గోళ్ళమీదా, జవరాలి కళ్ళ కొసలమీదా
పెదవులకు రాసే రోజా రంగుమీదా
హృదయంలో రేగే మజా కోరికల మీదా
బీదవాడి ఆశమీదా, రిక్షావాడి అరువు ఖాతామీదా
పన్నీరుమీదా,  పళ్ళపొడిమీదా
అజీర్ణ వ్యాధి మాత్రల మీదా, సుఖవ్యాధి ఇంజెక్షన్ల మీదా
కుక్కపిల్ల విశ్వాసం మీదా, గుమాస్తాగాడి ఆదుర్దా మీదా
కఠినంగా పన్నులు వేస్తున్నాం
వీటి ద్వారానే ఎక్కవ సుఖం లీక్ అవుతోందని
ఇవే లోకంలో వీక్ పాయింట్స్ అని మాకు రిపోర్టులు వస్తున్నాయి
నీళ్ళ కొరతకీ మాకూ ఏమీ సంబంధం లేదు
కన్నీళ్ళు విరివిగా ఖర్చుపెట్టుకోవచ్చు మాకేం అభ్యంతరం లేదు
పోయిన దానికోసం ఏడిస్తే మేం లెక్క రాసుకోం
లేనిదానికోసం కారిస్తే కన్నీటిమీదా పన్ను వెయ్యక తప్పదు
అన్నిటికీ అన్ని కట్టుదిట్టాలూ చేశాం
ఈ దెబ్బతో మన దేశంలో ‘సోషలిజం’
పాగా కొయ్యలాగ పాతుకుపోతుందనడంలో అతిశయోక్తి లేదు
కాకపోతే, ఒక్కటే మా చేతికి అందనిది మిగిలిపోయింది
మనిషిని రెచ్చగొట్టే అన్ని సుఖాల్నీ కట్టుదిట్టంలో పెట్టాం
కానీ నిద్రపోయేటప్పుడు కనే కలల్ని ఎలా ఖాతాలో చూపాలో అర్థం కాలేదు
అయితే సభ్యులకి ఒక హామీ యిస్తున్నాం
సుఖపడే అన్ని అవకాశాలూ మన చేతుల్లోనే ఉన్నాయి కనుక
కలగనే ఒక్క అవకాశాన్నీ తప్పనిసరయి మినహాయిస్తున్నాం

*కళాసాగర్ ప్రత్యేక సంచిక*

## చీకటి ఆకాశం మీద...

చీకటి ఆకాశం మీద నెలవంక కనిపించగానే
పంటి నొక్కులో కరిగిపోయే నీ కింది పెదవి గుర్తుకొచ్చింది

ప్రతి ఉదయం నువ్వున్న ఈ ప్రపంచంలో
కళ్ళు విప్పుతున్నానన్న ఆలోచనని ఎప్పుడూ మరిచిపోను

నాచుట్టూ వున్న ప్రపంచం నిద్రపోయే వేళ
నీ మీద ఆలోచనలు మేల్కొన్నాయి

నీ నుంచి ప్రేమని ఆశించడంలో
స్వార్థపరుడిని కావడానికి కూడా సిగ్గుపడను

ప్రేయసి గురించి ప్రియుని బాధ ప్రపంచానికి పాత కథ
నీ గురించిన నా తపన నాకు కొత్త వ్యధ

వెన్నెట్లో తడిసిన చెట్లు ఈ రాత్రి ఠీవిగా, నిశ్చింతగా నిలబడ్డాయి
నీ చల్లటి, తియ్యటి అనుభవాలకి తల మునకలయిన జీవితంలాగ

అప్పుడే అభ్యంగన స్నానం చేసిన ఆడపడుచులాగ వుంది ప్రకృతి
ఈ ఉదయం, నువ్వు నాలో రేపిన కొత్త ఆశలాగ

ఎన్నో వందల మైళ్ళ దూరంలో వున్న నీ గురించి ఆలోచిస్తూ
వెన్నెట్లో పడుకొంటే రెండు విషయాలు తోచాయి –
మనిద్దరిమీదా వున్నది ఒకే వెన్నెల చాందినీ
మనిద్దరిలోనూ వున్నది ఒకే ఒక్క ప్రేమైక హృదయం –

మగవాడికి తియ్యటి కల ఆడది
ఆడదానికి తియ్యటి అనుభవం మగవాడు

నువ్వు నా జీవన ప్రాంగణంలోకి అడుగుపెట్టాకే
మళ్ళీ నా కలం ఈ ప్రేమ రసైక జీవిని మేలుకొలిపింది

ప్రతి ఆలోచనలోనూ కొత్తగా దర్శనమిచ్చి
ప్రతి దర్శనలోనూ కొత్త ఆలోచనని రేకెత్తిస్తున్నావు నువ్వు

జీవితాన్ని భగవంతుడు ప్రసాదించాడేమో గాని
దాని అమృతమయం చేసుకోగల వరాన్ని నువ్వే యిచ్చావు

**నీ ఆలోచనల్తో...**

నీ ఆలోచనల్తో అలసిపోయిన
ఈ దీనుణ్ణి రాత్రి సేద దీర్చింది
కాని 'ఉదయం' తట్టి లేపి నిన్ను మళ్ళీ గుర్తు చేసింది –

చాలా మంది తీరని సమస్యలతో జవాబులు వెతుక్కుంటూ
దీపం లేని నీ యింటి చుట్టూ తచ్చాడారు –
కాని నువ్వు నిశీధివి

అప్పుడే అభ్యంగన స్నానం చేసిన
ఆడపడుచులాగ వుంది ప్రకృతి
ఈ ఉదయం –
నువ్వు నాలో రేపిన కొత్త ఆశలాగ

అర్థం లేని నా బతుక్కి నువ్వు
వర్షాతప సమయంలో సోకిన చల్లటి గాలి తెరవి –

చీకటి అంటే నువ్వు దగ్గరలేవే అన్న ఆలోచన
వెలుగు అంటే – నువ్వు ఎప్పటికన్నా వస్తావన్న విశ్వాసం

కాలం విరహతప్తుడికి ఇనుప సంకెల
ప్రణయ ముక్తునికి బంగారు తూలిక

కోరికతో నీ కళ్ళ కాటుకని చూస్తూ
నీ చేతి వేళ్ళు ఎంత సుకుమారమైనవో అర్థం చేసుకున్నాను

నేను గొప్పవాడినని మానవుడు గర్వపడినప్పుడల్లా
అటువంటి మనస్సునిచ్చినందుకు
భగవంతుడు సిగ్గుపడతాడట !

మనస్ఫూర్తిగా నువ్వు నవ్వే చిరునవ్వులో

నా సంశయాలన్నీ సమాధానాలు వెదుక్కొంటాయి

జీవితం నీ సాన్నిధ్యంలో యింత బాగుంటుందని తెలిస్తే
ఇంకా కొన్ని సంవత్సరాలు ముందు పుట్టేవాడిని

వేలికి తగిలిన గాయం నీ స్పర్శకి మానిపోయిందే !
మరి మనస్సుకి తగిలిన కోరికలు
నీ స్పర్శకి రేగి బాధిస్తాయేం !

నువ్వు చాలా క్రూరురాలివి
నువ్వు లేని క్షణాలలో నేను నరకం అనుభవిస్తానని తెలిసీ
లేని క్షణాలనే వదిలిపోతావు

దుఃఖం కురిసిన నీ ముఖం
హృదయంలో బాధనంతా వర్షించి
నిర్మలమయిన ఆకాశమయింది –

వసంతకాలంలోనే చెట్లు ఎర్రగా చిగురిస్తాయి
కాని ఎల్లకాలం వసంతం నీ పెదవుల మీద విడిది చేసి వుంటుంది

ఆనందం అంటే – మనస్సుకనే తియ్యటి కల
అనుభవం అంటే – కల నిజమైనప్పటి అనుభూతి

రాబోయే వేలాది సంవత్సరాల అదృష్టాన్ని నీలో దాచుకొన్నాను
గడిపే వందలాది అమృతఘడియలు సాక్ష్యంగా

ఇప్పుడే మేల్కొంటున్న ఉదయాన్ని
'మంచు' కప్పి నిద్రపుచ్చుతోంది
నా కోర్కెల్ని నీ చిరునవ్వులాగ

ఈ హృదయోద్యానంలో ఎన్నోసార్లు కోరికలు మొగ్గ తొడిగాయి
కాని నీ శీతల తనూ స్పర్శకి –
ఇన్నాళ్ళకి ఒక్క పుష్పమే వికసించింది
ఇక అది వాడదు, నన్ను వీడదు –

## అవ్యవస్థ

నా మేధస్సు చేస్తున్న జామెట్రీ లెక్క ఎప్పుడూ తప్పే అవుతోంది
నా మనస్సు వ్రాస్తున్న పొయిట్రీ కూడా ఎక్కడో పట్టా తప్పుతోంది
అయినా –
జామెట్రీ నుంచి పై మెట్టు ఎక్కించింది పొయిట్రీ
పొయిట్రీ నుంచి పైకి పాకిస్తోంది కీర్తి 'ట్రీ'
అప్పటి నా జీవితానికి ఒక త్రోవ లేనట్టే
ఇప్పుడూ నా త్రోవలకి ఒక జీవితం లేదు
ఇంకా ఆలోచిస్తానంటుంది మనస్సు
ఇంకా ఆవేశిస్తానంటుంది యశస్సు
భగవంతుడు గీసిపోయిన ఈ రేఖా చిత్రంలో
బాగా తెలియని గీతలు భయపెడతాయి నన్ను –

*ఆంధ్రప్రభ వీక్లీ, 31.1.1962*

*(నేను రాసిన తొలినాటి గేయం. అవి చిత్తూరు ఆంధ్రప్రభ దినపత్రికలో పనిచేస్తున్న రోజులు. బుద్ధవరపు చినకామరాజుగారు వారపత్రికని చూసేవారు. ఆయన తీసుకొని ఈ గేయాన్ని ప్రచురించారు. ఈ గేయం రాసే నాటికి నాకు పెళ్లయి 57 రోజులయింది.)*

## పెద్ద పులికి పెంపుడు జంతువు

చెల్లెమ్మా
ఆడదానివి
అందమయినదానివి
అర్ధరాత్రి గుండె మీద ఎందుకు పచార్లు చేస్తున్నావు ?
అర్థం కాని దృక్కులతో ఏమిటి విచారిస్తున్నావు ?

అలసిన దాన్ని
ఆకలి బలిసిన దాన్ని
అందాన్ని అవసరానికి అమ్ముకొంటున్నాను
కోరికని కొసవరకూ నమ్ముకుంటున్నాను

చీకటి చిక్కులు విప్పుకుంటున్న వేళ
లోకమంతా మత్తుగొంటున్న వేళ
లేదా నీకు భయం ?
ఎవరిచ్చారమ్మా అభయం ?

చీకటి ముక్కున చిక్కుకున్నదాన్ని
ఛిద్రమయిన జీవితానికి చితి పేరుస్తున్నదాన్ని
భయమే నాకు అభయం చెబుతుంది
మృత్యువే నాకు తోడయి నిలుస్తుంది

అయ్యో, చెల్లెమ్మా
అనవసరంగా తప్పు తోవ పట్టావు
మా అందరిలాగే పుట్టి
పెద్దపులులున్న నగరంలో కాలు పెట్టావు

అందరిలాగే పుట్టాను
పుడుతూనే ఆశలకు అందమయిన గోరీ కట్టాను
నా గురించి ఆలోచించకన్నా
పెద్దపులులకే నమ్మకమయిన పెంపుడు జంతువును

*రచన : 25.3.1974, ప్రచురణ : ఆంధ్రప్రభ వీక్లీ 20.5.1981*

## అమెరికా పాటలు

అమెరికాలో ప్రతివాడికీ కారుంటుంది
మూటలు నెత్తికెత్తికున్న కలలుంటాయి
ఒక్కసారి 'రేపు' కడుపు విప్పితే
ముగింపుకు నోచుకోని వందల కథలుంటాయి

ఇంటిచుట్టూ వొత్తుగా పెరిగిన లానుంటుంది
జేబుకి సరిపడా ప్లాస్టిక్ కరెన్సీ పర్సుంటుంది
అన్నిటికన్నా ముఖ్యం
అప్పుడెప్పుడో ఇండియాలో వదిలొచ్చిన
అమ్మానాన్నల గిల్టు ప్రేముంటుంది

వొంటిమీద సేల్‌లో కొనుక్కొచ్చిన సెంటులు
ఫ్రిజ్‌ల నిండా కరుడుగట్టిన నిన్నటి దేశవాళీ వంటలు
వాటిమాటకేం గానీ

వారానికోసారి ఇండియాని పలకరించడానికి
కేటాయించిన విలువైన గంటలు

చచ్చుబడి ఈడిగిలబడే అమెరికా తెలుగు
ఇంకా ఆలోచనలోనే మిణుక్కుమనే సంప్రదాయపు వెలుగు
ఆత్మవంచనకు ఆరో ప్రాణం పేరు
అమెరికాలో స్వజాతీయ మూలుగు

ఎక్కడికి పోతుందో ఇండియాలో క్రమశిక్షణ
అమెరికా జీవికకి అది తప్పని రక్షణ
బద్ధకానికి కూడా కాళ్ళూ చేతులూ మొలిచి
ముద్దుగా వికసిస్తుందిక్కడ

అక్కడ ఎవరికి వాడే ఖరీదయిన బానిస
గొప్ప జీవితానికి అది రేపరు చుట్టిన మూస
అలవాటు కావాలే గాని
ఏడుపొచ్చే చాకిరీ చిరునవ్వు ముఖం పేరు మోనాలిసా

తెలుగుదేశంలో తెలుగుకి అమెరికా జబ్బు
అమెరికాలో అందరి మీదా అందమయిన తెలుగు మబ్బు
ఎవరి వెర్రి వాళ్ళది – కుండ బద్దలు కొట్టాలంటే
మొరాయిస్తుంది నిబ్బు

ప్రతీ యేటా తెలుగుదనం వెల్లివిరుస్తుంది
సంవత్సరమంతా అది ఆంధ్రాలో పొయ్యిలో పిల్లవుతుంది
డాలర్లు కురిపించాలే గాని
ఏ దేశంలో నయినా మన తేజం వొళ్ళు విరుస్తుంది

సాలీనా మేం ఎలా వుండాలో మీరు చెప్తున్నట్టుంటుంది
ఆంధ్రాలో అమెరికా పైత్యం అర్రులు చాస్తూంటుంది
తెలుగువాడి రుచి పొరుగింటి పుల్లకూర
ఏ రోజుకారోజు వాతాపి జీర్ణం అని తేనుస్తూంటుంది.



# హైకూలు



**భయం**

వెలుగులో నిలబడ్డవాడు
సందేహాన్ని సంధించిన
అజ్ఞానం –

**నమ్మకం**

కారు మబ్బుల అవసరం లేకుండా
అనవరతం కురిసే
వానజల్లు

**రేపు**

అనుభవించే నేడు
కళ్ళబడకుండా
రెప్పల్ని కప్పే
కంటివాపు

**ఆదర్శం**

నడిచే మార్గంలో
ముళ్ళ తీగెల్ని, పల్లేరు కాయల్ని
పక్కకి సవరించే
పెద్ద దిక్కు

**కల**

వాస్తవంలోకి
తర్జుమా కాలేని
కోరికల కారు జీమూతం

**పుస్తకం**

వెనుకతరాల
అనుభవాల్ని మనకోసం
వడబోసిన
పళ్ళరసం

## సాయంకాలం

ఆలోచనల పొరలు విప్పినప్పుడు
అనుభూతుల అరలు తెరుచుకుంటాయి
మస్తిష్కం పచ్చిగా ఉన్నప్పుడే
పంచరంగుల కలల్ని అలవాటు చేసుకుంటుంది –
స్నిగ్ధ సూర్యోదయాలు, ముగ్ధ సంధ్యాసమయాలు
కలానికి బంగారు అక్షరాల మలామా చేశాయి
ఏది చూసినా దేదీప్యమానం
కదులుతున్న మాటల పూలరథం
పసితనంలోనే వసివాడని బాల్యాన్ని తాకట్టు పెట్టి
ఎనిమిదికే అనిమిషుడిని కావాలనే యావ
ఉల్లిపొరల్లాంటి ఉద్విగ్న శరత్తులు
ఊపిరి తిరగకుండా మచ్చిక చేస్తున్నప్పుడు
ఆకాశానికి దగ్గర దారికోసం అన్వేషణ

వేసే ప్రతీ చిన్న అడుగూ వామనాంశ కావాలని
కాళ్ళు నేలమీద ఉన్నా కళ్ళు నక్షత్రాల్ని వెదుకుతాయి
ఆశల అంతర్మథనానికి వెయ్యి రెక్కలు
కోర్కెల కర్మాగారానికి తలుపులు లేవు
కలల్ని కాలం రేపర్లో చుట్టి
ప్రతి మైలురాయీ అప్రతిహతంగా
ఆనందపు పొలిమేరల్ని తట్టి
తప్పటడుగులు మరిచిపోయిన తత్తరపాటు –
నాకు తెలుసు –
ఒక జీవితకాలం కృషిని
ఒక కాగితం మడతలో కుదించాలని ప్రయత్నిస్తున్నానని –
పెద్దల భుజాల దాకా రాని చిన్నతనాన్ని
పెద్ద గొంతుతో పూరించాలనుకుంటున్నానని
సానుభూతి అనే గొడుగుని
నా కలం కలకలానికి నీడ పట్టి
తలలు వంచి నన్ను సాగదీశారని –
ఉత్సాహం ఊరంత, ఉద్ధతి మాడంత
ఎంత చిన్న ఉపజ్ఞనయినా ఉద్యమం చేసుకుని
వారిలో ఒకడ్నయి వాళ్ళ రంగులు పులుముకున్నానని
నా అదృష్టం వాళ్ళు సాచిన పొడవైన చాయలు
నాకంటె ఎత్తయిన ఉన్నత శిఖరాలు
గర్వానికీ, అహంకారానికీ చోటు చాలని ఇరుకయిన ఆదర్శం అది –
ఎందరో గోమతేశ్వరులు, మరెందరో నీల కంఠులు
నాకు చిటికిన వేలు అందించి
నన్ను తమతో నడిపించిన ఉదారులు, నగధీరులు
క్రమంగా సొంత గొంతుని వెదుక్కుని
నా సంతకాన్ని లొంగదీసుకుని
ఎన్ని అగడ్తలు, ఎన్ని వైకుంఠపాళీ నిచ్చెనలు

ప్రతి ఉదయం ప్రభాత భేరీ మోగించి
ప్రతి హృదయం వేసిన అడుగుకి అనుస్పందించి
కీర్తి అనే వారకాంత చూపులు వ్యసనమయి
అహంకారానికి అంతిమ సంస్కారం జరిపించి
తలవొంచి, తలకు మించిన ప్రయత్నాల్ని చించి
నా దారికి వారధుల్ని పెంచి
అర్హతనీ, అవకాశాన్నీ సమ పాళ్ళలో పంచి
బొమ్మల తెరకూ, వెర్రి వైభవానికీ తాకట్టు పడ్డ సంధికాలం –
ఆలోచనలు పదునెక్కి, ఆవేశాలు బరువెక్కి
కలాన్ని అమ్మకానికి పెట్టిన లాభసాటి కాలమది
మదిదాకా పోని, హృదయాన్ని పలకరించని
ఎన్నో గంధభేరుండాలతో వ్యాపారం
కళని కళకళ్లాడే షోకేసుల్లో బంధించిన లాయకీ
బాంక్ అకౌంట్లూ, ఇన్‌కంటాక్స్‌లకీ గిరాకీ
మనస్సు డస్సి, హృదయం అలసి
ఊపిరిని సంధించే మరో ఊబిలోకి దూకుడు –
ముఖాన్ని నమ్ముకున్న రోజులు పోయి
ముఖాన్ని అమ్ముకునే రోజులొచ్చాయి
బుధజన సంయోగానికి శెలవిచ్చి
వెధవ్వేషాల వ్యాపారానికి దుకాణం తెరిచి
అయ్యో, అదృష్టానికి పాపులారిటీ అంగీ తొడిగి
అడ్డమయిన చిరునవ్వులకీ అర్థాంతరంగా లోకువయి
ఇంత పెద్ద ప్రపంచంలో
'పేరు' యింత అలుసా అని నిరసించి –
ప్రేమించే బలమైన వ్యాసంగాన్ని
భద్రంగా కాపాడుకుంటూ
అక్రమార్కుల వసారాల్లోంచి
విక్రమార్కుల వీరంగాలు గడిచి

మళ్ళీ ఆనాటి మౌలిక వ్యాసంగాన్ని పలకరించి
అదాటుగా దాటిన ప్రాంగణాలకు వీడ్కోలిచ్చి
నమ్మకంగా తాళి కట్టిన యిల్లాలిని
గడపదాటకుండా చిటికెన వేలు పట్టుకుని
పునః గృహప్రవేశం గావించి –
అమ్మయ్య, ఇప్పుడు రవంత విశ్రాంతి
పిల్లగాలులూ, వేణుగానాలూ మళ్ళీ పలకరించగా
అలవాటయిన లోగిలిలో అరమరికలు లేకుండా
సాగిలపడి, మనస్సును సాచి –
ఇది తెలిసిన ప్రపంచం
ఎప్పుడో తప్పనిసరయి తలుపులు మూసిన గది
నిరంతరంగా చిప్పిలే అమృత వాగ్ధధి
అహెూ, జీవన సాయంకాలం ఎంత హాయి !
ముతకబారిన సంవత్సరాల అల్లికలో
మిగుల్చుకున్న జవుళి నేత ఈ దశ
నిజమైన విలువల్ని వస్త్రకాళితం పట్టి
నీరు పట్టిన కల్లవాపును కళ్లబడనీయకుండా తట్టి
గుండెలనిండా ఆక్సిజన్
మెదడులో పవిత్రమైన ఆలోచనల విస్ఫోటనం
వయస్సంతా ముసిలితనం వ్యాపిస్తే ఎంత అదృష్టం!
రేషన్‌లేని ఆలోచనల కూడలి
ప్రేమించే ఆప్తుల రాధారి
నికార్సుగా, నిలిచే అనుభూతుల జంక్షన్
నిజమైన జీవితానికి పంక్చువేషన్
జీవితంలో ఒక్క సాయంకాలం కాలం చేసే అన్యాయం
నాకు నాలుగు సాయంకాలాలు కావాలి
రోజులో పదే పదే ఈ కాలమే రావాలి –

*ఆకాశవాణి, మద్రాసు కేంద్ర ప్రసారితం*

## విశ్వాసం

విశ్వాసం నీడ
అన్ని రకాల శంకలకూ, సందేహాలకూ
అడ్డంగా నిలిచే గోడ
మనం గుర్తించక పోయినా
మన వెంటే నడుస్తుంది
మన అస్తిత్వానికి
చక్కని అద్దం పడుతుంది
సగం సగం తెలివితేటలతో
తమ మనసుల్ని సంధించేవారికి
విశ్వాసం పీడ –

విశ్వాసం గొడుగు
అర్థంకాని ఎన్నో ఆలోచనల వర్షం నుంచి
అవిశ్రాంతంగా కాపాడే పెద్ద దిక్కు
మన తెలివితేటల్ని ప్రశ్నించదు

మనకి తెలియకపోవడాన్ని ఆక్షేపించదు
అర్థంలేని, అర్థంకాని జలపాతాల్లోకి
తలదూర్చే కుహనా మేధావులకి
విశ్వాసం పిడుగు

విశ్వాసం తల్లి
ఆత్మీయంగా మనస్సుని జోలపుచ్చుతుంది
ఆర్ద్రంగా ఆలోచనల్ని అలంకరిస్తుంది
అవసరంలో ఆదుకుంటుంది
అక్కర్లేని ఆలోచనల్ని మినహాయిస్తుంది
ఆమె ఉనికిని ప్రశ్నించే
అర్థాంతరపు 'జ్ఞాను'లకి
విశ్వాసం గోడమీద బల్లి

విశ్వాసం ముందు తరాల నిక్షిప్తం
పెద్దలు ప్రోదు చేసిన వారసత్వం
విశ్వాసం నిన్నటి నిధి
రేపటి పెన్నిధి
వర్తమానాన్ని నమ్మకంగా నిలిపే గది
విశ్వాసం నాజూకయిన పూలరేకు
దూసిన పదునైన బాకు
విదిలిస్తే మాయమౌతుంది
కదిలిస్తే కన్నతల్లయి నిన్ను కాపాడుతుంది

విశ్వాసం నీడ
విశ్వాసం గొడుగు
విశ్వాసం తల్లి
ఈ దేశపు తాత్విక సంపదను
నీకోసం నిక్షిప్తం చేసిన జీవన కల్పవల్లి –

## ప్రయాణం

నువ్వు నడిచే మార్గంలో
ఏకాంతంగా రాత్రి పరుచుకొని వుంది
పర్వత శ్రేణుల కావల
ఉదయం నిద్ర పోతోంది
తన చేతుల నీడల్ని పరుచుకొంటూ

నక్షత్రాలు నిముషాల్ని ఏరుకుంటున్నాయి
మాటల కందని ఊసుల్ని కలబోస్తున్నాయి
నీ అడుగుల సవ్వడికి నిరీక్షిస్తున్నాయి
తన దారిని వెదుక్కుంటూ చంద్రుడు
మబ్బు తెరల మధ్య ఈదుతున్నాడు

నీ కళ్ళు దారిని గుర్తుపట్టలేకపోయినా
నీ పాదాలకు లాలిత్యం తాకిన చోట అడుగువెయ్యి
ఈ దారిలో ధూళికి నా పెదాల రుచిని మప్పాను –
ఒకప్పుడు నీ పెదాలు పంచుకున్న అనుభూతిని
చీకట్లో నీ పాదాలకు దారిచూపిస్తాయని

*28.6.06*

## అన్నా! అన్నన్న!

ఇద్దరూ ఒక తల్లి బిడ్డలు
అప్పుడెప్పుడో పరధ్యానంలో మ్రగ్గినవారు
త్యాగాలతో, తిరుగుబాట్లతో తల్లి నొసట కుంకం దిద్దినవారు
అన్నయ్య ఆలోచనాపరుడు, తమ్మయ్య ఆవేశి
నష్టపోయిన రోజుల్ని నెమరువేసుకుంటూ
పెద్దల హామీల్ని నమ్ముకుని ఒద్దికగా
ఇద్దరూ ఒకటయారు
ఆలోచనాపరుడు అవకాశవాది అయాడు
తమ్ముడు తెల్లబోయినా పద్ధతికి తలవొంచాడు
అన్నయ్య అంగల్ని కొలుచుకుంటూ నడిచాడు
అవసరాల్ని కుదించుకుంటూ, అవకాశాల్ని వదులుకుంటూ
ఆవేశానికి మాటలు పొదగలేక
విశ్వాసానికి లోబడిన తమ్ముడు
అన్నయ్య పెద్దరికానికి బుద్ధిగా తలవొంచాడు

తన యింటి చూరు కన్నీరు కారిస్తే
అన్నయ్య బంగళా నీడనే చలికాచుకున్నాడు
వెనుకబడిన అంగల్ని ఎంత సవరించుకున్నా
ముందుబడిన నడకలో ముల్కీగానే మిగిలిపోయాడు
నడిచే తమ్ముడి భుజం మీద చెయ్యి వెయ్యడం మరిచాడు
గడిచే రోజుల్లో పగళ్ళు పగుళ్ళు తీయడం చూడలేదు
విశ్వాసం తిరగబడింది, విచ్చుకత్తులు దూసింది
అప్పుడెప్పుడో దాశరథి రొమ్ము విరిచాడు
కాళోజీ కంఠం విప్పాడు :
"కమ్మని చక్కిలాలొకచోట
గట్టి దవడలింకొక చోట
వాసన నూనియలొకచోట
మాసిన తలలింకొకచోట " అంటూ కలందూశాడు
తల్లిభాష తల్లడిల్లింది
తంద్రితనం వొళ్ళు విరుచుకుంది
అవకాశం వచ్చినప్పుడల్లా – అడుగు దూరం చేస్తున్నాడు
అవకాశం అన్నయ్యది – అవసరం తమ్మయ్యది –
వ్యాపారానికి జీవనావసరం తాకట్టుబడ్డది
పెద్దమనుషులు ఒప్పందం పెద్ద తప్పని కన్నెర్ర చేశాడు తమ్ముడు
ఇల్లు సర్దుకోవడం మొదలెట్టాడు సోదరుడు
కలిసి బతకడం తల్లిని మెప్పించడానికి కాదు
సంపాదనలో వాటాని కిట్టించడానికి
వార్షికంగా రాష్ట్రావతరణం వస్తుంది
ఆనందంగా తెలుగు జెండా ఎగురవేద్దాం ప్రస్తుతం
ఏ తెలుగు జెండా ఎక్కడ ఎగరనుందో
మళ్ళీ నవంబరు నాటికి మరోసారి నెమరువేసుకుందాం.

*(2011 ఆంధ్రరాష్ట్రావతరణ దినోత్సవం నాడు*
*ఆంధ్రాక్లబ్, చెన్నై నిర్వహించిన కవి సమ్మేళనంలో చదవడానికి రాసి చదవని కవిత.)*



# పాటలు



## **రంగవల్లి**

నా ముంగిట రంగవల్లి తీర్చినదెవరో
మూగవోవు యెడద మేలుకొలుపాలని
సాగిపోవు రేయినట్టె నిలుపాలని

అడగలేదు రమ్మని
అడుగు సవ్వడసలె లేదు
మరుమల్లెలు విచ్చినట్టు
మారుతమ్ము వోలెవచ్చి ॥నా ముంగిట॥

ఎదురు చూడలేదు నేడు
మది తలుపులు తెరువలేదు
కనులు చూచునంత మేర
కమ్మని తన గుండె పరిచి ॥నా ముంగిట॥
ఎన్నడిట్లు తెలవారెను
ఖిన్నమయిన హృది రగిలెను
తనబడు ఈ బతుకున తను
వెన్నెల దారిని తీర్చెను ॥నా ముంగిట॥

*(మద్రాసు రేడియోస్టేషన్‌లో ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం పాడినది)*

*18.10.1977*

**ఏదీ ఏదీ చూడనీ...**

ఏదీ ఏదీ చూడనీ
కనురెప్పల తొణికి పారు నును సిగ్గుల దొంతరలు
ఎదీ ఏదీ పాడనీ
తడిబారిన లేపెదవుల శృతిచేసిన మధురిమలు
తెలవారకముందే
మేలుకొలిపె నీ కనులు
తెలిసీ తెలియని క్షణాన
తొందరించె క్రొన్ననలు ॥ఏదీ ఏదీ॥
ఎన్నడైన నీ ముంగిట
కలల రంగ వల్లికలు
అరవిచ్చిన లేయెదలో
అందగించు మల్లియలు ॥ఏదీ ఏదీ॥

## ఎన్నాళ్ళీ తలపులు...

*నేను రాసిన ఒకే ఒక్క సినిమా పాట*

*సంగీత దర్శకుడు:శంకర్ ; సినిమా : చల్ మోహనరంగ; నటులు : కృష్ణ, దీప;*

*గాయనీ గాయకులు : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల*

ఎస్.పీ : ఎన్నాళ్ళీ తలపులు
కలల మేలుకొలుపులు
ఎగిసిపడే హృదయంలో
గడియ పడని తలపులు

సుశీల : ఎన్నాళ్ళీ పిలుపులు
మూసిన కనుకొలకులు
నువు నడిచే బాటలో
తీయని తొలి మలుపులు
తారకలే నీ కన్నుల
తోరణాలు తీర్చేనా
చిరునవ్వులు వెన్నెలకే
కొత్త సిగ్గునేర్పేనా
నిదురరాదు నిదురరాదు
నిను చూచిన కనులకు ॥ఎన్నాళ్ళీ॥

ఆమని నీ కౌగిలిలో
అలసి నిలిచిపోయేనా
ఏమని నా మనసు నిన్నే
విసిగి వేసరించేనా
విడిది చేసె మధుమాసం
చల్లని నీ లేయెదలో ॥ఎన్నాళ్ళీ॥

## ఒకటీ ఒకటీ రెండూ

ఒకటీ ఒకటీ రెండూ ఏ భాషలోనయినా
నువ్వూ నేనూ ఒకటీ ఈ దేశంలో యికపైనా

అల్లా జీసస్ బుద్ధుడు కృష్ణుడు దేవుని మారుపేర్లు
కల్లా కపటం లేని పాపలం మాకొద్దీ తారుమార్లు

పాలు ఏ దేశంలోనయినా నాలిక రుచి ఒకటే
పాపాలు ఏమనిషి చేసినా కష్టం బాధ ఒకటే

ఏ పాపయినా పలికే మాట నోరారా అమ్మాయని
ఏ నాడయినా కలిసుందాం ఒక తల్లీ బిడ్డలం మేమని

పాపల చూసి పెద్దల మనసులు ఒద్దిక నేర్వాలి
పెరిగిన పెద్దలు ఒకే జాతిగా బ్రతుకుట నేర్వాలి

*రేడియో ప్రసారం : 26, జనవరి 77*

## లాలస

ఆ మాటనబోకు ప్రభూ !
ప్రేమొకింత లేదేమని

కాన్కలీను నీ కన్నులు
కాతర భావమున జూడ
కలతపడిన హృదయము
నీ రాకను గమనించలేదు ॥ఆ మాట॥

ఎదురుచూచి ఎదురుచూచి
ఎదను మరిచి వ్యధనుపరిచి
కలలే కన్నుల చేసుక
కలవరమున కరిగిపోతి ॥ఆ మాట॥

జీవన పరిణామ చింత
మనసును మరిపించుకొంత
నీవురాని క్షణములన్ని
మలిగిన మణి దివ్వెలగును ॥ఆ మాట॥

*'లాలస' అనే నాటిక కోసం రాసినది. 1974 జనవరి 30*

## వెన్నెల రేయెటు

వెన్నెల రేయెటు వేగెనో
ఉన్న క్షణాలిటె సాగేనో
పున్నమి జాబిలి పలకరింతలు
సన్నగ సన్నగ సఖీ! పిలిచేనే
నిన్నటి బాసలు
రేపటి తలపులు
నిన్నే రమ్మని పిలిచేనే
ప్రాణ సఖీ! నా దరిని జేరి
తనూ లత నూతన లాలనలో
కనుపాపలలో కదిలే రాణి
కౌగిలిలో వాల వేలనే?
ప్రాణ సఖీ! నా మదిలో మధువై
రాగసరాగపు లాలనలో

*దాదాపు పాతికేళ్ళ కిందట పూర్ణచందర్ గారి దగ్గర*
*నేను రాసిచ్చిన కాగితం మీద ఈ పాట ఉన్నదట.*
*ఈ మధ్య దాన్ని వెలికి తీస్తే కలగా కృష్ణమోహన్ స్వరపరిపించి,*
*పూర్ణచందర్ చేతనే రేడియోలో పాడించారు.*

## ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావుకి శ్రద్ధాంజలి

పల్లవి : హృదయాన తావి చిగురించు మోవి నీ పాట అందాల దీవి
ఎదలోని బంగారు స్వప్నాలు నిజమయ్యేను నీ నోట గీతాలై

అనుపల్లవి : గుండెలో రాతిబండలో కొత్త రాగాలు పలికించెనే
కాలమే మౌన శ్రోతయై తన గమనాన్ని మరిపించెనే
॥ఓ విభావరీ। ఓహో విభావరీ॥

చరణం : మల్లెలే పూచి మనసుపడ్డాయి నీ పాట కావాలని
వెన్నెలే వేచి వెల్లివిరిసింది నీ నోట పలకాలని
వింతగా కొత్త రాగాలు కికురించి మమ్మావహించేనులే
పల్లవై బ్రతుకు పల్లవై పండి తరియించిపోవాలని
ఏనాటికీ నీపాటకే దాసోహమన్నాయిలే
మదిలో శృతియై నిలిచేవు నువ్వు
ఎన్నో తీపి మాధురీ ఝురులై
సౌందర్య సిరులై
మమతంపు విరులై ॥ఓ విభావరీ। ఓహో విభావరీ॥

చరణం : నీ పాటలన్నీ నీరాజనాలై కనులకే కలలు నేర్పాయి
నీ స్వరాలన్నీ నాగ (రాజే)స్వరాలై మనసుకే మమత కూర్చాయి
ఊసులే కొత్త బాసలై నినదించేను మా గుండెలో
రాజువై రారాజువై రసరాజ్యమ్ము నేలేవులే
సంగీతమే సంగాతియై నీ తోడు నిలిచేనులే
ఒకరే ఒకరే సాలూరు స్వామి
ఒకరే రసనకు రాజ్యాధినేత
ఆనంద గీత
సంగీత దాత ॥ఓ బిభావరీ। ఓహో విభావరీ॥

*(పల్లవి రాజేశ్వరరావు గారి గొంతులోనే ఉంచుతూ, పాటకి కొత్తబాణీని ప్రముఖ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు గారు ఏర్పరచగా, ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణి పాడారు. సాలూరి వారికి సమర్పించిన నివాళి గీత మాలికలో ఒక పాట.) ఈ ప్రక్రియ సమర్పకులు : మల్లాది సచ్చిదానంద మూర్తి, 17 ఫిబ్రవరి 2007*



# పల్లవులు



## పల్లవులు

ఎదురుచూడనిక నీ కోసం ఎన్ని నాళ్ళయిన గానీ
నా మనసు తెలుసుకొని నీకై నీవే రావాలని

⁕ ⁕ ⁕

ఒక్కసారె - ఒక్కసారె - యిటురావా నా కోసం
ముంగిటిలో వాలుతుంది చుక్కలతో ఆకాశం
ఎంత పెద్దదో ఆశ, ఈ హృదయం మోస్తుందా
నిర్వేదం గుండెలలో కత్తులనే దూస్తుందా?

⁕ ⁕ ⁕

నువ్వే నాకు కావాలని
ఆ రోజెపుడో రావాలని
నా కలలు నమ్ముకున్నవి
నీ కనులు నేర్పు పల్లవి

m a r u t e e y a m

*gollapudi maruthirao poetry*



మాటకి రెక్కలొస్తే పాట
పాట ఆలోచనకి ఊపిరి
అనుభూతికి అందమైన సంతకం,
ఓ జీవితకాలపు సుదీర్ఘ యాత్రలో
ఏ ప్రక్రియా శిల్పానికీ లొంగని
ఊహల ఉమ్మెత్తపూల తోరణం -
- మారుతీయం

*available at:* www.kinige.com